# క్రాంతి

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి :31 సంచిక :6 నవంబర్-డిసెంబర్ 2007 వెల: ఐదు రూపాయలు


**లోపలి పేజీల్లో**


కా. భగత్‌సింగ్ స్మృతిలో......................19
ప్రేమోన్మాద దాడులు............................22
డా.నార్మన్ బెతూన్ .....మధ్య పేజీలో
దంతెవాడ జైల్ బ్రేక్...............................28
కొండరెడ్ల జీవన విధానం.................29
వరి మద్దతు ధర.................................32
అమరుల జీవిత చరిత్రలు..................34
అమెరికా ఆర్థిక సంక్షోభంపై...........38
మోడీ విజయం.......................................44
పోరాట వార్తలు.....................................46


# సామ్రాజ్యవాదానికీ, ఎస్.ఇ.జడ్‌లకూ, సోషల్ ఫాసిజానికి వ్యతిరేకంగా నందిగ్రామ్ ప్రజల పోరాటం

సి.పి.ఐ (ఎం) గూండాల తుపాకుల పహారాలో, ప్రభుత్వ సాయుధ బలగాలు, సి.పి.ఐ (ఎం) నాయకత్వం క్రియాశీలక పాత్ర వహిస్తూ, పాల్గొంటూ, తుపాకులూ, మందుగుండూ, డబ్బూ నిరంతరాయంగా సరఫరా అవుతుండగా నందిగ్రామ్‌లో రాజ్యమేలుతున్న శ్మశాన శాంతి క్రమంగా తొలగిపోతున్నది. పశ్చిమ బెంగాల్‌లో నిరాయుధులైన గ్రామస్థులపైన దాడులూ, ప్రత్యేకించి మహిళలూ, బాలికలపై పెద్దయెత్తున అత్యాచారాలూ, ప్రజల ఆస్తుల్ని లూటీ చేయడం, దగ్ధం చేయడం, తుపాకులతో బెదిరించటం, నిరాయుధుల ఊరేగింపుపై విచక్షణా రహితంగా కాల్పులు జరపటం లెక్కలేనన్ని హత్యలూ, అసంఖ్యాకంగా ప్రజల్ని గాయపరచటం మొదలైన సంఘటనలన్నీ, సిద్ధార్థ శంకర్‌రే దుర్మార్గ పాలనను తలదన్ని పోయాయి. ఎలక్ట్రానిక్ మీడియా చిత్రీకరణలూ, దిన పత్రికల రిపోర్టులను చూస్తే నందిగ్రామ్ ఘటనలు గుజరాత్‌లోని గోద్రా సంఘటనానంతరం నరేంద్రమోడీ జరిపించిన నీచమైన ప్రతీకార దాడులూ, హింసా క్రమాన్ని తలపిస్తున్నాయి. తదుపరి కార్యక్రమం కోసం ఇకిప్పుడు సి.పి.ఐ (ఎం) అగ్రనాయకులు నీచమైన అబద్దాలతో, ప్రతిరోజూ టి.వి చానళ్లలో చెత్తవాగుడుతో, సి.పి.ఐ(ఎం) పత్రికల్లో ప్రచారంతో నందిగ్రాంలో 'శాంతి'ని పునరుద్ధరిస్తున్నామని ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి ఆటవిక దాడులతో, సి.పి.ఐ (ఎం) కిరాయి గూండా మూకలు ఎర్రజెండాలూ, తుపాకులు పట్టుకుని నందిగ్రామ్ అంతటా భయోత్పాతాన్ని కొనసాగిస్తూ, ఎస్.ఇ.జడ్‌లనూ, టాటాలు, అంబానీలూ, సలీంలనూ బహుళజాతి సంస్థలనూ, ప్రధానంగా అమెరికా కార్పోరేట్ సంస్థలనూ, ప్రపంచ బ్యాంకూ, ఆసియా అభివృద్ధి బ్యాంకు విధానాలనూ, భూసేకరణనూ, ప్రజల్ని తరిమివేయడమూ తదితర ప్రజా వ్యతిరేక, కార్యక్రమాలన్నింటినీ కొనసాగిస్తామనే భయోత్పాత సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారు. యు.పి.ఎ ప్రభుత్వ పూర్తి సహకారంతో కార్పోరేట్ సంస్థలూ, అమెరికా కార్పోరేట్ సంస్థల ప్రతినిధుల సహకారంతో జరగుతున్న ఈ నీచమైన నేరాలన్నీ, భారత దేశంలాంటి బూటకపు ప్రజాస్వామిక వ్యవస్థలో ఎర్రజెండా ముసుగు కప్పుకున్న పార్లమెంటరీ మార్క్సిస్టులు ప్రజల రక్తాన్ని పీల్చే దోపిడీ వర్గాల సేవకే అంకితమవుతాయనే వాస్తవాన్ని ఋజువు చేస్తున్నాయి. ఇప్పుడు సి.పి.ఐ (ఎం) బాకాలూదుకుంటూ, 'వామపక్ష' ప్రభుత్వం ద్వారా అమలు చేయాలనుకుంటున్న 'పునరావాస' కార్యక్రమానికి అర్థం హత్యలూ, అత్యాచారాలు, తూటాలూ, లూటీలూ, ప్రజల్ని నిర్వాసితుల్ని చేయటం ఎస్.ఇ.జెడ్‌ల ఏర్పాటూ, అవినీతి రేషన్ డీలర్లను కాపాడటం, హత్యలూ, మహిళల్ని అమ్మటం ఇంకా మాటలతో చెప్పలేని ఇలాంటివెన్నైనా.

నందిగ్రామ్, సింగూర్‌లపై 'నియంత్రణ' సాధించిన తర్వాత ఇప్పుడు స్వదేశీ, విదేశీ కార్పోరేట్ పెట్టుబడుల్ని నిరంతరమూ ఆహ్వానిస్తూ, సి.పి.ఐ (ఎం) తన 'పెట్టుబడిదారీ అభివృద్ధి' రాజకీయాల్ని ప్రచారం చేసుకోవడంలో తలమునకలవుతున్నది. కానీ, నందిగ్రామ్, సింగూర్‌లలో ప్రజా ఆందోళనలూ, పోరాటాలూ, దాదాపు నిత్యకృత్యమైపోయాయి. బి.యు.పి.సి (భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ కమిటీ) నెలల తరబడి ప్రజాందోళనలు నిర్వహించి, నందిగ్రామ్‌పై నియంత్రణ సాధించిన తర్వాత, తీవ్రమైన పోరాటాల ద్వారా ప్రజల చైతన్యం

పెరిగిన తర్వాత, సి.పి.ఐ(ఎం), దాని నాయకుల నిజ స్వరూపాన్ని ప్రజలు చూడగలిగారు. కోల్‌కత్తాలో అలీముద్దీన్ వీధిలోని సి.పి.ఐ (ఎం) నాయకత్వం కూడా నందిగ్రామ్‌ను వశపరుచుకోలేమని, ప్రభుత్వ సాయుధ పోలీసు బలగాల అండతో, కిరాయి గూండా మూకలను వుపయోగించి భయపెట్టడాలూ, చంపడాలూ, అత్యాచారాలు చేయడం, ఇండ్లు, ఆస్తులు తగులబెట్టటం ద్వారా ఇతర ప్రాంతాల్లో కూడా ఫాసిస్టు భూసేకరణ కార్యక్రమాన్ని సాగించటం అంత తేలిక కాదని బాగానే అర్థం చేసుకున్నారు. వాళ్ళు వివిధ రకాల మోసపుటెత్తుగడలనూ, క్రూరమైన బలప్రయోగపు మార్గాలనూ అన్వేషిస్తున్నారు. ఇప్పుడు ఈ దారుణాలకు గురైన రైతాంగమేగాక, వేలాది కార్మికులూ, విద్యార్థులూ, యువత, మేధావులూ [ఒకటి, రెండు సంవత్సరాల క్రితం వరకు కూడా సి.పి.ఐ (ఎం)కు అనుకూలంగా వున్న] కూడా భూసేకరణ, ప్రజల్ని నిర్వాసితుల్ని చేసి జరపతలపెట్టిన ప్రపంచబ్యాంకు - బహుళజాతి సంస్థలు రూపొందించిన 'అభివృద్ధి' కార్యక్రమానికి పెద్ద యెత్తున వ్యతిరేకంగా తయారయ్యారు. చివరిసారి 2007 నవంబర్‌లో అన్నివైపుల నుండి చుట్టుముట్టి, నందిగ్రామ్‌ను తిరిగి మరలా ఆక్రమించిన తర్వాత, స్వంత బలం కలిగిన వామపక్ష కూటమి ఛైర్మన్ పశ్చిమ బెంగాల్‌లోని సి.పి.ఐ (ఎం) అగ్రనాయకుడూ అయిన బిమన్ బోసు నందిగ్రామ్ మీద 'సూర్యోదయం' అయిందని ఉన్మాద ప్రేలాపనలు చేశాడు. కానీ, పశ్చిమ బెంగాల్‌లో సి.పి.ఐ (ఎం) పాలనా, ఆధిపత్యాలకు అంతిమ ఘడియలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, దాని 'అస్తమయం' ఆగదనీ ఈ మూర్ఖ నాయకులకు ఇప్పటికే అర్థమైంది. బహుళజాతి సంస్థలా, దేశీయ కార్పోరేట్ సంస్థలా, పెరుగుతున్న ధనిక వర్గంలోని ఒక సెక్షన్ యొక్క అభివృద్ధి కోసం

## నందిగ్రామ్ పునరాక్రమణ తర్వాత క్షితి గోస్వామి (మంత్రి) చెప్పిందేమిటి?

పశ్చిమ బెంగాల్ 'వామపక్ష' కూటమి సభ్యుడు, ఆర్.ఎస్.పి.కి చెందిన ప్రభుత్వ పనుల శాఖా మంత్రి క్షితిగోస్వామి. నందిగ్రామ్‌లోకి సి.పి.ఐ (ఎం) గూండాలు భయోత్పాతం సృష్టించి చొరబడిన తర్వాత, క్షితి గోస్వామి మీడియా ముందు తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు. నవంబర్ 18న టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి తీసుకున్న కొన్ని వ్యాఖ్యల్ని మార్చకుండ ఇక్కడ ఇస్తున్నాం.

*"ఇది నిరంకుశ పాలన. అందులో భాగమైనందుకు నేను సిగ్గుపడుతున్నాను."*

*"రాజీనామా ఉపసంహరించుకోమని నామీద తీవ్రమైన వత్తిడి వచ్చింది. వేరే కారణం ఏమీ లేదుగానీ, వామపక్ష కూటమి చీలిపోతుందనేదే."*

ఇప్పుడు నందిగ్రామ్ "మరచిపోలేని క్రూరమారణకాండకు గుర్తు". గుజరాత్‌లో జరిగిన దానికి, బెంగాల్‌లో జరిగిన దానికి నాకు పెద్దగా తేడా కన్పించటం లేదు. అక్కడ నరేంద్ర మోడి హిందూత్వ పేరుతో చేశాడు. ఇక్కడ పార్టీ పేరుతో సి.పి.ఐ (ఎం) చేసింది. దీన్ని ముఖ్యమంత్రి హృదయపూర్వకంగా సమర్థిస్తున్నాడు.

తన బల సంపదల పెంపునూ లేక విస్తరణవాద స్వభావాన్ని సి.పి.ఐ (ఎం) వదిలి పెట్టుకోదని గోస్వామి చెప్పాడు. కూటమిలోని చిన్న భాగస్తులను తీవ్రంగా బలహీనపరుస్తుందనీ, 1969లో జల్పాయ్‌గురి గ్రామంలో శరణార్థుల కుటుంబాలకు చెందిన 26 మంది ఆర్.ఎస్.పి మద్దతుదారులను సి.పి.ఐ (ఎం) కార్యకర్తలు కట్టేసి, సజీవ దహనం చేశారనీ, ఉత్తర బెంగాల్‌లోని ఆలీపుర్ద్వార్‌లో ఆర్.ఎస్.పి కార్యాలయాన్ని తగులబెట్టారనీ గోస్వామి చెప్పాడు. "ఈ రోజు నందిగ్రామ్‌లోగానీ, ఇంకెక్కడైనాగాని సి.పి.ఐ (ఎం) కార్యకర్తల్లో, దాని నాయకుల్లో అదే దౌర్జన్యం కన్పిస్తుంది చూడండి. ఆ పార్టీ ప్రతిపక్షాన్ని సహించదు."

నందిగ్రామ్ అగ్ని పరీక్ష ఇంకా అంతం కాలేదని గోస్వామి విశ్వసిస్తున్నాడు. గ్రామాల్లోకి సి.పి.ఐ (ఎం) "చొరబాటు" మీద వెల్లువెత్తుతున్న నిరసనలు గనుక ఒకసారి చల్లబడితే, పాటు ముఖ్యమంత్రి కొంతకాలం బహిరంగంగా మాట్లాడకుండ ఊరుకున్న నందిగ్రామ్ ఎస్.ఇ.జడ్ పథకాన్ని అది బలంగా ముందుకు తెస్తుందని గోస్వామి అన్నాడు.

"వాళ్లు ముందుగానే నమూనాను తయారు చేశారు. అందుకే సాయుధ దాడులతో భూమి ఆక్రమించి, ఎస్.ఇ.జడ్‌ను వ్యతిరేకించే వాళ్లను వెళ్లగొట్టారు" అని చెప్పాడు.

ప్రతిపాదిత ఎస్.ఇ.జడ్ కోసం ఎంపిక చేసిన ప్రత్యామ్నాయ నయాచార్ ప్రదేశం ఏదైతే వుందో, అది వాస్తవానికి నందిగ్రామ్ ప్రజల "పునరావాసం" కొరకు ఉపయోగిస్తారు అని చెప్పాడు.

"అది పార్టీ రహస్య ఎజెండా. ముఖ్యమంత్రికి దాని గురించి బాగా తెలుసు" అని గోస్వామి అన్నాడు.

ఎస్.ఇ.జడ్‌లు ఏర్పాటు చేయటం; షాపింగ్ మాల్‌లు (దుకాణాల సముదాయాలు), ఆరోగ్య సౌకర్యాల కల్పనా, బడా నిర్మాణ సంస్థానాల ఏర్పాటుతో నగరీకరణ చేయటం జరుగుతున్నది. వీరి అభివృద్ధికి సంబంధించిన రాజకీయాలు ఎల్లెడలా సవాళ్లను ఎదుర్కొంటూ, రాబోయే రోజుల్లో పెద్దయెత్తున వ్యతిరేకత పెరగనున్నది. ఎస్.ఇ.జెడ్‌లకూ, ప్రజల్ని నిర్వాసితుల్ని చేయడానికీ వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజా తిరుగుబాటుకు నందిగ్రామ్ పోరాటం గొప్ప పుదాహరణగా నిలిచింది. నందిగ్రామ్ మారణకాండ జరిగిన నెల రోజుల తర్వాత డిసెంబర్ 10న హంతక ముఖ్యమంత్రి సి.పి.ఐ(ఎం) మిద్నపూర్ జిల్లా మహాసభలో మాట్లాడుతూ తమ పార్టీ నందిగ్రామ్ తరహా అభివృద్ధిని హల్దియాలో కూడా చేపట్టడానికి పథకాలు రూపొందించిందనీ, కానీ అక్కడ కొంత మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నందున తాను ఆ ప్రాజెక్టును మరో చోటికి మార్చుతున్నాననీ అన్నాడు. నందిగ్రామ్ ప్రజలు తమ వ్యతిరేక వైఖరికి ఏదో ఒకనాడు పశ్చాత్తాపపడతారనీ నొక్కి వక్కాణించాడు. ముఖ్యమంత్రి మాటల్లోని అసలు ఉద్దేశాన్ని పరిశీలించినవారెవరికైనా, నందిగ్రామ్‌లో రసాయనిక పరిశ్రమల సముదాయాన్ని నిర్మించడానికే సి.పి.ఐ(ఎం) సిద్ధమైందనేది తేలికగానే అర్థమవుతుంది. అందువల్ల తమ 'ఉన్నయన్' (అభివృద్ధి)కి సంబంధించిన నమూనాను అమలు చేసే క్రమంలో మరోసారి వాళ్ల ఎత్తుగడల్ని మార్చారంతే.

సి.పి.ఐ (ఎం) ఎత్తుగడల గురించి వ్యాఖ్యానించే ముందు, 'వామపక్ష' కూటమి ప్రభుత్వంలోని ప్రభుత్వ పనుల (పబ్లిక్ వర్క్స్) శాఖా మంత్రి ఆర్.ఎస్.పి నాయకుడూ అయిన క్షిటి గోస్వామి 'టెలిగ్రాఫ్' పత్రికతో చెప్పిన మాటల్ని పాఠకుల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాం. [బాక్సు చూడండి] క్షిటి గోస్వామి మాటలను పరిశీలిస్తే, శాంతి పునరుద్ధరణ పేరున హర్మద్ బహినీ (బందిపోటు మూక)లతో పోలీసు బలగాలతో హత్యలూ, సామూహిక అత్యాచారాలూ, గృహదహనాల ద్వారా విరామం లేకుండా రైతాంగంలో భయోత్పాతాన్ని సృష్టిస్తూ, సి.పి.ఐ (ఎం) నందిగ్రామ్‌ను ఆక్రమించటం ఎందుకనేది ఈ ప్రకటన ద్వారా ఎవరికైనా తేలికగానే అర్థమవుతుంది. తన భూసేకరణ కార్యక్రమం కోసం సి.పి.ఐ (ఎం) యంత్రాంగం ఇప్పుడు పారిశ్రామికీకరణ, అభివృద్ధి, బెంగాల్‌కు కార్పొరేట్ సంస్థల నుంచి పెద్దయెత్తున నిధుల వరద అంటూ ప్రచార యుద్ధంలో తేలిపోతున్నది.

## శక్తుల కేంద్రీకరణ

బతుకుదెరువుకు భూమిపై ఆధారపడిన సింగూరు రైతాంగం, ఇంకా ఇతరులూ కలిసి టాటా కార్ల ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం దౌర్జన్యంగా తమ భూముల్ని గుంజుకోవడానికి వ్యతిరేకంగా ఒక్కటవుతున్నారు. పేద రైతాంగం, మధ్యతరగతి, ధనిక రైతాంగమూ, ఇంకా ఇతర కింది సెక్షన్ల ప్రజలంతా సి.పి.ఐ(ఎం) పార్టీ పట్ల తమకున్న ఇష్టాలన్నింటినీ వదిలేసి, తమ భూములనూ, జీవనాధారాన్ని రక్షించుకోవడానికి సి.పి.ఐ(ఎం)కూ, దాని పోలీసు బలగాలకూ వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నారు. వామపక్షాలని చెప్పుకుంటున్న వాటితో పాటు వాటి పెద్దన్న కాంగ్రెస్, పార్లమెంటరీ, పార్లమెంటేతర పంథాననుసరిస్తున్న మిగతా పార్టీలూ, సంస్థలూ ఈ పోరాటంలో పాల్గొన్నాయి. కొన్ని పరిమితులున్నప్పటికీ తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కింది స్థాయి కార్యకర్తల నుండి మావోయిస్టుల వరకూ అన్ని పార్టీలూ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు వివిధ మార్గాల్లో ఈ పోరాటంలో పాల్గొన్నాయి.

సి.పి.ఐ (ఎం) నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం, టాటా కార్ల ఫ్యాక్టరీ కోసం వేలాది పోలీసు బలగాలను దింపి, ఆక్రమించిన భూమి చుట్టూ దౌర్జన్యంగా ఇనుపముళ్ల కంచె వేసి, ఆ తర్వాత ప్రహరీ గోడ కట్టించింది. హర్మద్‌లు [సి.పి.ఐ(ఎం) సాయుధ గూండాలు] అత్యాచారాలకూ, గృహదహనాలకూ పాల్పడి ప్రజల్లో భయోత్పాతం సృష్టించారు. తపసిమాలిక్ అనే యువ మహిళా కార్యకర్తపై అత్యాచారం జరిపి, హత్య చేసి, మృతదేహాన్ని ఆనవాళ్లు దొరకకుండా తగులబెట్టారు. ఈ పాశవికదురాగతాలన్నీ ప్రజలు పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడానికీ, కొత్త కొత్త రూపాలు చేపట్టడానికీ ప్రేరేపించాయి. బెంగాల్‌లోని వివిధ ప్రాంతాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం జరుగుతున్న వేలాది ఎకరాల భూసేకరణ, నగరీకరణ, పెద్ద పెద్ద దుకాణ సముదాయాల నిర్మాణం మొదలైనవి ఇప్పటికే రైతాంగానికి భయోత్పాత సంకేతాలు పంపుతున్నాయి. అనేక ప్రాంతాల్లో భూసేకరణపై నిత్యమూ జరుగుతున్న ఆందోళనలూ, ఘర్షణలూ పరిస్థితిని అగ్ని పర్వతంలా బద్దలయ్యేటట్లు తయారు చేస్తున్నాయి.

దీనికితోడు బెంగాల్‌లో ఈ పోరాటం పట్ల ఆకర్షితులై, ప్రభావితులై ఐక్యమైన పోరాట శక్తుల నూతన కేంద్రీకరణ ప్రారంభమైంది. రసాయన పరిశ్రమల సముదాయం(కెమికల్ హబ్) కోసం నిర్మిస్తున్న ఎస్.ఇ.జడ్‌కు వ్యతిరేకంగా సింగూర్, నందిగ్రామ్‌లు యుద్ధ భూమిగా మారిన తర్వాత, వారి వారి ప్రాపంచిక దృక్పథాన్ని బట్టి, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంపై వారి వైఖరిని బట్టి కొంతమంది ప్రత్యామ్నాయ స్థలాలను ప్రతిపాదిస్తున్నారు. మావోయిస్టులు కూడా ఇందులో పాల్గొని, సమస్యకు మద్దతు తెలిపి, ఎస్.ఇ.జడ్‌ల నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని కోరుతూ, ఈపోరాటాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా మార్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సి.పి.ఐ (ఎం), ఒంటెత్తుపోకడ కలిగిన వామపక్ష మితవాదులూ, ఇతర రివిజనిస్టులూ ఈ పోరాటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్.ఎస్.పి, ఫార్వర్డ్ బ్లాక్‌లు పోలీసు నిర్బంధాన్ని వ్యతిరేకించాయి. అయితే, కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు కొందరు కొన్ని సందర్భాల్లో ఈ



పోరాటంలో పాల్గొని, ఆ తర్వాత సి.పి.ఐ (ఎం)తో తమ పొత్తును కాపాడుకోవడానికేగాక, తమ స్వంత పార్టీ రూపొందించిన ఎస్.ఇ.జడ్ విధానాలను కాపాడుకోవటం కోసం కూడా ఈ పోరాటం నుంచి తప్పుకున్నారు. కానూసన్యాల్, దీపాంకర్ భట్టాచార్జీ (లిబరేషన్ గ్రూపు) లాంటి సి.పి.ఐ (ఎం) మిత్రులూ, ఆధునిక రివిజనిస్టులూ ఈ పోరాటానికి మద్దతు పేరుతో తమ ప్రతిష్టను పెంచుకునే ప్రయత్నాలు చేశారు. ఆ విధంగా బెంగాల్ పరిస్థితి అగ్ని పర్వతంలా బద్దలయింది. ఈ పరిస్థితి నుంచి నందిగ్రామ్ పైకెగసి, ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటం కార్చిచ్చులా దేశం నలుమూలలకూ వ్యాపించింది.

ఆ విధంగా 'అపన్ బరి, సబర్‌బరి నక్సల్‌బరి' (నక్సల్‌బరి మీదీ, మాది, మనందరిదీ) అనే నినాదం 'తుమర్ గ్రామ్, అమర్ గ్రామ్, సబర్ గ్రామ్ నందిగ్రామ్' (నందిగ్రామ్ మీగ్రామం, మాగ్రామం, మనందరి గ్రామం)గా మళ్లీ పైకెగసింది.

పోలీసుల బహిరంగ మద్దతుగల సి.పి.ఐ (ఎం) గూండాల బెదిరింపులతో, బాంబుల మోతలతో, గ్రామస్థులను నందిగ్రామ్ నుండి వెళ్లగొట్టే దౌర్జన్యాలతో, 'అభివృద్ధి' కోసం గ్రామస్థులు తమ భూముల్ని బలవంతాన అప్పజెప్పేందుకు నిత్యమూ భయపెట్టడానికి జరిపే తుపాకీ కాల్పులతో మార్చి 14 మారణకాండ జరిగిన చాలా వారాల వరకూ కూడా నందిగ్రామ్ ఆక్రమిత భూమిగా నిలిచే వుంది.

మారణకాండ జరిగిన రోజున చనిపోయిన, ఆచూకీ తెలియని రైతులూ, ప్రత్యేకించి బాల బాలికలు, మహిళలు ఎంతమందనేది ఇప్పటికీ తెలియదు. నందిగ్రామ్ రైతాంగ ప్రజానీకం పైన సామూహిక హత్యలూ, అత్యాచారాలూ, చిత్రవధ, ఇంకా అన్ని రకాల నీచమైన నేరాలకు పాల్పడిన క్షణం నుంచీ ఫాసిస్టు సి.పి.ఐ (ఎం) ప్రభుత్వపు రహస్య యంత్రాంగం చాలా చురుకుగా పని చేస్తూ, వాస్తవంగా సంభవించిన మరణాల సంఖ్యను బయటికి తెలియకుండా తొక్కిపడుతున్నది. అంతేగాక, సి.పి.ఐ (ఎం) గూండాలు మృతుల శరీరాలను ఏమాత్రం ఆనవాళ్లు దొరకకుండా మాయం చేసే శిక్షణ పొందారు. పీడిత రైతాంగంపై సి.పి.ఎం విధించిన బూటకపు అభివృద్ధికి భూమి ఇచ్చేది లేదనే వారి సాహసోపేత నిర్ణయంపై ప్రజలు దృఢంగా నిలబడటాన్ని మనమిక్కడ నొక్కి చెప్పాలి. అంతర్జాతీయ, దేశీయ దళారీ నిరంకుశ బూర్జువాకు నమ్మకమైన తొత్తుగా, నందిగ్రామ్ మారణకాండతో మూర్ఖపు సి.పి.ఎం నిర్వహించిన పాశవిక పాత్ర, నక్సల్బరీలో 1967 మేలో నిర్వహించిన ఇటువంటి పాత్రనే గుర్తుకు తెస్తున్నది. నక్సల్బరీ రైతాంగం రాజకీయాధికారం కొరకు ఆయుధాలు పైకెత్తగా, నందిగ్రామ్ రైతాంగం సి.పి.ఎం గూండాల నుంచి తమ విలువైన భూముల్ని రక్షించుకోవడానికి యాదృచ్ఛికంగా పైకెగసి, ఎస్.ఇ.జడ్ ఏర్పాటు చేయడానికి రసాయనాల వ్యాపారంలో పేరు మోసిన అమెరికా సంస్థ డోవ్ కెమికల్స్‌కు భూములిచ్చే వైపు మొగ్గారు.

ఈ ప్రభుత్వ ప్రోత్సాహక అత్యంత పాశవిక మారణకాండను అన్ని సెక్షన్ల ప్రజలు బహిరంగంగా ఖండించి, సి.పి.ఎం ఫాసిస్టు పాలనపట్ల ద్వేషాన్ని వెళ్లగక్కారు. ప్రభుత్వ, సి.పి.ఎం గూండాల క్రూరమైన పద్ధతుల వల్ల నోరు విప్పని ప్రజలు కూడా ఆందోళనకు దిగి, సి.పి.ఎం మాఫియా పాలనపట్ల ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. మార్చి 16న బెంగాల్ అంతటా ప్రజల హృదయ పూర్వక మద్దతుతో జరిగిన బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. పెరిగిన పోలీసు ఒత్తిడి, మీడియాలోని ఒక సెక్షనూ, పెద్దమొత్తంలో మేధావులూ, శాసనసభలో ప్రతిపక్షం, డాక్టర్లూ, కళాకారులూ, సామాజిక కార్యకర్తల నుండీ, కొద్ది స్థాయిలోనే అయినా 'వామపక్ష' కూటమి నుండీ బుద్దదేవ్ మీద

పెద్దయెత్తున ఒత్తిడి పెరిగింది. దీనితో బుద్ధదేవ్ బలవంతాన "మేము పరిస్థితిని సరిదిద్దటంలో కొన్ని తప్పులు చేశాం'' అని మాత్రం అంగీకరించాడు. ప్రపంచీకరణ వర్గానికి నమ్మకమైన తొత్తు సేవకుడూ, కసాయి అయిన బుద్ధదేవ్‌ను చనిపోయే వరకు ఉరితీయాలని సమస్త ప్రజానీకం డిమాండ్ చేసినప్పుడు కొంత కాలం నోరు మూసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు రసాయన పరిశ్రమల సముదాయం (కెమికల్ హబ్) మరోచోట నిర్మించటం జరుగుతుందని గొంతెత్తి మొరుగుతున్నాడు.

## అమెరికా సామ్రాజ్యవాదుల పాత్ర

"పరిశ్రమలు లేకపోతే ఉద్యోగాలు ఎక్కడి నుండి వస్తాయి? వేలాది బాల బాలికలు ఇప్పుడు స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్నారు. వాళ్లలో రైతు కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళు కూడా వున్నారు. వాళ్లకు ఉద్యోగాలెక్కడి నుండి వస్తాయి? అందుకని పరిశ్రమ స్థాపించాలి...'' [గణశక్తి, 24.04.2007] అంటూ బుద్ధదేవ్‌లానే సి.పి.ఎం వీరభక్తుడు జ్యోతిబసు (ఇప్పుడితడికి కాంగ్రెస్ అత్యున్నత గౌరవపురస్కారాన్ని ప్రకటించింది.) గుండెలవిసేలా రోదిస్తున్నాడు. ఇప్పుడు చదువుకున్న పిల్లలకు వ్యవసాయం నామోషిగా తయారై, ఉపాధి లేని అభివృద్ధి జరుగుతున్న మన కాలంలో, పెద్దయెత్తున ఉపాధికి అవకాశం అంటూ పనికి మాలిన తప్పుడు ప్రచారం జరుగుతున్నది. 'పారిశ్రామికీకరణ', 'అభివృద్ధి', 'రాబోయే పరిశ్రమల్లో గొప్ప ఉపాధి అవకాశాలు' అంటూ మరోసారి పాత పల్లవినే అందుకుంటున్న సి.పి.ఐ (ఎం), దేశీయ, విదేశీ బూర్జువాల సేవకే హామీపడుతూ అంకితమైందనేది పచ్చి నిజం. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు జేమ్స్ డి ఉల్ఫెన్ సన్ "*సామాజిక రంగం, మౌలిక సౌకర్యాల కల్పన అభివృద్ధిలో వామపక్ష పార్టీల విశాల దృక్పథాన్ని ప్రపంచ బ్యాంకు ప్రశంసిస్తున్నదనీ... యు.పి.ఎ ప్రభుత్వ కనీస ఉమ్మడి కార్యక్రమం బ్యాంకు లక్ష్యాలకనుగుణంగానే వుందనీ.... అంతటా ఎర్రజెండానే కానట్లుగా కన్పిస్తున్నదనీ* [టైమ్స్ నెట్‌వర్క్ 23.11.04] బుద్ధదేవ్ ప్రభుత్వం మీద ప్రశంసల జల్లు కురిపించడాన్ని మనం మరచిపోరాదు. ఒకపక్క సి.పి.ఎం నందిగ్రామ్‌లో రైతాంగం మీద మారణకాండకు పాల్పడుతూ, మరోపక్క ఢిల్లీలో ఎన్నికల రాజకీయాల కోసం, ఎస్.ఇ.జడ్‌లు మొదలైన వాటికి రైతుల భూమిని గుంజుకోవడాన్ని వ్యతిరేకించే పార్టీగా ఫోజు పెట్టి, ఎస్.ఇ.జడ్‌ల వ్యతిరేక ముసుగును మరింత గట్టిగా బిగించుకుంటున్నది. 2005లో కూడా అమెరికా అత్యున్నత వ్యాపార ప్రతినిధి గెజా ఫెక్సిటెక్సుటీ బహుళజాతి సంస్థలకూ, భారత దళారీలకు బుద్ధదేవ్ ప్రభుత్వం కట్టుబడి వుండటం గురించి గట్టి నమ్మకాన్ని వ్యక్తపరిచాడు. "*కలకత్తాలో నేను చూసిన దానితో, ఢిల్లీలో వామపక్షీయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తుండటం వల్ల, భారతదేశ సంస్కరణల క్రమం పట్టాలు తప్పుతున్నదనే భయం అవసరంలేదని నమ్ముతున్నాను.... ఢిల్లీలో వామపక్షం చెపుతున్నదంతా రాజకీయ బేరసారాల్లో భాగమేననేది ఎవరైనా అర్థం చేసుకోగలరు''* [టైమ్స్ ఆఫ్ ఇండియా, 06.03.05)]

నందిగ్రామ్ మారణకాండ జరిగిన ఇన్ని వారాల తర్వాత కూడా సామ్రాజ్యవాద, దేశీయ పెట్టుబడికి అనుకూలతలు చేకూర్చడానికి ఏ ఒక్క రోజునుగానీ, ఏ ఒక్క అవకాశాన్ని గానీ, వదలటం లేదు. సామ్రాజ్యవాద హైనాల ముందు సాష్టాంగపడుతున్న సి.పి.ఐ (ఎం) సంపూర్ణ లొంగుబాటు విధానాలపై వెల్లువెత్తిన ప్రజాగ్రహానికి వెరచి సామ్రాజ్యవాద, దేశీయ బడా బూర్జువాలు ఇద్దరూ వెనక్కు తగ్గారు. మరోసారి అమెరికా వ్యాపార పెద్దలు బుద్ధదేవ్ ప్రభుత్వం పై తమ దృఢ విశ్వాసాన్ని వెలిబుచ్చి, అమెరికాలోని అనేక రాష్ట్రాల నుండి ప్రతినిధులను 2007లో బెంగాల్‌కు పంపించారు. అమెరికా ప్రభుత్వాధికారులా, తయారీ పరిశ్రమల సంఘాల నాయకత్వంలో మరిన్ని పర్యటనలు చేయాలనే పథకాలు కూడా వున్నాయి. "అమెరికాలో రూపొందిన ఈ ప్రయోజనాన్ని (బెంగాల్‌లో) అనుసరించి ఈ సంవత్సర ప్రారంభంలో వ్యాపార ప్రతినిధి సుసాన్ ష్వాబ్ భారత్‌లో పర్యటించాడు.'' బెంగాల్‌లోకి ప్రవహించబోయే అమెరికా పెట్టుబడులకు మరింతగా గేట్లు తెరవడానికి, బహుళజాతి సంస్థలూ, ప్రపంచ బ్యాంకూ మొదలైన వాటి కొల్లగొట్టే ఆదేశాలను ముందుకు తీసుకుపోవటంలో బుద్ధదేవ్‌కు కుడి భుజం లాంటి వాడు, బెంగాల్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిరుపమ్‌సేన్‌ను అమెరికా పర్యటనకు ఆహ్వానించామని, అమెరికా డిప్యూటీ వాణిజ్య కౌన్సిలర్ డేల్ తషాక్సి భారత వాణిజ్య మండలి కార్యమొక దాంట్లో ఖాయంగా చెప్పాడు. [టైమ్స్ ఆఫ్ ఇండియా, 25.04.07] సామ్రాజ్యవాదులతో, వారి భారత దళారీ భాగస్వాములతో ఈ మూర్ఖపు సి.పి.ఐ (ఎం)కు వున్న నైతిక, నిర్మాణాత్మక బంధం, పారిశ్రామికీకరణ అని చెప్పుకుంటున్న దాని కోసం అది పునరుద్ధరించిన క్యాంపెయిన్‌లో ప్రతిఫలిస్తున్నది. ఇది చాలా గట్టి బంధం. ఈ రాష్ట్రాన్ని లూటీ చేసుకొనేందుకు తమ యజమానుల పెట్టుబడికి దారులు సుగమం చేయడానికి, ప్రతిఫలంగా నజరానాలూ, అధికార భద్రతను అందుకోవడానికీ, నందిగ్రామ్ మారణకాండ తర్వాత సి.పి.ఐ(ఎం) ఇప్పుడు మరింత జిత్తులమారి మార్గాలను రూపొందిస్తున్నది.

## నందిగ్రామ్ ప్రతిఘటనా ప్రారంభం

2007 జనవరిలో నందిగ్రామ్ ప్రజలు మొట్ట మొదటగా ఆందోళనకు దిగారు. దానికి కొన్ని నెలల ముందు, రసాయన పరిశ్రమల సముదాయం కోసం ప్రతిపాదించిన ఎస్.ఇ.జడ్‌కు భూములు అప్పగించబోమన్నందుకు పేరు మోసిన సి.పి.ఐ (ఎం) నాయకులూ, సాయుధ కార్యకర్తల మూకలూ భయానక వాతావరణం సృష్టించి నందిగ్రామ్ రైతాంగాన్ని బెదిరించారు. ప్రజల్లో అసంతృప్తి, కోపం పెల్లుబికాయి. సింగూర్‌లో టాటా మోటార్ ఫ్యాక్టరీ కోసం బలవంతంగా భూసేకరణ చేయడానికి జరిగిన ప్రయత్నాలూ, దానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా ప్రతిఘటనా ఈ పరిస్థితికి తోడయ్యాయి.

ఫాసిస్టు 'వామపక్ష' ప్రభుత్వపు దౌర్జన్య పూరిత భూసేకరణ కార్యక్రమానికి వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో పోరాటాలు బద్ధలై, ఈ దుర్మార్గపు విధానానికి వ్యతిరేకంగా పోరాడటానికి వాటన్నింటి మధ్య లింకు ఏర్పడింది. సింగూర్ పోరాటంతోపాటు ఖరగ్‌పూర్, సిలిగురి, భంగార్ ఇంకా అనేక చోట్ల భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వీటితో బుద్ధదేవ్ ప్రభుత్వం స్పష్టంగా రైతాంగానికి వ్యతిరేకంగా నిలబడింది. ఇక అభివృద్ధి శక్తులుగా ముసుగు కప్పుకున్న సి.పి.ఐ (ఎం) భయోత్పాత మూకలతో నందిగ్రామ్ భూసేకరణకు ప్రయత్నం ప్రారంభమైంది. హల్దియా అభివృద్ధి సంస్థ (హెచ్.ఎ.డి) ఛైర్మన్ లక్ష్మణ్‌సేథ్ జనవరి 3వ తేదీన నాలుగు పంచాయితీలకు స్పష్టమైన బెదిరింపుతో నోటీసు జారీ చేశాడు. ఆ పంచాయితీల పరిధిలోని 60 వేల నుండి 70 వేల మంది ప్రజల జీవనాధారమైన భూమిని ఆక్రమించడానికి వుద్దేశించిన నోటీసు యిది. పెద్ద బాంబు లాంటి ఈ నోటీసుతో ప్రజలు తిరుగుబాటుకు పూనుకున్నారు. సి.పి.ఐ (ఎం) మద్దతుదారులతో సహా, సాధారణ రైతాంగం అంతా కలిసి భూ ఆక్రమణ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. జనవరి 7న వేరు వేరు చోట్ల నుంచి తెచ్చిన వందలాది సి.పి.ఐ (ఎం) కిరాయి గూండాలూ, సాయుధ పోలీసులూ జనం మీదబడి ముగ్గుర్ని చంపి, అనేక మందిని గాయపరిచారు. ఆ రోజే 50/60 మంది సి.పి.ఐ (ఎం) నాయకులు నందిగ్రామ్ నుండి తల్పతి కాలువ దాటి ఖెజూరి గ్రామంలోకి జొరపడ్డారు. అప్పటి నుండి, సాయుధ పోలీసుల రక్షణలో సాయుధ మాఫియా ముఠాలు ఖెజూరిలో అడ్డావేసి, తుపాకులు, బాంబులతో గ్రామాల మీద నిరంతరం దాడులు చేశారు. మార్చి 14న ఎస్.పి, ఇతర సీనియర్ అధికారుల నాయకత్వంలో మూడు వేల మంది సాయుధ పోలీసు బలగాలూ, అనేక వేల మంది సి.పి.ఎం గూండాలు ఉదయం 9.45 గంటలకు తల్పతి కాలువదాటి సాయుధ దాడి మొదలుపెట్టారు. ఇందులో సి.పి.ఎం గూండాలు తుపాకులు, పోలీసు యూనిఫారాలు, చెప్పులు ధరించి పాల్గొన్నారు. పెద్దయెత్తున జరగబోయే దాడి గురించి ముందురోజు వార్త పొక్కింది. సి.పి.ఐ(ఎం) శక్తులు నందిగ్రామ్‌లోకి చొచ్చుకొచ్చేందుకు మార్గం సుగమం చేయడానికి, సి.పి.ఐ (ఎం) పోలీసులు తయారు చేసిన పథకం గురించి దాదాపు అన్ని దిన పత్రికలూ స్పష్టంగా రాశాయి. పోలీసులూ, సి.పి.ఎం కిరాయి మూకలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టినప్పుడు హిందువులూ, ముస్లింలూ కూడా స్థానిక పండుగ సందర్భంగా దేవుని పూజలో నిమగ్నమైవున్నారు. ఎలాంటి హెచ్చరికలూ లేకుండ తుపాకులతో కాల్పులూ, టియర్ గ్యాస్ షెల్స్ పేల్చటం ప్రారంభించారు. ఈ క్రూరమైన 'అభివృద్ధి'ని వ్యతిరేకించిన వారిపై, మరో మాటలో చెప్పాలంటే, సామ్రాజ్యవాద యజమానులా, వారి ఏజెంట్లు అయిన సి.పి.ఎం బందిపోట్ల సంస్కరణల కార్యక్రమాలను అడ్డుకోవడానికి తమ గడ్డ మీద రొమ్ము విరిచి నిలబడిన రైతాంగ ప్రజానీకంపై చెప్పనలవిగాని స్థాయిలో అత్యాచారాలూ, లూటీలూ, నరికివేతలూ, చంపడం, చంపినవారిని ఆనవాళ్ల లేకుండా పూడ్చటం, తగులబెట్టటం లాంటి అన్ని రకాల పాశవిక నేరకృత్యాలకు పాల్పడ్డారు. ఆ సందర్భంలో 14 మంది మాత్రమే చనిపోయారని పోలీసు శాఖ చెప్పింది. కానీ, బయటికి రానీయకుండా చేసిన అసలు సంఖ్యను లెక్కగట్టే వారెవ్వరూ అక్కడ లేరు. చిన్న పిల్లల్ని ఎలా నరికి చంపారనేది, పారిపోతున్న స్త్రీ, పురుషుల్ని తుపాకులతో ఎలా నేలకూల్చారనేది, బతికున్న ఆనాటి నందిగ్రామ్ బాధితులు గుర్తు చేసుకుని విలపిస్తున్నారు. అనేక వందల మంది ఆచూకీ లేదు. చనిపోయిన వారి అసలు సంఖ్య ఎప్పటికీ బయటికి రాదు. మామూలుగా ఫోటోలు తీసుకోవడానికి పత్రికా విలేకరులను రానివ్వటం లేదు. అనేక అవరోధాలు కల్పించినప్పటికీ, ఆ పాశవిక ఘోరకలి జరిగిన ప్రాంతంలోకి కొందరు దొంగచాటుగా చొరబడి కొన్ని ఫోటోలు తీశారు.

'సామ్రాజ్యవాదులా, వారి భారత ఏజెంట్ల' నమ్మకమైన సేవకుడుగా పని చేస్తున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ అయిన సి.పి.ఎం నేర చరిత్రకు మొట్టమొదటి నందిగ్రామ్ మారణకాండ నగ్న సాక్ష్యంగా చరిత్రలో నిలిచిపోయింది. తమపై జరిగిన మారణకాండ తర్వాత కూడా దృఢంగా నిలబడి తమ బిడ్డలపై జరిగిన అత్యాచారాలకూ, దుర్మార్గాలకు ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్న రైతుల స్థిర నిశ్చయానికీ, మృత్యువునే ధిక్కరించిన వారి ధైర్యానికి ప్రతీకగా చరిత్రలో నందిగ్రామ్ అధ్యాయం ఉజ్వలంగా ప్రకాశిస్తూ వుంటుంది. మారణకాండ తర్వాత కూడా సి.పి.ఐ (ఎం) గూండాలు నిరంతరమూ దాడులు చేస్తున్నప్పటికీ, రైతుల మీద కష్టాలన్నీ కట్టగట్టుకొని వచ్చిపడినా, నందిగ్రామ్ దృఢంగా నిలిచి, ఐక్యంగా ప్రతిఘటిస్తున్నది.

## మార్చి 14 మారణకాండ సమయంలో సి.పి.ఐ (ఎం) పోలీసుల, ప్రభుత్వ పోలీసుల పాత్ర

సి.పి.ఐ (ఎం), పోలీసులూ సుదీర్ఘకాలంగా పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి వున్నారనేది, నందిగ్రామ్ మారణకాండకు ముందూ, తర్వాత కూడా కన్పిస్తున్న వాస్తవం. ఈ బలమైన పొత్తుతోనే 'వామపక్ష' కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలన్నీ ప్రజల మీద బలవంతంగా రుద్దుతున్నది. పారిశ్రామికాభివృద్ధి అని చెప్పుకుంటున్న దానికోసం చేస్తున్న ప్రస్తుత ప్రయత్నాలన్నీ అనివార్యంగా సి.పి.ఎం లీడర్లనూ, సి.పి.ఎం గూండాలనూ, ప్రభుత్వ పోలీసులనూ అందులో పాల్గొనేటట్లు పురిగొల్పేవే. ఈ తతంగమంతటిలో ఎవరి పాత్రను వారు భేషుగ్గా నిర్వహిస్తారు. సాధారణంగా, స్వతహాగా అత్యంత ధనికులుగా ఎదిగిన నాయకులు పార్టీ నిధుల కోసం, తమ జేబులు నింపుకోవడం కోసమూ భవన నిర్మాణ సంస్థలతో, వ్యాపారులతో, భూదళారులతో, పారిశ్రామికవేత్తలూ మొదలైన వారితో గట్టి సంబంధాలు నెలకొల్పుతారు. వీళ్లే ఇప్పుడు 'పారిశ్రామికీకరణ', అణు

విద్యుత్, నగరీకరణ, బడా దుకాణాల సముదాయాలూ, ఫ్లై ఓవర్లూ ఇంకా ధనిక వర్గానుకూల బడ్జెట్ వ్యయం కోసం చురుకుగా క్యాంపెయిన్లు చేస్తున్నారు. సి.పి.ఎం కార్యకర్తలూ (చదువురాని మూర్ఖులూ, దుర్మార్గపు శక్తులు), పోలీసులూ, ప్రభుత్వ యంత్రాంగం కలిసి సి.పి.ఎం ఎజెండా అమలుకు కండ బలం తయారైంది. ఛాంద్‌మోని టీ ఎస్టేట్, దాని పరిసర ప్రాంతాలూ, (దుకాణ సదుపాయాలూ, హొటళ్లూ, ఆకాశ సౌధాలతో కూడిన అధునాతన బస్తీ నిర్మాణానికి విపరీతమైన రక్తపాతం జరిపి భూమి గుంజుకున్నారు.) సింగూరు, నందిగ్రామ్ మొదలైనవి సి.పి.ఎం గూండాలు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం కలిసికట్టుగా జరిపిన దాడికి నిదర్శనం.

టి.వి చిత్రీకరణలూ, నందిగ్రామ్ బాధితుల ప్రకటనలతో కూడిన రిపోర్టుల ప్రకారం వందలాది సి.పి.ఎం గూండాలు పోలీసు యూనిఫారాలు, కాళ్లకు చెప్పులు, తలకు టోపీలు, నడుముకు బెల్టులు ధరించి అసలు పోలీసులతో కలిసి మార్చి 14న గ్రామాల మీద పడ్డారనే దాంట్లో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్పష్టమైంది. మారణకాండ జరిగిన వెంటనే మార్చి 18న నందిగ్రామ్‌కు వచ్చిన సి.బి.ఐ బృందం శ్రీనానాని ఇటుక బట్టీలో ఆకస్మికంగా జరిపిన పరిశోధనలో పది మంది సి.పి.ఎం గూండాలనూ, ఆయుధాలూ, మందుగుండు దాచిన పెద్ద పెట్టె, 5 మొబైల్ ఫోన్లూ, బట్టల మూట (ప్రధానంగా మహిళల లోదుస్తులు)ను దొరకబట్టుకున్నారు. పట్టుబడిన పది మంది తమను జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి సి.పి.ఎం తీసుకొచ్చిందని పోలీసులతో స్పష్టంగా చెప్పిన మాటలు రికార్డులకెక్కాయి. ఈ ఆటవిక దాడులకు సంబంధించిన ఖచ్చితమైన ఆధారాలను వెలికితీయడానికి దగ్గర్లోని మరికొన్ని ఇటుక బట్టీలను కూడా పరిశోధించాలని సి.బి.ఐ బృందాన్ని గ్రామస్తులు పట్టుబట్టారు. సి.బి.ఐ బృందం ఒప్పుకోలేదు. [ది స్టేట్స్‌మన్ 20.03.07] ఇష్టం లేకుండానే పని ముగించిన సి.బి.ఐ బృంద పరిశోధనల్లో, ప్రభుత్వ పోలీసులూ, సి.పి.ఎం గూండాలూ కలిసికట్టుగా నేరాలకు పాల్పడ్డారనే ఒక్క విషయమైనా స్పష్టంగా తేలింది.

పట్టుబడిన సి.పి.ఎం గూండాలు వెల్లడించిన నిజాలతో, జరిగిన నష్టాన్ని పూడ్చుకుని నందిగ్రాంను తన అదుపులో పెట్టుకోవడానికి ఈ సిగ్గులేని సి.పి.ఎం నాయకత్వం పెద్దయెత్తున డబ్బును మంచినీళ్ళలా ఖర్చు చేసింది. పత్రికా ప్రకటనలు, కథనాలతో విస్తృతంగా అసత్యాలను ప్రచారం చేసింది. గణశక్తి [మార్చి 21, 2007] అల్లిన కట్టు కథలో "ఇతర రోజుల్లో 200 రూపాయలూ, చర్యలు చేయాల్సి వస్తే ఇంకొక వెయ్యి రూపాయలు పెంచటం, దీనితోపాటు భోజనం, మద్యం ఉచితంగా అందిస్తున్నారు. బేల్‌పహారికి చెందిన అటువంటి తృణమూల్ కాంగ్రెస్ కోసం కిరాయికి పని చేశారు" అని అబద్ధాలు ప్రచారం చేసింది. ఇదీ సి.పి.ఎం ప్రచార క్యాంపెయిన్! ఇటువంటి మావోయిస్టు వ్యతిరేక చౌకబారు చెత్తను గుప్పించే పత్రికను కొనేదెవరు?

పోలీసులను సి.పి.ఎం నిర్దోషులుగా చిత్రిస్తున్నది. నందిగ్రామ్ మారణకాండ తర్వాత సి.పి.ఎం రాష్ట్ర కమిటీ పోలీసు చర్యను బహిరంగంగానే సమర్థించింది. మార్చి 14న పరిస్థితిని మామూలు స్థితికి తీసుకురావడానికీ, రోడ్లు నిర్మించడానికి పోలీసులు చొరవ తీసుకుంటారని", లౌడ్ స్పీకర్ల ద్వారా అందరికీ తెలియజేశారనీ, సి.పి.ఎం చెప్పింది.

కానీ, ఒకపక్క ఈ ప్రయత్నాలు జరుగుతుండగానే, "వాళ్లు దాడి చేశారు. ఇటుకలు, బాంబులు, తుపాకులతో పోలీసులపై పకడ్బందీ పథకంతో దాడి చేశారు. ఈ క్రమంలో దురదృష్ట వశాత్తు అనేక మరణాలు సంభవించాయి." [గణశక్తి 21.03.07] ఇది నందిగ్రామ్ దుర్మార్గాలను సి.పి.ఎం ఎంతగా సమర్థిస్తున్నదనే దానికి నిదర్శనం.

జర్మనీలో నాజీ పార్టీకి చెందిన స్టార్మ్ ట్రూపర్స్ [తుఫాను బలగాలు (ఎస్.ఎస్)] ప్రతిపక్షాన్నంతటినీ, ప్రత్యేకించి కమ్యూనిస్టుల్ని నాశనం చేశారు. నాజీలు రీగ్‌స్టాగ్ (పార్లమెంటు)ను తగులబెట్టి, అనేక స్థలాలను ధ్వంసం చేసి, ఆ తర్వాత కమ్యూనిస్టుల వైపు వేలు చూపించి, నిందలు వేశారు. నాజీల వలె సి.పి.ఎం కూడా అబద్ధపు ప్రచారాన్ని సాగిస్తున్నది. భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల చేతుల్లో సి.పి.ఎం మద్దతుదారులు చాలా నిర్బంధానికీ, చిత్రహింసలకూ గురయ్యారనీ ఇప్పుడు సానుభూతిని కూడగట్టే ప్రయత్నం చేస్తున్నది. 30 సంవత్సరాలపాటు పశ్చిమబెంగాల్‌లో దుర్మార్గపు పాలనసాగించిన తర్వాత, ఇంతటి మారణకాండకు పాల్పడిన తర్వాత, ఎట్టకేలకు నందిగ్రామ్ ప్రజలు సి.పి.ఎంను సానుభూతిని అర్థించే స్థితికైనా నెట్టగలిగారు. రెండవది, ఇప్పుడు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని గుమ్మరిస్తూ దూకుడు మీదున్న పారిశ్రామికీకరణ' లేదా 'అభివృద్ధి' క్యాంపెయిన్ జోరు, బుద్ధదేవ్ భయంకర పాలనలో కనీసం కొంత కాలంపాటైనా తగ్గింది.

## భూ సమస్య రైతాంగ తిరుగుబాటుకు ఇరుసైన చోట, నందిగ్రామ్ ఎస్.ఇ.జడ్‌ల వ్యతిరేక పోరాటాలకు నమూనాగా ఎదిగింది.

గొప్ప రాజకీయ సంఘర్షణ తర్వాత నక్సల్బరీ పోరాటం బద్దలైనప్పుడు, నూతన విప్లవ వెల్లువతో దేశవ్యాప్తంగా దాని ప్రభావం పడింది. విప్లవోద్యమ పురోగమన క్రమంలో రాజకీయ, మిలటరీ పంథాపై గొప్ప అనుభవాలూ, స్పష్టతనూ సంతరించుకుంది. గడచిన 40 సంవత్సరాల్లో వివిధ రకాల పోరాటాలకు స్ఫూర్తినిచ్చి కూడగట్టింది. ఒకపక్క విముక్తి ప్రాంతాలను స్థాపించే, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మార్చే లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో సి.పి.ఐ (మావోయిస్టు) తన ఐక్య కాంగ్రెస్ - 9వ

కాం(గెస్‌లో దేశంలో ఎస్.ఇ.జడ్‌ల స్థాపనకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని సాగించి, తద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని భారతపీడిత ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కళింగనగర్, పోస్కో, విశాఖ, బస్తర్, సింగూర్, నందిగ్రామ్ పోరాటాలతో మమేకమై, ప్రస్తుత పోరాటానికి ఇరుసైన భూమి సమస్యపై కూడా ప్రజల్ని కదిలించారు. సాధారణంగా దున్నేవారికి భూమి అనేది ఇప్పటికీ ప్రజల్ని కదిలించే ప్రధాన నినాదమే; అయితే పేద, భూమిలేని, మధ్య తరగతి, ధనిక రైతాంగం వ్యవసాయ కూలీలతో కలిసి చోదక శక్తులుగా వున్న ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటంలో జమీ బచావో (భూమిని కాపాడుకుందాం) అనేది ప్రధాన నినాదం.

ఎవరెవరికి ఏ రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయనేదానితో నిమిత్తం లేకుండా ప్రజలందరూ ఈ ప్రభుత్వ భూకబ్జా ప్రస్థానాన్ని వ్యతిరేకించారు. ఒకనాడు సి.పి.ఎంతో వున్న వాళ్లే దాన్ని వదిలేసి, ఏదేమైనా తమ భూమిని కాపాడుకునేందుకు పోరాడటానికే నిశ్చయించుకుని దృఢంగా నిలబడ్డారు. దృఢమైన రైతాంగ సమైక్య ప్రతిఘటనను ధ్వంసం చేయడానికి సి.పి.ఎం, పోలీసులతో కలిపి గూండాలను ఎగదోలి, పోరాట కార్యకర్తలను చంపి, ప్రజల్లో భయోత్పాతాలు సృష్టించింది. నందిగ్రామ్ మారణకాండలో మొదట అమరులైన వారిలో సి.పి.ఐ (ఎం)తో సుదీర్ఘకాలంగా సంబంధాలున్న వాళ్లు వున్నారు. కానీ, ఇప్పుడు వాళ్ల కుటుంబాలన్నీ సి.పి.ఎంను వదిలేసి పోరాటంలోకి వచ్చారు. కానీ, సోషల్ ఫాసిస్టులు తమ నిజ స్వరూపాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరో నాటకం మొదలు పెట్టారు. తమ పార్టీ జరిపిన దుర్మార్గపు దాడుల్లో బాధితులైన వారి కుటుంబాల కోసం బిమన్ బోసు నిధులు సేకరించటం మొదలు పెట్టాడు. ప్రజలు, ప్రత్యేకించి అమరుల కుటుంబాలు దృఢంగా నిలబడి, వామపక్ష ప్రభుత్వం ఇవ్వ జూపిన నష్టపరిహారాన్నీ, వామపక్ష కూటమి ఛైర్మన్, సి.పి.ఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బిమన్ సేకరించిన నిధులనూ తిప్పికొట్టారు.

ఈ సంఘటన తర్వాత, శక్తుల కేంద్రీకరణ, రాజకీయ స్థిర నిశ్చయం మరింత పదునెక్కి, పోరాట పంథాలు మరింత వేరయ్యాయి. భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ కమిటీ పతాకం కింద ప్రజలు రోజువారీ బహిరంగ సమావేశాలూ, ఊరేగింపులూ నిర్వహిస్తూ, రోజు రోజుకూ ఉద్యమం మరింత మిలిటెంట్‌గా తయారైంది. భూమిని కాపాడుకోవడానికి ప్రతి స్త్రీ, పురుషుడూ ప్రాణత్యాగానికి కూడా సిద్ధం కావటం అనేది సాధారణ అవగాహనగా మారి, ప్రజలు స్వతస్సిద్ధంగా మరింత ఉన్నత త్యాగాలకు సిద్ధపడేట్లు మలచడంలో అదికీలక పాత్ర వహించింది. ఖచ్చితంగా ఈ దృక్పథమే నందిగ్రామ్‌ను ఆదర్శ నమూనాగా తయారు చేసింది.

## మార్చి 14 అనంతర మారణకాండలూ, పోరాట వెల్లువ

మార్చి 14 మారణకాండ తర్వాత, సి.పి.ఐ (ఎం) మూకలు బలప్రయోగంతో నందిగ్రామ్‌లోకి ప్రవేశించాయి. కానీ, రైతుల్ని బెదిరించి లొంగదీయాలనుకున్నప్పటికీ, వారు గట్టిగా నిలబడి ప్రతిఘటించడం సి.పి.ఎంనూ, ప్రభుత్వ యంత్రాంగాన్నీ విస్మయానికి గురిచేసింది. రోడ్లు దిగ్బంధించి, బారికేడ్లు నిలబెట్టి నందిగ్రామ్ లోపలా చుట్టుపక్కలా వాహనాలను కదలకుండా చేశారు. పోరాట రూపాలు అభివృద్ధి చెందిన క్రమంలో ఈ బారికేడ్లు సి.పి.ఎం గూండాల భయంకర దాడుల్ని ఎదుర్కోవడానికి ప్రజల మీద తమ పట్టు బిగించటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు, అలీముద్దీన్ వీధి [సి.పి.ఐ (ఎం) ప్రధాన కేంద్రం] కార్యకర్తల్ని పోలీసు బలగాల వెనుక వుంచడానికి లేదా అసలు పోలీసుల వెంట పంపే ఎత్తుగడలకూ పాల్పడింది. నందిగ్రామ్‌ను ఆక్రమించడానికి వేలాది మంది అధికారుల్ని లేదా తొత్తు అధికారులనూ, జవాన్లనూ దించారు.

ఆ సమయంలో నందిగ్రామ్ ప్రజలకు గుణపాఠం నేర్పాలని, క్రూరమైన ప్రభుత్వ బలగాలను మానవ కవచంగా ఉపయోగించుకుని సి.పి.ఐ(ఎం) మరింత దూకుడుగా ముందుకొచ్చింది. కానీ సి.పి.ఎం చేసిన ప్రయత్నాలన్నీ ప్రజల దృఢమైన పోరాట నిర్ణయం ముందు చిత్తుగా ఓడిపోయాయి. పోరాటాన్ని కొనసాగించేందుకు ప్రజలు పెద్ద మూల్యం చెల్లించాల్సివచ్చినప్పటికీ వెనక్కు తగ్గలేదు. కనీసం 14 మంది భూమి పుత్రులూ, పుత్రికలూ త్యాగాలు చేశారు. 200 మంది గాయపడగా, మరెంతో మంది నేటికీ జాడ తెలియకుండపోయారు.

పచ్చని పంట పొలాలు ఎర్రబారాయి. తల్పతి కాలువలోకి, హల్దియా నదిలోకి, చివరిగా బంగాళాఖాతంలోకి కూడా రక్తం ఏరులై పారింది. అప్పటికీ ప్రజలు సి.పి.ఎంకు లొంగలేదు. వారు హిమాలయ పర్వతాల్లా దృఢంగా నిలబడి, ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రతినబూనారు. ఈ పోరాటం బెంగాల్‌లో సోషల్ ఫాసిస్టుల నిజ స్వరూపాన్ని బహిర్గతం చేసింది. ప్రజలు ఎర్ర ముసుగును చింపి పారేశారు. సి.పి.ఐ(ఎం) చెప్పుకుంటున్న అణు ఒప్పంద వ్యతిరేక వైఖరి, అమెరికా వ్యతిరేక వైఖరి వగైరా వగైరాలన్నీ ప్రజల్ని మాయ చేయడానికి వాడే నినాదాల పటాటోపమేననేది బహిర్గతమైపోయింది.

ఈ నేపథ్యంలో, భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ కమిటీ నాయకురాలిగా ఎదిగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులూ, సభ్యులూ, సానుభూతిపరులూ దాని జెండా కింద సమైక్యమై, సోషల్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే వారిని ప్రేరేపించడానికి తమకు తాముగా సిద్ధమయ్యారు. వారి పోరాటానికి ద్రోహం చేయడానికి ప్రయత్నించేవారికి ప్రజలు ఎప్పటికప్పుడు గుణపాఠాలు కూడా నేర్పారు. పోరాటంలో పాల్గొనేవారు మావోయిస్టు కావచ్చు, మమతాయిస్టులూ, సిద్దిస్టులూ, మేధావిస్టులు ఇంకా ఎవరైనా కావచ్చు, ఏ ప్రాపంచిక

# నందిగ్రామ్‌లో సి.పి.ఐ (ఎం) మీదా, దాని బలప్రయోగం మీదా ఢిల్లీలోని జె.ఎన్.యు గౌరవాచార్యుడు అమిత్‌భాదురి పరిశీలన

*[వామపక్షం అని చెప్పుకుంటున్న సి.పి.ఐ (ఎం) తన గూండాలతో నందిగ్రామ్‌ను 'పునరాక్రమణ' చేసిన విధానానికి వ్యతిరేకంగా ఢిల్లీ జె.ఎన్.యులోని గౌరవాచార్యుడు, ప్రఖ్యాత 'వామపక్ష' ఆర్థికవేత్త అమిత్‌భాదురి తన తీవ్ర ప్రతిస్పందనను వెలిబుచ్చారు. బడా కార్పోరేట్ సంస్థల కండ బలాన్ని అడ్డుకోవడానికి నందిగ్రామ్ ప్రతిఘటనే మార్గం అనే గట్టి నమ్మకం ఇప్పటికీ ఆయన అంతర్దృష్టికి నిదర్శనం. నందిగ్రామ్ పునరాక్రమణకు వ్యతిరేకంగా కలకత్తాలో పెద్దయెత్తున జరిగిన ప్రజా ఊరేగింపులో ఆయన పాల్గొన్నాడు. అమిత్‌సేన్ గుప్తతో ఆయన సంభాషణకు సంబంధించిన హార్డ్‌న్యూస్ పత్రికలో వచ్చిన పూర్తి పాఠాన్ని ఇక్కడ అందిస్తున్నాం.]*

**అమిత్‌సేన్‌గుప్త:** నందిగ్రామ్ పునరాక్రమణ పర్యవసానంలో వామపక్ష ఐక్యతపై నోమ్ చామ్‌స్కీ, తారిక్ ఆలీ, తదితర మేధావులతో కలిసి ఉమ్మడిగా రాసిన లేఖపై మీ వైఖరి ఏమిటి?

**అమిత్‌భాదురి:** వామపక్ష ఐక్యత వాంఛనీయమా, కాదా అనే మీ ప్రశ్న స్పష్టమే. సిద్ధాంతపరంగా వాంఛనీయమే. పారిశ్రామిక కార్పోరేట్ సంస్థలకు పార్టీ పూర్తిగా అమ్ముడు పోయినప్పుడు, ప్రయివేట్ పెట్టుబడి కోసం అది రైతుల భూముల్ని కబ్జా చేస్తుంది. పెద్ద పెద్ద తప్పులు చేస్తూనే వుంటుంది. ఇక వామపక్ష ఐక్యత సాధ్యం కాదు. వామపక్షం పూర్తిగా కార్పోరేట్ అనుకూల, పెట్టుబడి అనుకూల తంత్రంలో చిక్కుకున్నాక ఐక్యత ఎలా సాధ్యం?

**అ.సే:** ప్రస్తుత ఆర్థిక విధానాన్ని సి.పి.ఐ (ఎం) ఎందుకు దూకుడుగా ముందుకు తీసుకొస్తున్నది?

**అ.భా:** బెంగాల్‌లో 30 సంవత్సరాల ఆధిపత్య పాలన తర్వాత సి.పి.ఐ (ఎం) పూర్తిగా విఫలమైందనేది వాస్తవం. భూసంస్కరణలకు సంబంధించిన ఆపరేషన్ బర్గా తర్వాత, ఉత్పత్తి రంగానికి ఏమీ చేయకుండానే విఫలమైంది. ఉదాహరణకు, ఎన్.ఆర్.ఇ.జి.ఎ (జాతీయ ఉపాధిహామీ పథకం)ను తీసుకుంటే, ఇందులో సి.పి.ఐ (ఎం) నిర్వహణ అధమస్థాయిలో వుంది. అధమ స్థాయి రాష్ట్రాలకంటే అధమం. నేను మీకొక ఉదాహరణ చెపుతాను. పురులియా జిల్లాలో 2007 అక్టోబర్ చివరి వరకు ఎన్.ఆర్.ఇ.జి.ఎ కోసం కేటాయించిన 16 శాతం డబ్బును ఉపయోగించనే లేదు. వ్యవసాయోత్పత్తిని పెంచటం లేదా, ప్రజల జీవనాధారాన్ని పెంచాలనే సంకల్పం, ఆలోచన బుద్ధదేవ్ భట్టాచార్యకు లేవు. పారిశ్రామికీకరణకు సంబంధించిన మధ్యతరగతి సంకుచిత భావాలు అతడ్ని నడిపిస్తున్నాయి. ఇది భావ దారిద్ర్యం.

**అ.సే:** మన్మోహన్‌సింగ్ - మాంటెక్ సింగ్‌ల పెరుగుదల నమూనాకు, బుద్ధదేవ్ - బిమన్ బోసుల అభివృద్ధి నమూనాకూ మధ్య తేడా ఏమిటి?

**అ.భా:** ప్రకాశ్‌ను ఎందుకు చేర్చలేదు. కాంగ్రెస్ అభివృద్ధి పంథాకూ, సి.పి.ఐ (ఎం) అభివృద్ధి పంథాకూ మధ్య తేడా ఏమీ లేదు. చెప్పే మాటల జోరులో తప్ప. ఉదాహరణకు, ట్రేడ్ యూనియనిజమ్ గురించి మాట్లాడినప్పుడు, సి.పి.ఐ (ఎం) ప్రావిడెంట్ ఫండ్ సమస్యను లేవనెత్తుతుంది. ఇది పరిమిత సమస్య. పునాదికి సంబంధించిన విషయాలను చూస్తే, కార్పోరేట్ సంస్థలకు దళారిగా వ్యవహరిస్తూ, శతాబ్దాలుగా రైతులకూ, ఆదివాసులకూ హక్కు భుక్తమైన భూమిని ఆక్రమిస్తున్నది - ఇది మౌలికంగా వలసీకరణ. చాలా వింత ఏమంటే, వాళ్ళు అమెరికా వలసవాదం, సామ్రాజ్యవాదం గురించి మాట్లాడతారు. కానీ ప్రస్తుత ప్రపంచీకరణ క్రమానికి ఇదే సర్వస్వం అన్నట్లు అంతర్గత వలసవాదాన్ని అనుమతిస్తున్నారు. వాళ్ల పూర్తిగా గందరగోళపరచి ఆ తర్వాత వలసీకరణ విషయంలో రెండు నాల్కల ధోరణి అవలంభించేటట్లు కన్పిస్తున్నది.

**అ.సే:** అందువల్ల కమ్యూనిస్టులా లేక జర్మనీలోని క్రైస్తవ ప్రజాస్వామికవాదుల లాంటి వాళ్లా?

**అ.భా:** యూరప్‌లో నేను క్రైస్తవ ప్రజాస్వామికవాదుల్ని సన్నిహితంగా పరిశీలించాను. వాళ్ళు పూర్తిగా భ్రష్టుపట్టిపోయారు. ఇందుకు విరుద్ధంగా సి.పి.ఐ (ఎం) కమ్యూనిస్టు పార్టీ. పొలిట్‌బ్యూరో, కార్యకర్తలు మొదలైన నిర్మాణ పద్ధతులపరంగా లెనినిస్టు పార్టీకి చెందిన తప్పనిసరి సిద్ధాంతాలను పూర్తిగా అనుసరిస్తారు. కానీ వాస్తవంలో కమ్యూనిస్టేతర పార్టీగా పని చేస్తారు. సిద్ధాంతాలకు లెనినిస్టు పార్టీకాగా, సారంలో బూర్జువా పార్టీ. కమ్యూనిస్టు పార్టీ విప్లవం కొరకు, విప్లవ సిద్ధాంత నిబద్ధతతో పని చేస్తుంది తప్ప, స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్యం కోసం, కార్పోరేట్ సంస్థల కోసం కాదు.

**అ.సే:** ఈ నూతన అవిశ్రాంత ప్రపంచీకరణ యుగంలో నందిగ్రామ్ వేర్పాటు ముద్ర వేస్తుందనుకుంటున్నారా?

**అ.భా:** నందిగ్రామ్‌లో మనం విజయవంతమైతే అది ప్రపంచీకరణను ముందుకు నడిపిస్తున్న బడా కార్పోరేట్ సంస్థల కండబలాన్ని అడ్డుకోవటంలో సహాయపడుతుంది. అప్పుడు ఈ క్రమాన్ని మనం ఓడించగలం. అప్పుడు సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ భవిష్యత్తు గొప్పగా వుంటుంది.

దృక్పథాలు కలిగి వున్నప్పటికీ, వారి మధ్య ఎటువంటి అడ్డంకులూ లేకుండా అందరూ కలిసి కట్టుగా పోరాడారు.

భూమిని కాపాడుకోవటం, ఎస్.ఇ.జడ్‌లను పూర్తిగా వ్యతిరేకించటం, సామ్రాజ్యవాదాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యతిరేకించటం, హర్మద్ బహినీలను ప్రతిఘటించటమూ ఇంకా ఇటువంటి వాటికి సంబంధించిన డిమాండ్లే నందిగ్రామ్ తిరుగుబాటులో అందరి లక్ష్యమైంది. ఈ నేపథ్యంలో పోరాటంలో పాల్గొన్నవారందరూ ప్రజా తిరుగుబాటును, సాయుధ ప్రతిఘటనను బలోపేతం చేయడంలో తమ పాత్రను సమర్ధవంతంగా నిర్వహించడం తప్ప మరో ఆలోచన లేకుండా, మాటల్లో కాకుండా, చేతల్లో ఎటువంటి త్యాగానికైనా మానసికంగా సిద్ధమయ్యారు. ఇదీ ప్రజలు నిర్వహించిన, నిర్వహిస్తున్న పాత్ర.

ఇక్కడ నందిగ్రామ్‌లో గాంధేయవాదులు, కుహనా సోషలిస్టులు, సోషలిస్టులూ, ప్రగతిశీలవాదులూ, విద్రోహులూ, పీడితులూ, విప్లవకారులూ, రివిజనిస్టులూ, విప్లకర మార్క్సిస్టులూ, మావోయిస్టులూ అందరూ వున్నారు. కాని ప్రతివాళ్లూ రోజువారీ జీవితంలో, పోరాటంలో, సంఘానికి సంబంధించిన విషయాల్లో కూడా హర్మద్‌లనూ, పోలీసుల నిర్బంధాన్నీ ఎదుర్కొంటున్నారు. పోరాట రూపాలను బట్టి, పోరాట రూపాల స్వభావం ఎలా వుండాలనేది ప్రజలు నిర్ణయిస్తూ వివిధ రకాల ఆలోచనలూ, సిద్ధాంతాలతో యుద్ధ రంగంలో చేరిన వారందరినీ సమైక్య శక్తిగా నిలబెట్టటంలో కీలక పాత్ర పోషించారు. ప్రజల పాత్ర సానుభూతివరకో లేక మరికొంచెం చురుకైన పాత్ర వరకో పరిమితమై వుంటే, జనవరి నాటికి లేదా మహా అయితే మార్చి 14 మారణకాండ నాటికే ప్రతిఘటన కన్పించకుండా పోయేది. కానీ, అలా జరగలేదు. ఎందుకు? ప్రజలు తమ ఆచరణ ద్వారానే దీనికి సమాధానం చెపుతున్నారు, చెబుతారు కూడా. నవంబర్ సంఘటనల తర్వాత సి.పి.ఐ (ఎం), దాని సాయుధ గూండాలూ సాధించిన తాత్కాలిక ఆధిక్యతను ఓడించడానికి, ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులు తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తారు.

నందిగ్రామ్ ప్రతిఘటనపై జె.ఎన్.యు (జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం) ప్రొఫెసర్ అమిత్‌భాదురి మాట్లాడుతూ *"నందిగ్రామ్‌లో మేము విజయవంతమైతే, ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోతున్న బడా కార్పొరేషన్ల కండ బలాన్ని ఆపడంలో అది సహాయపడుతుంది. అపుడు ఈ క్రమాన్ని మేము ఓడించగలుగుతాం. అది సాధారణ ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ భవిష్యత్తుకు గొప్పగా ఉపయోగపడుతుంది"* అన్నాడు. [బాక్స్ చూడండి]

**పోరాట రూపాలు**

లిబరేషన్ గ్రూపు నాయకుడు దీపాంకర్ భట్టాచార్య హింసామార్గం మీద తమ గ్రూపుకు నమ్మకం లేదనీ, తాము ఎన్నికల పంథా మీద నిలబడ్డామనీ అందువల్ల, బుద్ధదేవ్ రాజీనామా చేయాలని మాత్రమే తాము డిమాండ్ చేస్తామనీ వార్తా పత్రికలతో చెప్పాడు. భేష్! దీపాంకర్ బాబూ భేష్! నీ ఆధునిక రివిజనిస్టు ఆలోచనకూ, నీ పెద్దన్నను రక్షించే నీ నిర్ణయానికీ కృతజ్ఞతలు. మొహమాటం లేకుండా బయటపడ్డావు. ఆ పనే ఇంకా బాగా చెయ్. అప్పుడుగాని హర్మద్‌లు వాళ్ల గురువులైన లక్ష్మణ్, దీపక్, తపన్, సుకూర్, లేదా నిరుపమ్, బిమన్ లాంటి వాళ్ల పక్కన నిన్ను కూడా చేర్చి ఇంకో గురువుగా గౌరవిస్తారు. ఆ విధంగా నువ్వు సామ్రాజ్యవాదులూ, భారత దళారీ నిరంకుశ బూర్జువాల, వారి సేవకులు బుద్ధదేవ్ లాంటి వాళ్ల నమ్మకమైన వ్యక్తిగా రుజువవుతావు.

జనవరి నుండి నవంబర్ మధ్య కాలంలో నందిగ్రామ్ ప్రజలుగానీ, మావోయిస్టులుగానీ, బి.యు.పి.సి గానీ హింసకు పాల్పడ్డారా? వాస్తవాలు మరో విధంగా చెపుతున్నాయి. ప్రజలెప్పుడూ తమ నిరసనల్ని శాంతియుత రూపాల్లోనే తెలియజేశారు. ఆ విధంగా ప్రతిరోజూ ఊరేగింపులూ, ప్రజలతో సమావేశాలూ నిర్వహించారు. వాస్తవానికి, నందిగ్రామ్ భూముల్నించి ప్రజలను బలవంతంగా వెళ్లగొట్టడానికి సి.పి.ఐ (ఎం) ఎల్లప్పుడూ భయోత్పాత, హింసాయుత ఎత్తుగడలకు పాల్పడింది. ఒకపక్క ప్రభుత్వం అన్ని రకాల అధికారాన్నీ, సాయుధ పోలీసు బలగాలనూ, వనరుల్నీ ప్రజల మీద పూర్తిస్థాయి యుద్ధానికి ఉపయోగిస్తుంటే, ప్రజలు ఎలాంటి నిరసనా తెలియజేయకుండా, పాలకులకు బలికావాలా? ప్రజల స్వీయరక్షణ హక్కు హింసకు దారితీస్తుందంటే నందిగ్రామ్ ప్రజలప్పుడు సరైన జవాబిస్తారు. తమ ఉనికి కోసం ప్రతిహింస అవసరాన్ని చూపిస్తారు.

ఈ అంశం మీద సి.పి.ఐ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ నవంబర్ 27న తన పత్రికా ప్రకటనలో ఈ విధంగా స్పష్టం చేసింది. *గత 30 సంవత్సరాల్లో బెంగాల్లో రాజ్యహింస విప్లవ హింస అవసరమైన పరిస్థితిని తయారు చేసిందనేది స్పష్టం. సి.పి.ఐ (ఎం) హింసపై జరిగిన అధ్యయనాలు దీన్నే స్పష్టం చేస్తున్నాయి. హింస కోసమే హింస అనే సిద్ధాంతాన్ని మేము అంగీకరించం. ప్రస్తుత సమాజాన్ని నూతన సమాజానికి మార్చటంలో విప్లవ హింస మంత్రసానిలా ఉపయోగపడుతుందనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మేము నమ్ముతాం. వాస్తవానికి, అన్ని రకాల ప్రతీఘాతుక హింసనూ అంతం చేసి, మానవ సమాజంలో నిజమైన శాంతిని స్థాపించడంలో విప్లవ హింస అవసరం వుంది."*

పోరాట రూపం ఇలా వుండాలనీ, అలా వుండాలనీ ఆదేశించే హక్కు ఎవరికీ లేదు. ఏ పోరాట రూపాన్ని చేపట్టాలనేదీ, ఏ చర్య తీసుకోవాలనేదీ ప్రజలే నిర్ణయిస్తారు. ఇక్కడ మన గొప్ప రివిజనిస్టులూ, ఉదారవాదులూ అడుగుతున్నదేమంటే, ఇక రాజకీయ స్పృహ కల్గిన వ్యక్తి పాత్ర ఏమిటీ అని. ఇక్కడ ఎవరైనా పోరాటా రూపాల మీద తమ స్వంత నిర్ణయాలకొచ్చేముందు చరిత్ర పుటల్ని తిరగేయాలి.

కానీ ప్రతిఘాతుక విప్లవ శక్తులూ, ప్రభుత్వ బలగాలూ దురాక్రమణ పూరిత హింసకు పాల్పడుతున్న చోట లేక సామూహిక హత్యలు ప్రధాన రూపంగా మారిన చోట, నందిగ్రామ్ మాదిరిగా వరి పొలాలు స్మశానాలుగా మారిన అనివార్య స్థితిలో, రాజకీయ పోరాటం లేదా భూపోరాటం లేదా ప్రస్తుత అధికారానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం అనివార్యంగా సాయుధ ప్రతిఘటనతో ముడిపడుతుంది. నందిగ్రామ్ తిరుగుబాటు ఎటువంటి సందేహానికి తావులేకుండా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పింది. హర్మద్‌ల ప్రవేశాన్ని అడ్డుకోవడానికి, 11 నెలల ప్రతిఘటనలో ప్రజలు అనేక రకాల పోరాట రూపాల్ని తీసుకున్నారు. ఊరేగింపులు, రోడ్లను తవ్వటం, బారికేడ్లు నిలబెట్టటం, మారణాయుధాలు సేకరించటం, సాయుధంగా ప్రతిఘటించటం, రాత్రింబవళ్లు పహారా కాయటం, విద్యార్థులతో పోలీసుల్ని స్కూళ్ల నుంచి బయటికి పంపించేలా చేయటం, దాడుల సమయంలో ఖెజూరి నుంచి శంఖారావాలతో అప్రమత్తం చేయటమూ, హిందూ, ముస్లింల మధ్య అన్యోన్యతను పెంచటం, అమరుల మృతదేహాలతో ఊరేగింపులూ మొదలైన ప్రతిఘటనా రూపాలన్నింటినీ చేపట్టారు.

ఇక అక్టోబర్ 27కు ముందూ, ఆ తర్వాత నవంబర్ 10 వరకూ, ఆ తర్వాత జరిగిన నందిగ్రామ్ యుద్ధాన్ని చూద్దాం. ప్రజలు అత్యంత కఠినమైన పోరాటం చేశారు. పెద్ద సంఖ్యలో దురాక్రమణ దాడుల దండు 11 నెలల పాటు రాత్రింబవళ్లు తమను భయోత్పాతాలకు గురిచేసి, లొంగదీసుకోవాలని చేసిన ప్రయత్నాలను ఎదుర్కోవటానికీ, తమ ఆప్తుల జీవితాలనూ, వారి ఆస్తులనూ కాపాడుకోవటానికి ప్రజలు పెద్ద మూల్యాన్నే చెల్లించారు. నవంబర్ యుద్ధంలో ఫాసిస్టు సి.పి.ఐ (ఎం) నాయకులు ఆమూలాగ్రం క్రూరమైన ఆటవిక కార్యక్రమం ద్వారానే నందిగ్రామ్ మీద తమ తిరుగులేని ఆధిపత్యాన్ని స్థాపించడానికి తమ స్వంత మూకలనే గాక, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల నుండి కిరాయికి తెచ్చిన క్రూర బందిపోటు ముఠాలతో సహా మొత్తం బలగాలను కదిలించే పథకాన్ని తయారు చేసి దండెత్తారు. తాత్కాలికంగా హర్మద్ గూండాలు నందిగ్రామ్‌లోకి ప్రవేశించగలిగారనే దాంట్లో సందేహం లేదు. కానీ, ప్రజలూ, బి.యు.పి.సి కలిసి నవంబర్ 10న వారు కోల్పోయిన దాన్ని ఖచ్చితంగా సాధించుకుంటారు. ఈ భూమ్మీద ఎవరూ దీన్ని ఆపలేరు.

## అలీముద్దీన్ వీధి ఎత్తుగడలు

నందిగ్రామ్‌లో ఎస్.ఇ.జడ్ వ్యతిరేక తిరుగుబాటు నాలుగు దశల్లో కొనసాగింది. జనవరి నుండి మార్చి 14 వరకు మొదటి దశ. మార్చి 15 నుండి అక్టోబర్ మధ్య వరకు రెండవ దశ. అక్టోబర్ మధ్య నుండి నవంబర్ 10 వరకు మూడవ దశ. నవంబర్ 10 నుండి నాల్గవ దశ కొనసాగుతున్నది. ఈ నాల్గు దశల్లో, సి.పి.ఎం నాయకత్వంలోని ఎస్.ఇ.జడ్ అనుకూల శక్తులు, దాని వ్యూహం ప్రకారం వివిధ ఎత్తుగడల్ని అవలంబించాయి. నాల్గవ దశలో రెండు పక్షాలు అవలంబించిన ఎత్తుగడలను మరికొంత గమనించాల్సి వుంది. మొదటి, రెండవ దశల్లో బి.యు.పి.సి ఆధ్వర్యంలోని శక్తులది పైచేయిగా వుండగా, మూడవ దశలో ఎస్.ఇ.జడ్ అనుకూల, వ్యతిరేక శక్తులు రెండూ తీవ్రంగా యుద్ధానికి తలపడ్డాయి. నవంబర్ 6-7 తేదీల వరకు ఎస్.ఇ.జడ్ వ్యతిరేక శక్తులు దురాక్రమణదారులను వీరోచితంగా ప్రతిఘటించాయి. కానీ ఆయుధాల ఆధిక్యత, బలగాల సంఖ్య రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వపాత్ర, నిరంతర సప్లై మార్గాలూ సి.పి.ఐ (ఎం) హర్మద్ గూండా మూకల చొరబాటుకు తాత్కాలికంగా పై చేయి సాధించి పెట్టాయి. వ్యాసం రాసేనాటికి సి.పి.ఎం పైచేయి స్థితి కొనసాగుతున్నది.

జనవరి నుంచి మార్చి 14 సంఘటన వరకు, ప్రజల్ని భూముల్నించి వెళ్లగొట్టడానికి, సి.పి.ఎం ఎక్కువ బలగాలను ఉపయోగించకుండ బలవంతపెట్టే ప్రయత్నం చేసింది. అప్పటికే సింగూరు భూముల్ని స్వాధీనం చేసుకున్న విధానానికి ఇది కూడా తోడు కావటంతో, అనేక మంది దీన్ని తీవ్రంగా ఖండించారు. వామపక్ష కూటమికి చెందిన చిన్న చిన్న నాయకుల నుంచి కాంగ్రెస్ నాయకులతో సహా బూర్జువా పార్టీలన్నీ దీన్ని ఖండించాయి. ఆవిధంగా నందిగ్రామ్‌లో బెదిరింపులు, చంపడాలు, అత్యాచారాలూ, గృహదహనాలూ, లూటీ, పోలీసు క్యాంపులు, హర్మద్ బహినీలు, ఊపిరిసల్పకుండా చేయటం, తిట్టడం, చివరగా దౌత్యం లాంటివి వాళ్లు చేయగలిగినవల్లా చేసి ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించారు. అలీముద్దీన్ వీధి [సి.పి.ఐ (ఎం) రాష్ట్ర ప్రధాన కేంద్రం] దీపక్ సర్కార్ (మిద్నపూర్ కార్యదర్శి) నుండి ఎం.పి లక్ష్మణ్ సేథ్ స్థాయి వరకు తన భయోత్పాతాన్ని సృష్టించే నాయకులను ఎంతో మందిని అక్కడికి పంపింది. కానీ నందిగ్రామ్ ప్రజలు తమ భూముల్ని ఇచ్చేది లేదని దృఢంగా చెప్పారు. మొదట సి.పి.ఐ (ఎం) కార్యకర్తలు ప్రజల్లో భయోత్పాతం సృష్టించి చంపారు. ఆ తర్వాత పోలీసులూ, కార్యకర్తలూ కలిసి మారణకాండ జరిపారు. కానీ, ఈ ఎత్తుగడలూ, పద్ధతులన్నింటినీ ప్రజలు తిప్పికొట్టారు. అన్నివైపులా అన్ని వర్గాల ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తడంతో, ఈ పరిస్థితి నుండి బయట పడటానికి సి.పి.ఎం తన దూకుడును తగ్గించి, అబద్ధాలు, తప్పుడు సమాచారం, అవాస్తవాలూ, అస్పష్ట గణాంకాలతో అనేక ప్రకటనలు గుప్పించింది. ఢిల్లీ నుంచి కలకత్తా వరకు, కారత్ నుంచి బిమన్, ఏచూరీల వరకూ, బింద్రాడువో నుంచి బుద్ధా-బినయ్-నిరుపమ్-బినయ్, ఇంకా శ్యామల్ ముఠాల వరకూ అందరూ 'నష్ట నివారణ' పద్ధతుల్లో భాగంగా ప్రచారానికి పూనుకున్నారు.

కానీ సి.పి.ఎంకే చెందిన అంతర్గత సలహాదారులు హెచ్చరించినప్పటికీ, మరీ నగ్నంగా సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల, ఎన్.ఆర్.ఐ (విదేశాల్లో నివసించే భారతీయులు)ల, టాటా,



రిలయన్స్, వీడియోకాన్ తరహా కార్పోరేట్ సంస్థల యజమానుల ఆదేశిత ఎజెండానే బెంగాల్ పాలకుల ఏకైక కార్యక్రమంగా మారింది. ప్రారంభంలో పోలీసుల్ని దింపినట్లు దింపడానికిబదులు, ఎత్తుగడలు మార్చారు. ప్రజల్ని సుదీర్ఘకాలం పాటు భయోత్పాతాలతో బెదిరించి, వత్తిడి పెంచి, లొంగదీయడానికి, పోలీసులను వెనుక సపోర్టుగా వుంచి, నందిగ్రామ్ చుట్టూ కార్యకర్తలను దించారు. నష్ట నివారణలో భాగంగా, పోలీసుల్ని పక్కకు వుంచటం, ప్రత్యేకించి, అధికారులు చర్యలు తీసుకోవద్దని, జోక్యం చేసుకోవద్దని పోలీసులకు ఆజ్ఞలు జారీ చేసి, కొత్త ఎత్తుగడల చర్యను ముందుకు తెచ్చారు. దీనికి తోడు రాజకీయ ప్రచారాన్ని, పచ్చి అబద్ధాలను ప్రారంభించారు. ఆవిధంగా, ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలూ, సి.పి.ఎంకూ ఇతరులకూ మధ్య ఆ ప్రాంతాన్ని ఆక్రమించి, ఆధిపత్యం కోసం పోరాటం అనేది బెంగాల్‌లో మామూలు అంశంగా తయారైంది. ఆవిధంగా ప్రతిదీ, వాళ్లనుకున్నట్లు చేయాలనుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి, తన అధికారాన్ని స్థాపించడానికి సి.పి.ఐ (ఎం) 'లారేనెబో నందిగ్రామ్, జీత్‌బో వియత్నాం మాతెర్' (పోరాటంతో నందిగ్రామ్‌ను చేజిక్కించుకుంటాం, వియత్నాంలా గెలుస్తాం) అనే కొత్త నినాదాలతో ఢిల్లీ నుంచి కలకత్తా వరకూ కేంద్రీకరించింది. సి.పి.ఐ (ఎం) పార్టీ ఎం.పిలూ, పొలిట్ బ్యూరో సభ్యులూ, సీనియర్ నాయకత్వమూ తాము నందిగ్రామ్‌ను బలప్రయోగంతో ఆక్రమించుకుంటామని నొక్కి చెప్పారు. ఈ ఫాసిస్టు మనస్తత్వం ప్రజా ఉద్యమానికి చాలా ప్రమాదకరం. ప్రతి ఎత్తుగడలు అవలంభించేముందు, సోషల్ ఫాసిజం, సామ్రాజ్యవాదుల నిజ స్వభావాన్ని అర్థం చేసుకోవాలి.

నందిగ్రామ్ ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటాన్ని గెలవడానికి, ఈ ఎత్తుగడలు అవలంభిచడానికి సి.పి.ఐ (ఎం) నాయకులూ, పోలీసులూ కలిసి నిర్దిష్టమైన పథకాలు రూపొందించి, ఆయుధాలు, మందుగుండు, డబ్బు, కండ బలం ఇంకా వాళ్లకున్నవేవైనా సరఫరా చేశారు.

## క్యాంపులు, బంకర్లు

సి.పి.ఐ(ఎం) మొదట తూర్పు, పశ్చిమ మిడ్నాపూర్ నుంచి హంతక ముఠాలను ఎంపిక చేసింది. జననీ ఇటుక బట్టీ ప్రదేశాన్ని దాడులకు ఒక కేంద్రంగా ఎంపిక చేశారు. ఇక్కడ ఒక సెక్షన్ నాయకులు, హర్మద్‌లు క్యాంపు వేశారు. తల్పతికాలువ గట్ల మీద వివిధ స్థాయిల్లో గూండా బలగాలను దింపి, పర్యవేక్షణ చేయడానికి సాత్‌ఖుండ అనే గ్రామాన్ని రక్షిత కేంద్రంగా ఎంపిక చేశారు. కుజ్నాపూర్ గ్రామం వ్యూహాత్మక ప్రధాన కేంద్రంగా పని చేసింది. ఇక్కడి నుంచి కీలక నాయకులు, పోలీసు అధికారులు సమీక్షలు చేసి, బహినీ (గూండా మూకలకు)లకు ఎప్పుడేం చేయాలి, ఎక్కడ దాడి చేయాలనే ఆదేశాలు పంపేవారు.

నందిగ్రామ్ పూర్తిగా మైదాన ప్రాంతం. అటవీ ప్రాంతంలో తయారుగా వున్నట్లు సహజ సిద్ధమైన కవర్లూ (మాటు), దాపులూ దొరకవు. అందువల్ల, బి.యు.పి.సిని, ప్రజల్నీ నిరంతరం భయభ్రాంతులకు గురి చేయడానికి వాళ్లు అవసరమనుకున్న చోట్ల, తల్పతి కాలువ గట్ల మీద ఇసుక బస్తాలతో బంకర్లు నిర్మించడానికి హర్మద్‌లకు పోలీసులు మార్గదర్శకత్వం చేశారు. ఆవిధంగా, 2007 ఏప్రిల్ నుండి నవంబర్ వరకు నందిగ్రామ్ ఎస్.ఇ.జడ్ వ్యతిరేక యుద్ధ భూమిలో బంకర్ల నిర్మాణం మామూలు అంశమైంది. జననీ ఇటుక

బట్టీ ప్రదేశం ఇటుకలతో, ఇటుకల మట్టికోసం తవ్విన గుంటలతో హర్మద్‌లకు సహజమైన దాపు అవకాశాల్ని కల్పించింది. బంగాబేరా ఇటుక బట్టీ ప్రదేశాన్ని కూడా ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులకు బలమైన కేంద్రంగా వున్న బంగాబేరా, సోనాచురా గ్రామాలపై దాడులు చేయడానికి హర్మద్‌లు ఉపయోగించుకున్నారు.

సి.పి.ఐ (ఎం), ప్రభుత్వమూ, కార్పోరేట్ సంస్థల యజమానులూ కలిసి పెద్ద మొత్తంలో ఆధునిక ఆయుధాల నిల్వలను గూండాలకు పంపించారు. పోలీసుల ద్వారా, మాఫియా ద్వారా ఇంకా ఇతర మార్గాల ద్వారా ప్రతిరోజు సప్లైలు పంపించేవారు. వాళ్లకు రోడ్ల మీద చెకింగ్‌లూ, డబ్బుకొరత లాంటి ఇబ్బందులూ లేవు. సప్లైలతో నింపిన వాహనాలు వేరు వేరు స్థానాలకు వచ్చేవి. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 10 వరకు జరిగిన యుద్ధాల్లో ఉపయోగించిన తూటాలతో పోల్చితే ఏప్రిల్, అక్టోబర్ మధ్య కాలంలో ఉపయోగించిన తూటాల సంఖ్య తక్కువ. ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులను అణచడానికీ, ప్రజలను చంపడానికీ, భయోత్పాతం సృష్టించడానికీ సి.పి.ఐ (ఎం) వేలాది తూటాలను ఉపయోగించింది. నందిగ్రామ్ యుద్ధానికి, ప్రత్యేకించి నవంబర్ యుద్ధ ఘటనకు ఆయుధాలూ, మందుగుండు కొనడానికి కోట్లాది రూపాయలను బలవంతంగా వసూలు చేసింది. కోల్‌కత్తా నుంచి నందిగ్రామ్ లేదా హల్దియాకూ ఇంకా దగ్గరి ప్రాంతాలకూ వెళ్లే రోడ్లు సి.పి.ఐ (ఎం) కార్యకర్తల స్వాధీనంలోకి వెళ్లాయి. జనవరి నుండి డిసెంబర్ వరకు నందిగ్రామ్ ప్రాంతాన్నంతటినీ సి.పి.ఐ (ఎం) గూండాలు తమ దిగ్బంధంలోకి తీసుకుని, నిరంతరం రోడ్డు చెకింగ్‌లూ, దాడులూ చేస్తూ, నందిగ్రామ్‌లోకి, ఇతర ప్రాంతాల్లోకి ఎవర్నీ రానివ్వకుండ అడ్డుకోవటం చాలా మామూలైంది. పోలీసు బలగాలన్నీ ప్రేక్షక పాత్ర వహించగా, సి.పి.ఐ (ఎం) లక్ష్మణ్ మనుషులు అన్నింటిని తమ చేతుల్లోకి తీసుకున్నారు.

ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులు కూడా హర్మద్‌ల దాడుల ప్రమాదం వుందనుకున్న చోట్ల అంతటా బంకర్లు నిర్మించుకున్నారు. ప్రతిఘటిస్తున్న గ్రామాలను ఆక్రమించడానికి హర్మద్‌లు వివిధ స్థానాల నుంచి బలప్రయోగంతో చొరబడటానికి ఏప్రిల్ నుంచి ప్రయత్నిస్తూనే వున్నారు. అందువల్ల దురాక్రమణదారులను తిప్పికొట్టడానికి యుద్ధ సన్నాహాల అవసరం ముందుకొచ్చింది. కానీ, బి.యు.పి.సి పతాకం కింద ఐక్యమైన ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులకు సప్లైలు లేవు, కావాల్సినన్ని ఆయుధాలు లేవు, అదనపు బలగాలూ, ప్రభుత్వ పథకాల సమాచారమూ లేదు. వారి వనరులెప్పుడూ కొరత, కనీస స్థాయిలోనే వున్నా గానీ, వాళ్ల ధైర్యంతో, స్థిరనిశ్చయంతో పోరాడారు. ప్రజలు నిరాయుధ ఊరేగింపుల్లో పాల్గొన్నట్లే, పూర్తి ఉత్సాహంతో సాయుధ ప్రతిఘటనలో పాల్గొన్నారు. ఇవీ నందిగ్రామ్ ఎస్.ఇ.జడ్ వ్యతిరేక రైతాంగ తిరుగుబాటులో ప్రజలు తీసుకున్న ప్రత్యేక నిర్దిష్ట పోరాట రూపాలు.

## కిరాతక బలగాలను దింపినతీరు.

పేరుమోసిన మాఫియా నాయకుడు లక్ష్మణ్ సేథ్. పేద కుటుంబం నుంచి పైకెదిగిన లక్ష్మణ్‌సేథ్ తిరుగులేని అధికారం, డబ్బు బలంతో హల్దియా ప్రాంతం మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. అతడు లోక్‌సభ సభ్యుడు. అతని భార్య హల్దియా కార్పోరేషన్ మేయరు. లక్ష్మణ్‌ను, అతని ముఠాను ఎదిరించేందుకు ఎవరూ ధైర్యం చేయరు. మొదటి, రెండవ దశల్లో అతడు 400-500 మంది సాయుధ గూండాలనూ, మూడవ దశలో మరింత ఎక్కువ మందినీ దించాడు. గతంలో అవిభక్త మిడ్నాపూర్ జిల్లాల సి.పి.ఐ (ఎం) పార్టీ కార్యదర్శిగా, ఇప్పుడు పశ్చిమ మిడ్నపూర్ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న దీపక్ సర్కార్‌ను అలీముద్దీన్ వీధి [సి.పి.ఐ (ఎం) పార్టీ ప్రధాన కేంద్రం] ముఠా నందిగ్రామ్ దాడులకు కార్యనిర్వాహకుడిగా ఎంపిక చేసింది. తను స్వంతంగా తూర్పు, పశ్చిమ మిడ్నాపూర్ నుంచి ముఠాలను కదిలించాడు. గొడ్‌బత్తా, కేశ్‌పూర్, పింగ్లా, పొట్టాష్‌పూర్, భూపతినగర్, బుజచాలి నుంచి పేరుమోసిన హంతక ముఠాలను కొన్నింటిని దాడుల్లో ఉపయోగించారు. ఆరామ్‌బాగ్, గోఘట నుంచి గూండా బ్యాచ్‌లను అక్టోబర్ మధ్యలో నందిగ్రామ్‌కు తరలించారు.

బంకూరా, హుగ్లీ, హౌరా, ఉత్తర, దక్షిణ 24 పరగణాలూ ఇంకా కోల్‌కత్తా నుంచి కూడా అక్టోబర్ చివరలో, నందిగ్రామ్‌లోని వివిధ స్థానాల్లోకి గూండాలను దింపారు. కోల్‌కత్తా, టిటాగర్, బరాసత్, రాజర్‌హట్, మొగ్రాహట్ ఇంకా ఇతర ఎంపిక చేసిన ప్రదేశాల నుండి కూడా అనేక హంతక ముఠాలను తరలించారు. ఛోటో అంగారియా మారణకాండలో శాశ్వత నేరస్థులూ, పేరుమోసిన హంతక ముఠా నాయకులూ తపన్‌ఘోష్, సుకూర్ అలీలు రెండవ దశలో దాడులకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. ఛోటో అంగారియా మారణకాండ కేసుల్లో నిందితులుగా పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వాధికారం సి.పి.ఐ (ఎం) చేతుల్లో వుండటం వల్ల, గత ఆరు సంవత్సరాలుగా సి.బి.ఐ కూడా వీళ్లను ముట్టుకోవటం లేదు. చివరిగా నవంబర్ 10 మారణకాండ తర్వాత, వీళ్లు సి.పి.ఐ (ఎం) కార్యకర్తలతో కలిసి ప్రయాణిస్తున్న వాహనాలను ప్రజలు పట్టుకోగా, కొంత మంది బి.యు.పి.సి మద్దతుదారులను కొందర్ని తీవ్రంగా గాయపరిచి, తప్పించుకుని పారిపోయారు.

మరో హంతక ముఠా నాయకుడు, మంత్రి సుశాంత ఘోష్. తన అనుచరులకు ఆయుధాలు, నివాస వసతి సౌకర్యాలు కల్పించిన నేర చరిత్ర వున్నవాడు. ఇప్పుడు స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. చంద్రకోన రోడ్డు నుంచి సనాతన మాజి (స్థానిక కమిటీ కార్యదర్శి), సి.పి.ఐ (ఎం) పార్టీ దినపత్రిక గణశక్తి విలేకరి, జిల్లా కమిటీ సభ్యుడు మేఘనాధ్ భూయా, దీజన్‌రాయ్, అశోక్ బేరా ఇంకా డజన్ల కొద్దీ ఇతర నాయకులు దాడులకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు.

బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల నుంచి పేరు మోసిన బందిపోటు ముఠాలను, కిరాయి హంతక మూకలను 3వ దశ దాడుల కోసం దింపారు. బిమన్-బినోయ్-శ్యామల్, నిరుపమ్ ఇంకా ఇతర కేంద్ర కమిటీ సభ్యులూ, సి.పి.ఐ (ఎం) పార్టీ నిర్మాణాలను నియంత్రించేవారు నందిగ్రామ్ దాడులకు అవసరమైన వాటన్నింటినీ ఏర్పాటు చేశారు.

ఈ నాయకుల పేర్లూ, గుర్తింపూ ప్రజలకూ, ప్రసారమాధ్యమాలకూ, శాసన కర్తలకూ చాలా బాగా తెలుసు. కానీ ప్రస్తుత వ్యవస్థ వలలో వీళ్లెప్పుడూ చిక్కరు. ఏమైతేనేమి, ఈ విషయాలను పోరాడే ప్రజలకు వదిలి, ఇకిప్పుడు బలగాలను దింపిన విషయాన్ని చూద్దాం.

నందిగ్రామ్-1, నందిగ్రామ్-2, ఖెజూరి-1, ఖెజూరి-2 బ్లాకులు ఎస్.ఇ.జడ్‌కు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత యుద్ధానికి ప్రతీకలు. సి.పి.ఐ(ఎం)కు కూడా ఖెజూరిలో స్థావరం వుంది. కానీ ప్రజలు దానితో లేరు. కానీ సి.పి.ఎం ఆటవిక ఎత్తుగడలతో బలవంతంగా దాన్ని ఆక్రమించుకుంది.

చాలా పెద్దయెత్తున సి.పి.ఐ (ఎం) కార్యకర్తలూ హర్మద్ బహినీ అని పిలిచే కిరాయి హంతక మూకలు ఆక్రమణకు అనువైన స్థానాల్లో తిష్టవేశారు. కుంజాపూర్‌ను చర్యల ప్రధాన కేంద్రంగా తయారు చేసి, సాత్‌ఖుండ, షారిఖా మొదలైన వాటిని స్థావరాలుగా ఉపయోగించుకున్నారు.

తల్పతి కాలువ గట్ల పొడవునా సి.పి.ఐ (ఎం) తొమ్మిది గట్టి కేంద్రాలను నిర్వహించింది. అవి కదరాబల్‌చార్, లక్కింధాన్, బంగబేడా, పంఖాయ్, శిబనిబట్టి, తాలిబట్టి, జననీబట్టి, జోహనాబాద్. ఈ కేంద్రాలను నవంబర్ 10న ప్రజా ఊరేగింపులపై చివరి దాడి చేసే వరకూ నిర్వహించారు.

రాణిచౌక్, డి.కమల్‌పూర్, తకాపర ఇంకా ఇతర గ్రామాలు సి.పి.ఐ (ఎం) చేతుల్లో వున్నాయి. కానీ అక్టోబర్ మధ్య నుండి అక్కడ పరిస్థితి అస్థిరత్వంలో వుంది. నవంబర్ మొదటి వారంలో హర్మద్ బహిని ఈ కేంద్రాలపై తన నియంత్రణ స్థాపించి ఎస్.ఇ.జడ్ వ్యతిరేక శక్తుల మీద దాడులు ప్రారంభించడానికి ఉపయోగించుకుంది.

## ఎస్.ఇ.జడ్ యుద్ధ భూమిలో కొన్ని ముఖ్యమైన యుద్ధ ఘటనలు, బహుముఖ దాడులు

అక్టోబర్ మధ్య వరకు సి.పి.ఐ (ఎం) వైపు నుండి రోజువారిగా చెదురుమదురు కాల్పులు, బాంబులు వేయటం జరిగింది. ప్రతిగా బి.యు.పి.సి వారు కూడా తమ స్థానాల నుండి కాల్పులు జరిపారు. ఇది అందరికీ తెలిసిందే. సమాజాన్ని మార్చడానికి తాము సాయుధ పోరాట పంథా అవలంభిస్తామని మావోయిస్టులు మాత్రమే ప్రకటించారు. ఇతరులు తమ స్వంత లక్ష్యాలను సాధించుకోవడానికి ఇటువంటి ప్రకటనేదీ చేయకుండానే, అనాలోచితంగా కాల్పుల శక్తి ఉపయోగిస్తున్నారు. ఇక్కడ నందిగ్రామ్ అటువంటిదే.

ప్రభుత్వ బలగాలను చేతిలో పెట్టుకుని, సోషల్ ఫాసిస్టులూ, మతోన్మాద ఫాసిస్టులు తమ ఆదేశాలకు ఎదురులేదన్నట్లు ప్రత్యర్థులను అణచడానికి ఎల్లప్పుడూ ఇదే మార్గం తొక్కుతున్నారు.

రాణిచౌక్, కమలాపూర్, తకాపర మొదలైన గ్రామాల ప్రజలు బి.యు.పి.సి పోరాట శక్తులతో చేతులు కలిపి, సి.పి.ఐ (ఎం) పట్ల తమ దృక్పధాన్ని మార్చుకున్నారు. వాళ్లు నందిగ్రామ్‌లో సి.పి.ఐ (ఎం) పాత్రను చాలా స్పష్టంగా తెలుసుకున్నారు. అక్టోబర్ మధ్యలో ప్రజలు తిరగబడ్డప్పుడు, నందిగ్రామ్-2 గ్రామాలైన రాణిచౌక్, సతంగబాడి, జంబారి, బృందాబన్‌చౌక్, మరికొన్ని కేంద్రాల నుండి సి.పి.ఐ (ఎం) నాయకత్వం ఖాళీ చేసి వెళ్లిపోయారు. అక్కడ కూడా ప్రజలు బి.యు.పి.సితో దాని పోరాటకారులతో కలిశారు.

## రాణిచౌక్ కోసం యుద్ధం

రెండు వైపుల నుండి ఈ యుద్ధం ఎందుకు జరుగుతోంది, అని కొందరు అనుకుంటారు. 85-90 శాతం ప్రజలకు భూమి జీవనాధార వనరు. ఎస్.ఇ.జడ్ కోసం భూమి నుంచి వెళ్లగొడితే, వాళ్లకు వీధుల్లో భిక్షమెత్తుకోవటం తప్ప మరో దారి లేదు. అందువల్ల వాళ్లు తుది వరకూ పోరాడటానికే నిశ్చయించుకున్నారు. ప్రజలకది బతుకుదెరువు కోసం పోరాటం. కానీ సి.పి.ఐ (ఎం)కు అది తమ యజమానులనూ, సామ్రాజ్యవాద ప్రభువులనూ సంతృప్తి పరిచేందుకు చేసే పోరాటం. 'వామపక్ష' ప్రభుత్వం కార్పోరేట్ సంస్థల ప్రయత్నాలను వేటినీ వ్యతిరేకించదు.

హర్మద్‌లకూ, ఎస్.ఇ.జడ్ వ్యతిరేక పోరాటకారులకూ మధ్య ముఖాముఖి యుద్ధానికి ప్రతీక రాణిచౌక్. మేము సేకరించిన రిపోర్టుల ప్రకారం సోషల్ ఫాసిస్టుల వైపు 27 మంది చనిపోయారు. కానీ ఈ యుద్ధంలో ముగ్గురే చనిపోయారని వాళ్లు చెప్పుకున్నారు. శంభు, కోయకాజీలు అమరులయ్యారు. సి.పి.ఐ (ఎం) వైపు 16 మంది, బి.యు.పి.సి వైపు నలుగురు గాయపడ్డారు.

కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో నవంబర్ మాసానికి స్ఫూర్తిదాయకమైన పాత్ర వుంది. కానీ భారతదేశంలో సోషల్ ఫాసిస్టుల చేతిలో నవంబర్ మాసం చీకటి అధ్యాయంగా మారింది. ప్రజలు ఏ పోరాట రూపాలు తీసుకున్నా, తామెవరినైనా చంపుతామని ప్రజల ముందు తమకు తాము రుజువు చేసుకున్నారు. హర్మద్‌లకు, పోలీసులకు తమ ప్రతిఘటనను ప్రదర్శించడానికి ప్రజలు మూడు ఊరేగింపులు నిర్వహించారు. వేలాది మంది ప్రజలు వాటిలో పాల్గొన్నారు.

## వామపక్షం ఎవరు?

*(2007 డిసెంబర్ హార్డ్‌న్యూస్ పత్రికలో ప్రచురించిన వ్యాసంలోని కొంత భాగాన్ని ఇక్కడ అందిస్తున్నాం)*

బెంగాల్‌లో లౌకిక - ప్రజాస్వామిక - నిజమైన సోషలిస్టు శక్తులుతమ భిన్నాభిప్రాయాన్ని వెల్లడించినందుకు, వారి గొప్ప చైతన్యానికి వందనాలు తెలియచేస్తున్నాం. ఈ రాజకీయ మధనానికి వేరుగా నిజమైన వామపక్ష, ప్రజాస్వామిక రాజకీయాలు వెలికిరావచ్చు. బహుశా నైతికంగా దివాళాకోరుగా మారిన అధికార వామపక్షం నుంచి వేరుగా కావచ్చు.

### సుమిత్‌సర్కార్, తనికా సర్కార్; ఢిల్లీ

నందిగ్రామ్‌ను వెనక్కు తీసుకున్నామని సి.పి.ఐ (ఎం) మాకు చెప్పింది. ఒకప్పుడు అది లౌకిక వామపక్ష స్థావరం. భూమి, జీవనాధారాన్ని విశ్వసించదగని కార్పోరేట్ గ్రూపుకు స్వాధీనం చేసే పార్టీ కార్యక్రమాన్ని ధిక్కరించే ధైర్యం చేసింది. అటువంటి వామపక్షం ప్రజా జీవితాలతో ముడిపడి వున్న భూమి గురించి ఇప్పుడు సమర్థించుకునే వాదన చేయటం బాధాకరం. మారణకాండలు, అత్యాచారాలు, హత్యలు, గాయపరచటం లాంటివి నమ్మశక్యంకాకుండా 11 నెలలపాటు సాగాయి. ఎట్టకేలకు ఈ ధిక్కారానికి తెరపడింది. గ్రామస్థులు భూములు ఇవ్వడానికి సంతకాలు చేశారు. పూర్తిగా స్వాధీన పరచడానికి వాగ్దానం చేశారని వామపక్షం చెపుతున్నది. విజయానికి తప్పక విజయోత్సవం జరుపుకుంటాం అంటున్నది.

తమను తాము వామపక్షీయులమని చెప్పుకునేవారు పార్టీ చర్యను ఖండించినప్పుడు ఏమి చేస్తారు? పార్టీకి వ్యతిరేకంగా వున్నవారెవరైనా వామపక్షీయులు అవుతారా? ఇదే ప్రశ్నను అటుతిప్పి అడగాలనుకుంటున్నాం. కమ్యూనిస్టునని చెప్పుకునే పార్టీ, పేరుతోనే కమ్యూనిస్టు అవుతుందా? సోషలిజం అంటే పేర్ల చీటీలు, మాటలూ, చిహ్నాలేనా? సింగూరు, నందిగ్రామ్‌లలో ముందస్తు సమాచారం, అంగీకారం లేకుండా వ్యవసాయ భూమిని సి.పి.ఐ (ఎం) బహుళజాతి కంపెనీలకు అప్పగించింది. సింగూరుకు సంబంధించిన దాని విచారణ పత్రాల్లో భూమి వ్యవసాయయోగ్యంకాదని అబద్ధాలు చెప్పింది. ప్రజల నుంచి ఒప్పంద పత్రాలు తీసుకున్నామని పార్టీ చెప్పుకుంటున్నది. భూమికి సంబంధించిన పత్రాలూ, ఒప్పంద పత్రాలూ హైకోర్టులో సవాలును ఎదుర్కొంటున్నాయి. ఆచరణలో టాటాలకు పెద్దయెత్తున లాభాన్ని చేకూర్చుతూ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పంద స్వభావాన్ని గురించిన వివరాల కోసం, సమాచార హక్కు చట్టం కింద వచ్చిన అభ్యర్థనలకు సమాధానం లేదు. శాంతియుతంగా జరుగుతున్న రైతుల ప్రతిఘటన మీద పోలీసులు, సి.పి.ఐ (ఎం) కార్యకర్తలు క్రూర నిర్బంధాన్ని అమలు చేశారు.

ఈ పరిస్థితి వారి ముందుండగానే, ఒక అమెరికా మార్కెట్ సర్వే కంపెనీ సలహామేరకు సలీం గ్రూపుకు 35 మౌజాల భూమి ఇవ్వనున్నట్లు అధికారిక ప్రకటన పంపటంతో నందిగ్రామ్ రైతులు మరింత భీతిల్లారు. స్థానిక పార్టీ సరైన సమాచారం ఇవ్వకపోవటంతో, గ్రామస్తులు (అందరూ సి.పి.ఎం మద్దతుదారులే) పోలీసులూ, పార్టీ కార్యకర్తల్ని బయటికి పంపించడానికి, తమ భూములూ, ప్రాణాల్ని కాపాడుకోవడానికి **నందిగ్రామ్ బ్లాక్ - 1ను** రక్షణ దుర్గంగా తయారు చేశారు.

ఇందుకు పార్టీ కాల్పులూ, హత్యలతో విరుచుకుపడింది. రైతులు కూడా ప్రతిఘటించగా ఒకరు మృతి చెందారు. సి.పి.ఎం ప్రతీకారదాడులకు పాల్పడుతుందని రైతుల్లో భయాలున్నాయి. అందువల్ల ప్రతిఘటించాలనే ప్రజలు దృఢంగా నిర్ణయించుకున్నారు. మార్చి 14 నాటి రక్తపాత సంఘటన అందరికీ తెలిసిందే. పెండింగ్ కేసులు కలకత్తా కోర్టులోనే మగ్గుతున్నాయి. సి.బి.ఐ విచారణలు కూడా రెండు రోజుల తర్వాత మూతబడ్డాయి. పార్టీ నాయకులెవరూ ఆ ప్రాంతానికి వచ్చి కన్నెత్తి చూడలేదు. చావుబతుకుల్లో వున్న బాధితులకు సాయంగానీ, నష్టపరిహారంగాని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదు. ఈ వాతావరణం, ప్రజలు వద్దంటే ఎస్.ఇ.జడ్ వుండదంటూ హామీ ఇచ్చిన బుద్ధదేవ్ మీద నమ్మకాన్ని కలిగించలేదు. పార్టీ నందిగ్రామ్‌లోకి ఒకసారి ప్రవేశించిందంటే, ఇక రైతులు ఎస్.ఇ.జడ్‌ను కోరుకుంటున్నారనే వాతావరణాన్ని వాళ్లు తయారుచేస్తారని గ్రామస్తులకు అర్థమైపోయింది.

మా విమర్శ విస్పష్టంగా ఎందుకు వుంది? సి.పి.ఐ (ఎం) వీరభక్తులు గ్రామస్తుల నుంచి దేన్ని వేరుచేయాలనుకుంటున్నారు? అని మేము అడుగుతున్నాము. కాశ్మీరీ శరణార్థుల గురించి ఇంతగా మీరెందుకు మాట్లాడరు? అని బి.జె.పి నిలదీసి లౌకికవాదుల్ని అడుగుతున్నది. బెదిరింపులన్నీ తప్పుపట్టదగినవికాగా, దౌర్జన్యానికి దిగిన పెద్ద పార్టీ యంత్రాంగం, ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగం తర్వాత జరిగే దానికి

బాధ్యతపడతాయనేదే సమాధానం. తిరుగుబాటు చేస్తున్న నందిగ్రామ్ రైతులకు పౌర సమాజంలోని సంస్థల నుంచి తప్ప, అక్కడ ఎటువంటి మద్దతూ, సహాయం లేదు.

అక్కడ ఇంకెలాంటి అసమయుద్ధం లేదని మేము కూడా నమ్ముతున్నాం. రాజ్యబీభత్సం లాంటి భయోత్పాతం లేదు. అందువల్ల భయోత్పానికి ఎవరుపాల్పడినా మద్దతు వుండదు. ఇదీ అక్కడ 30 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం తన ఉనికి కోసం దీని మీదనే ఆధారపడింది.

చిన్న రైతుల ఆర్థిక స్థితిని, పరిసరాలనూ బడా కార్పోరేట్ కంపెనీల ప్రయోజనం కోసం ధ్వంసం చేసే ఏ వామపక్ష వ్యూహాన్ని కూడా మేము ఒప్పుకోము. చట్టబద్ధ బూర్జువా రాజ్యాంగ ఆదర్శాలను కూడా ధ్వంసం చేసేసి, క్రూరమైన, నిర్దాక్షిణ్యమైన నయా-ఉదారవాద అధికారాన్ని అమలు చేస్తున్నారని మేము నమ్ముతున్నాం. నందిగ్రామ్‌ను ఇలాగే ఆక్రమించారు. కలకత్తా హైకోర్టు చెప్పినట్లు, రైతుల ఉద్యమాన్ని చట్టవ్యతిరేక పద్ధతుల్లో అణచివేశారు. ఈ క్రమంలో నిరసనకారుల పౌర, ప్రజాస్వామిక హక్కుల్ని కాలరాచివేశారు.

దారిద్ర్యంలో కునారిల్లుతున్న జిల్లాల్లో రేషన్ బియ్యం కోసం ఇటీవల జరిగిన గ్రామీణ తిరుగుబాట్లు, పార్టీ అవినీతికి-వ్యాపారానికి-హిందూ యువతిని పెండ్లాడిన ముస్లిం యువకుని చావును కళ్లజూసిన పోలీసు దుర్మార్గాలకు వ్యతిరేకంగా జరిగిన పట్టణ తిరుగుబాట్లూ ప్రజలకు దానిపట్ల గల అవిశ్వాసాన్ని తెలియజేస్తున్నాయి. నిర్బంధం ఏ స్థాయికి పోగలదనేది నందిగ్రామ్ ఉదాహరణగా కన్పిస్తుంది.

ఈరోజు బెంగాల్‌లో కమ్యూనిస్టునుగాని లేక సంక్షేమవాదినిగాని లేదా భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయగల కనీస ప్రజాస్వామిక హక్కునుగాని చూపించగలరా అని అన్ని పార్టీల సమర్థకులను సవాల్ చేస్తున్నాం. వామపక్ష పార్టీ అవలంబిస్తున్న విదేశీ విధానంపై కొన్ని వామపక్ష వ్యతిరేక వార్తా పత్రికల విమర్శ స్పష్టంగా లేనందున నిరసిస్తున్నాం. వామపక్షం చేస్తున్న వాటిని వేటినీ విమర్శించే హక్కు ఎవరికీ లేదా?

బెంగాల్‌లో లౌకిక - ప్రజాస్వామిక - నిజమైన సోషలిస్టు శక్తులు తమ భిన్నాభిప్రాయాన్ని వెల్లడించినందుకు, వారి గొప్ప చైతన్యానికి వందనం చేస్తున్నాం. ఈ రాజకీయ మధనానికి వేరుగా నిజమైన వామపక్ష రాజకీయాలు వెలికిరావచ్చు. బహుశా నైతికంగా దివాళాకోరుగా మారిన అధికార వామపక్షానికీ వేరుగా కావచ్చు.

సోనాచుర, తెఖాలి, మహేశ్‌పూర్ మార్గాలు, దక్షిణ కాళి - కాళిచరణ్‌పూర్ నుండి మహేశ్‌పూర్ వెళ్లే మార్గాలూ, గర్‌చక్ర బేరియా, మద్రకట-సరస్వతి బజార్‌కు వెళ్లే మార్గాలను దురాక్రమణ బలగాల దురాగతాలకు వ్యతిరేకంగా ప్రజా ఊరేగింపులకు ఎంపిక చేశారు. 12 వేలు, 6 వేలు, 15 వేల మంది ప్రజలు ఈ ఊరేగింపుల్లో పాల్గొన్నారు.

రెచ్చగొట్టటం లాంటిదేమీ లేకుండానే హఠాత్తుగా హర్మద్‌లు ఊరేగింపులపై కాల్పులు ప్రారంభించారు. సోనాచుర - తెఖాలి ఊరేగింపులో అనేక మంది ప్రజలు తూటాల దెబ్బలకు పడిపోయారు. ఒక సాధారణ అంచనా ప్రకారం సంఘటనా స్థలంలోనే వంద మంది చనిపోయారు. ఆరు వందల మందిని సి.పి.ఐ (ఎం) మనుషులు అరెస్టు చేసి, బలవంతంగా తమ నిర్బంధంలో వుంచుకున్నారు. తర్వాత పోలీసులు 350 మందిని కనుగొని, సి.పి.ఐ(ఎం) గూండాల పట్టు నుంచి విడిపించారు. కాగా, 150 మంది కన్పించకుండాపోయారు.

కిరాయి హంతక మూకలూ, వారి సోషల్ ఫాసిస్టు యజమానులకు ప్రజాస్వామిక హక్కులు గుర్తుకే రావు. మార్చి 14 మారణకాండ, నవంబర్ 10 మారణకాండలు ప్రజలకు పెద్ద పాఠాన్ని నేర్పాయి. కానీ అవి సోషల్ ఫాసిస్టుల క్రూరత్వం పట్ల ప్రజల కళ్లు తెరిపిస్తాయి.

## బుద్ధదేవ్ విషపుకోరలూ, మోగుతున్న తుపాకులు

ఒకపక్కన నందిగ్రామ్ పునరాక్రమణ చర్య జరుపుతూనే 2007 మార్చి 14న పోలీసు తూటాలకు బలైన వారి కుటుంబాలకు రెండు లక్షల రూపాయల నష్టపరిహారం అంటూ నవంబర్ 8న బుద్ధదేవ్ ప్రభుత్వం ప్రకటించడం కూడా క్రూరమైన పరిహాసం. అనేక మాసాల తర్వాత మీడియా ముందు తన దయార్ద్ర హృదయాన్ని ప్రకటించుకునే సి.పి.ఐ (ఎం) మోసపుటెత్తుగడ ఇది!

# పి.ఎల్.జి.ఎ సంస్థాపక దినం వర్థిల్లాలి !

సాకేత్‌సుంద్రియా నవంబర్ 9న స్టేట్స్‌మన్ పత్రికలో ఎస్.ఇ.జడ్ కోసం నందిగ్రామ్‌లో సి.పి.ఐ(ఎం) 'తుపాకీ గొట్టాన్ని' ఎలా వుపయోగిస్తోందనేది రాశాడు.

నందిగ్రామ్ సంఘర్షణ సి.పి.ఐ (ఎం) నాయకులకు ఎంత విలువైనది, పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయమనేది సతెంగబరి, రాణిచౌక్ వంటి చోట్ల తేటతెల్లంగా కన్పించింది. ఈ గ్రామాల్ని కూడా ఘర్షణలోకి లాగారు. జనవరిలో సమస్య మొదలైనప్పుడు ప్రతిపాదిత ఎస్.ఇ.జడ్ కోసం భూసేకరణ బాధితులుగా తెఖాలి బ్రిడ్జికి ఎడమ వైపునున్న గ్రామాలే గట్టిగా ప్రతిఘటించాయి. బ్రిడ్జికి కుడివైపు వున్న గ్రామాల్లో ఎలాంటి ఆందోళనలూ లేవు. ఇప్పుడు తెఖాలి బ్రిడ్జికి కుడి వైపున సతెంగబరి, రాణిచౌక్‌లకు 7 కి.మీ దూరంలో వున్న గ్రామాల్లో కూడా తల్పతికాలువ అవతల పక్కన జరుగుతున్న పోరాటాల వేడి సోకింది. ఇటీవల అక్టోబర్ 30న సి.పి.ఐ (ఎం) గూండాలు రెండు గ్రామాల మీద దాడి చేసి, అక్కడ నివసించే ప్రజల్ని వెళ్లగొట్టి, ఇండ్లు లూటీ చేసి, తగులబెట్టారు.

"యుద్ధ క్షేత్రం"లోని గుండెకాయలాంటి గ్రామాలకు ప్రధాన మార్గాల్లో ప్రవేశించడంలో విఫలమైనప్పుడు, ప్రతిఘటన ఎదురైన తర్వాత, సమస్యాత్మక ప్రాంతంలోకి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రవేశించడానికి ప్రయత్నించారు. "ముందుకు చొచ్చుకుపోవటం" భయపెట్టటంలో ఎటువంటి వ్యతిరేకత ఎదురైనా సహించలేకపోయారు. ఒకవేళ ఇది పని చేయకపోతే, లొంగని గ్రామాలను పట్టుకోవడానికి, వ్యూహంలో ధ్వంస రచన కూడా వుండనే వుంది. కాని వాళ్లు తుపాకులతో పోరాటానికి సిద్ధంగా వున్న గ్రామస్థుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ విధంగా "యుద్ధం" వ్యాపించింది.

ఇదీ ఎస్.ఇ.జడ్ రూపంలోని రసాయన పరిశ్రమ (కెమికల్ హబ్) స్థాపన కోసం మూర్ఖ సి.పి.ఐ(ఎం) అవలంభించిన బందిపోటు తత్వానికి సంబంధించీ, ఎస్.ఇ.జడ్ వల్ల ప్రత్యక్షంగా నష్టానికి గురికాని వారితో సహా, పెద్దయెత్తున పెల్లుబికిన ప్రజల ప్రతిఘటనకూ సంబంధించిన స్పష్టమైన వివరణ. ప్రతిఘటన అంతటా వ్యాపించింది. ఆవిధంగా నందిగ్రామ్‌ను పునరాక్రమించిన తర్వాత నవంబర్ 13న భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ కమిటీ (బి.యు.పి.సి) తాత్కాలిక ఓటమిని ఎత్తి చూపుతూ, ఫాసిస్టు బుద్ధదేవ్ అహంకారంతో "వాళ్ల నాణేలతోనే వాళ్లు తగిన మూల్యాన్ని చెల్లించారు", "మా పార్టీ మనుషులు తెగించి స్వస్థలాలకు వెళతారు. ఇకమీద వాళ్ల శక్తిని వుపయోగిస్తారు" (టెలిగ్రాఫ్ 13.11.07) అంటూ తన సంతోషాన్ని వెల్లడించాడు.

**ముగింపు**

రైతాంగం ఇంకా ఇప్పటికీ తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చుతూ, ప్రతిఘటిస్తున్నది. నందిగ్రామ్ రైతులు పోలీసులా, సి.పి.ఐ(ఎం) గూండామూకల తూటాలకు బలయ్యారు. వందలాది మంది క్రూరంగా చిత్రహింసలకు గురయ్యారు. కానీ నందిగ్రామ్ అవిశ్రాంత ప్రతిఘటనా శక్తికి సంబంధించిన వీరగాథగా చరిత్రలో లిఖితమైంది. నందిగ్రామ్ ప్రతిఘటన మొత్తంగా, దేశంలో ప్రజావ్యతిరేక 'అభివృద్ధి' నమూనా కోసం కొనసాగుతున్న ప్రజల్ని నిర్వాసితుల్ని చేయటానికీ, భూసేకరణకూ వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రతిఘటనకు ప్రకాశించే స్ఫూర్తి. ఈ సందేశాన్ని బెంగాల్‌లోని సి.పి.ఐ (ఎం) భూబకాసురులూ, ఇతర రాష్ట్రాల్లోని భూబకాసురులూ, యు.పి.ఎ పాలనా బిగ్గరగా, స్పష్టంగా అందుకున్నారు.

★

## కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలకోసం నందిగ్రామ్ పునరాక్రమణ క్యాంపెయిన్

స్వదేశీ, విదేశీ కార్పోరేట్ సంస్థల ఆదేశాలతో ఎస్.ఇ.జడ్‌లు, ఇంకా వివిధ ప్రాజెక్టుల కోసం సి.పి.ఐ (ఎం) భూసేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. వివిధ ప్రాంతాల్లో, ముఖ్యంగా నందిగ్రామ్‌లో రైతుల తిరుగుబాటు తర్వాత ఇది మరింత దూకుడుమీద వున్నట్లు కన్పిస్తున్నది. 2007 అక్టోబర్ 29న 24 పరగణాల జిల్లాలో జరిగిన ఒక ఊరేగింపులో దాడి పూర్వకంగా బుద్ధదేవ్ భట్టాచార్య మాట్లాడిన మాటలు నందిగ్రామ్‌పై కుట్ర పథకాన్ని బహిర్గత పరుస్తున్నాయి. "దీన్ని జరగనివ్వం, రాష్ట్ర భవిష్యత్తు కోసం పారిశ్రామికీకరణను ముందుకు తీసుకుపోతాం" [టెలిగ్రాఫ్ 2007 అక్టోబర్ 30] అంటూ మాట్లాడాడు. అదే రోజు ఐ.టి దిగ్గజం ఇన్ఫోసిస్ కంపెనీ అత్యున్నతాధికారి మన్మోహన్ పాయ్ నందిగ్రామ్‌ను పునరాక్రమించటంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై తన బాధను వ్యక్తం చేశాడు. "నందిగ్రామ్ విషయం బెంగుళూరుకు కూడా చేరింది. అది పెట్టుబడులు పెట్టేవాళ్లలో అపార్థాలూ, భయాలను సృష్టించింది" అని స్పష్టంగా అన్నాడు. "ప్రభుత్వ నత్తనడక పనితీరు దీర్ఘకాలంలో రాష్ట్రాన్ని మరింత చెడగొడుతుంది. [అదే పత్రికలో] అని కూడా అన్నాడు. సత్వరంగా భయాల్ని తొలగించి, శాంతింపజేయడానికి పరిశ్రమల మంత్రి నిరుపమ్‌సేన్ వెంటనే ప్రకటన చేశాడు. అందులో "భూమి గల స్వంతదారుల్ని కలిసి, వారికి మంచి భవిష్యత్తును కల్పిస్తామని ధైర్యం కల్పించడానికి సంబంధించిన సంప్రదింపుల వల్ల, భూసేకరణ ఆలస్యమైంది" అని చెప్పాడు [అదే పత్రికలో]. ఐ.టి.సి, మరికొన్ని కార్పోరేట్ సంస్థలూ అసహనానికి గురయ్యాయి. సి.పి.ఐ

(ఎం) ప్రభుత్వం కొనసాగిస్తున్న భూసేకరణ కార్యక్రమం నత్తనడకన సాగుతున్నదని కొంత మందిలో వచ్చిన "అపార్థం" గురించి వాళ్లు మరీ హైరానా పడిపోతున్నారు. 'వామపక్ష' పాలిత పశ్చిమబెంగాల్‌లో అందరికంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టిన అమెరికా వ్యాపార మదుపరులు చాలా హైరానా పడిపోతూ, రైతుల ప్రతిఘటన 'సమస్య'ను అణచివేసే క్రూరమైన పథకాలన్నింటినీ అమలుచేయమని సలహాలిచ్చారు. హెన్రీ కిసింజర్, అమెరికా కార్పొరేట్ ప్రతినిధులూ నందిగ్రామ్ చివరి మారణకాండకు కొద్ది కాలం ముందుగా బుద్ధదేవ్ అతిధులుగా మారారు. అక్టోబర్‌లో అమెరికా కోశాగార కార్యదర్శి హెన్రీపాల్‌సన్ కలకత్తాకు వచ్చి, బుద్ధదేవ్ భట్టాచార్జీ "గొప్ప సంస్కర్త" అని వర్ణించాడు. [టైమ్స్ ఆఫ్ ఇండియా, 2007 నవంబర్ 9]. నాయకత్వ స్థానంలో వున్న వాణిజ్య సంఘాలన్నీ, సి.పి.ఐ (ఎం) పారిశ్రామిక విధానానికి గట్టి మద్దతునిచ్చాయి. సి.పి.ఐ మాజీ అధ్యక్షుడు సంజీవ్ గోయెంకా సమస్య మీద బెదిరింపు కూడా చేశాడు. "పెట్టుబడి వాతావరణానికి హాని చేసే ఎటువంటి చర్యనూ మేము ఒప్పుకోము అన్నాడు. "పారిశ్రామిక విధానం మీద ప్రభుత్వ నిర్ణయం మెచ్చుకోదగినది. ఈ అంశం మీద ముఖ్యమంత్రిని నేను పూర్తిగా సమర్ధిస్తున్నాను" అని కూడా అన్నాడు. [టైమ్స్ ఆఫ్ ఇండియా, 8.12.06].

మార్చి 14 నందిగ్రామ్ మారణకాండ తర్వాత, అమెరికా కార్పొరేట్ సంస్థలు బెంగాల్‌లోని సి.పి.ఐ (ఎం) ప్రభుత్వం మీద తమ పూర్తి నమ్మకాన్ని వెలిబుచ్చాయి. అమెరికా వాణిజ్య ఉప కౌన్సిలర్ డేల్ తషార్స్కి, 2007 ఏప్రిల్ 25న జరిగిన భారత వాణిజ్య మండలి సమావేశంలో మాట్లాడుతూ "ఈ సంవత్సరం ప్రారంభంలో వాణిజ్య ప్రతినిధి సుసాన్ ష్వాబ్ భారత పర్యటన విజయవంతమైన తర్వాత, అమెరికాలో ఆసక్తి (బెంగాల్ మీద) పెరిగింది" అన్నాడు. [ది టెలిగ్రాఫ్, 26.04.07]. ఇక ప్రపంచబ్యాంకు కూడా ప్రత్యక్షంగా ఇందులోకి ప్రవేశించింది. దాని ఆగ్నేయాసియా అత్యున్నత కార్యనిర్వహణాధికారి సాదిక్ అహ్మద్ 2007 ఏప్రిల్ మొదటి వారంలో బుద్ధదేవ్‌నూ, అతని ఆర్థికమంత్రి అసిమ్ దాస్‌గుప్తాను కలిసి "సంస్కరణలు" బాగున్నాయని సంతృప్తి వ్యక్తపరిచి, ఆర్థిక రంగంలోని మూడు ప్రాంతాలకు 'సహాయం' ప్రకటించాడు.

సి.పి.ఎం హంతకులు నందిగ్రామ్‌పై యుద్ధాన్ని ప్రకటించిన నవంబర్ 8వ తేదీన, రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ కార్యదర్శి సవ్యసాచిసేన్, 2008లో ముఖ్యమంత్రి బుద్ధదేవ్ జరపబోయే అమెరికా పర్యటన గురించి ప్రకటించాడు. "ప్రపంచంలో ఎఫ్.డి.ఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి)కి అమెరికా అత్యంత పెద్ద వనరు. ఈ అవకాశాన్ని మేము చేజిక్కించుకుంటాము" అని సేన్ అన్నాడు. భారత-అమెరికా వాణిజ్య మండలి సాధారణ వార్షిక సమ్మేళనంలో సేన్ మాట్లాడుతూ "ప్రభుత్వాధికారులతో, ఫైనాన్స్ సంస్థల (బ్యాంకులు)తో, శక్తివంతమైన మదుపరులతో సమావేశం ఏర్పాటు చేయడానికి, అమెరికా వాణిజ్య దౌత్య కార్యాలయం నుండీ, విదేశాల్లో నివసించే భారతీయ వ్యాపారుల నుండి సహాయం కోసం ప్రయత్నిస్తాము" అన్నాడు. [టైమ్స్ ఆఫ్ ఇండియా, 2007, నవంబర్ 9].

నందిగ్రామ్ మారణకాండ అమెరికా, ఇతర పారిశ్రామిక దిగ్గజాల దీవెనలతో పకడ్బందీగా అమలు చేసిన పథకమనేది ఇప్పుడు పూర్తిగా స్పష్టం. 2008లో గరిష్ట సంఖ్యలో అమెరికా వాణిజ్య ప్రతినిధులు బెంగాల్‌ను సందర్శిస్తారని, అమెరికా అత్యున్నత వాణిజ్య దూత కాన్సులేట్ జనరల్ హెన్రీ జార్డ్‌లైన్ అన్నాడు. 2008 మార్చిలో, మరో అత్యున్నత ప్రతినిధి లాస్ ఏంజెల్స్ నుండి కలకత్తా నగరానికి రాబోతున్నాడు. [అదే పత్రికలో]. కోకోకోలా, పెప్సీకోలా, డోవ్ కెమికల్స్, మెక్‌డోనాల్డ్స్, ఐ.బి.ఎం, కాగ్నిజాంట్ మొదలైన అమెరికా కంపెనీలు బుద్ధదేవ్ చెప్పుకుంటున్న పారిశ్రామికీకరణ ప్రహసనంలో ఇప్పుడు అతని అభిమాన కంపెనీలు. సామ్రాజ్యవాద సంస్థల, యు.పి.ఎ ప్రభుత్వపు, ఇంకా భారతదేశంలోని ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక ప్రపంచీకరణ అనుకూల శక్తుల ఆశీస్సులతో, రెట్టించిన వుత్సాహంతో, విస్తారంగా డబ్బు, ఆయుధ, మందుగుండు సరఫరాలనందించి, ప్రజలను తమ భూముల నుంచి జీవనాధారం నుంచి వెళ్లగొట్టడానికి, నందిగ్రామ్ 'పునరాక్రమణ' జరిపించారు. పశ్చిమ బెంగాల్‌లో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టడానికి జపాన్ ప్రధానమంత్రి అబే ఆగస్టు 23న బెంగాల్‌కు వచ్చాడు. "సామాజిక ఇంజనీరింగ్ నిధి" కాక, బర్ధమాన్, హుగ్లీ జిల్లాలకు చెందిన బర్గాదర్‌కు నామమాత్రపు వడ్డీకి పదికోట్ల రూపాయలు రుణంగా అతడు ప్రకటించటం గమనించదగినది. "సింగూరు-నందిగ్రామ్ సంఘటనల నేపథ్యంలో", పశ్చిమ బెంగాల్ పారిశ్రామిక వాతావరణాన్ని పునరుద్ధరించడానికీ, నిరసనల్ని శాంతింపజేయడానికే ఈ రుణం అనేది స్పష్టమే. [ఆనందబజార్ పత్రిక, 23.07.07]. భారతదేశంలోని పరిశ్రమాధిపతులందరూ సింగూరు, నందిగ్రాం ఇంకా పశ్చిమ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాల్లో తమ పని సజావుగా నడిపించటంలో బుద్ధదేవ్‌ను సి.ఎం నంబర్ వన్‌గా, తమ మనిషిగా పరిగణిస్తున్నారంటే ఆశ్చర్యమేమీ లేదు.

**దేశవ్యాప్తంగా సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేద్దాం!**

# ఆరిపోని ఆశయ జ్వాల కామ్రేడ్ భగత్‌సింగ్

**ఇంక్విలాబ్ జిందాబాద్** - దేశ రక్త నాళాల్లో ఈ నినాదాన్ని ప్రవహింపచేసిన కామ్రేడ్ భగత్‌సింగ్‌కు వందేళ్ళు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో విస్ఫోటనమై దద్దరిల్లిన భగత్‌సింగ్‌కు వందేళ్ళు. దేశ భవితకొరకు తన నవ యవ్వనాన్ని ఫణంగా పెట్టిన భగత్‌సింగ్‌కు వందేళ్ళు. ఈ సందర్భంగా కామ్రేడ్ భగత్‌సింగ్‌ను స్మరించుకుందాం. అతను నెలకొల్పిన ఆదర్శాలను ఎత్తిపడుదాం.



షహీద్ భగత్‌సింగ్‌ది1907 సెప్టెంబర్ 28వ తేదీన పంజాబ్ రాష్ట్రంలోని సంగ్రూం జిల్లా ఖోఖర్‌కలాన్ గ్రామం. అతని తల్లిదండ్రులు విద్యావతి, కిషన్‌సింగ్‌లు. వారిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. భగత్‌సింగ్ పుట్టేనాటికి తండ్రీ, బాబాయిలూ జైల్లోనే వుండినారు. అటువంటి కుటుంబంలో పుట్టిన కారణంగా సహజంగానే భగత్‌సింగ్‌పై చిన్న తనంలోనే స్వాతంత్ర్య సమర ప్రభావం పడింది. ఆ ప్రభావం వల్లనే అతడిలో ఎంతో చిన్న తనంలోనే బ్రిటిష్ వ్యతిరేకత, స్వాతంత్ర్య కాంక్ష మొలకెత్తింది. మొలకెత్తడమే కాదు చాలా చిన్నతనంలోనే తన స్వాతంత్ర్య భావన స్పష్టమైన పరిణితిని పొందిందనడానికి ఎన్నో వుదాహరణలను చరిత్రకారులు చెప్తారు.

జలియన్‌వాలాబాగ్ దమనకాండ జరిగినప్పుడు భగత్ పన్నెండేళ్ళ వయసులో ఉన్నాడు. ఆ దమనకాండ గురించి విని అతడు ఎవరికీ చెప్పకుండా జలియన్‌వాలాబాగ్ వెళ్ళి నెత్తుటితో తడిసిన అక్కడి మట్టిని తీసుకువచ్చి ఒక పాత్రలో వుంచి పూజ చేశాడట. 'నా సోదరుల మరణానికి బ్రిటీష్ వారిపై ప్రతీకారం తీర్చుకుంటాన'ని ప్రతిజ్ఞ చేశాడట. భగత్‌సింగ్ తమ్ముడి కూతురు వీరేంద్రసింధు, భగత్‌సింగ్ జీవిత చరిత్రను రాసింది. ఆమె రాసిన దాన్నిబట్టి కూడా పుత్తేజపూరితమైన భగత్‌సింగ్ బాల్య చరిత్ర కొంత తెలుస్తోంది. సాధారణంగా బళ్ళో చదువుకునేప్పుడు పెద్దయ్యాక ఏం చేస్తావు అనే చర్చలు వస్తుంటాయి. పిల్లలు తమకు గొప్పగా అనిపించిన దాన్ని ఆదర్శంగా తీసుకొని పెద్దయ్యాక అదవుతాం, ఇదవుతాం అని చెప్తుంటారు. అలాగే భగత్‌సింగ్ నాలుగో తరగతిలో ఉన్నప్పుడు ఇలాంటి చర్చ వచ్చినప్పుడు, ఒకరు ఉద్యోగం చేస్తామనీ, ఒకరు వ్యాపారం చేస్తామనీ, ఒకరు పెళ్ళి చేసుకుంటామనీ చెప్తుంటే భగత్ మాత్రం 'పెళ్ళి చేస్కోవడం కూడా ఒక పనేనా! నేను చచ్చినా పెళ్ళి చేసుకోను, బ్రిటీష్ వారిని ఈ దేశం నుండి వెళ్లగొడతాను' అనేవాడట. ఆంగ్లేయులతో పోరాడుతున్నందుకుగాను భగత్‌సింగ్ బాబాయి ప్రవాసంలో ఉండేవాడు. ఆ సమయంలో భర్త కోసం ఏడుస్తున్న తన చిన్నమ్మను నాలుగేళ్ల భగత్ "బాధపడకు, బ్రిటీష్ వాళ్లను పారదోలి నేను బాబాయిని తీసుకువస్తాను'' అని ఓదార్చేవాడట. అతను ఎనిమిదేళ్ల వయసులో ఉన్నప్పుడు ఒకరోజు అతని చెల్లి ఒక మతగ్రంథంలోని పేజీని తెచ్చి అతనికి ఇచ్చిందట. దాన్ని పూర్తిగా చదివి 'తెల్లవాళ్లతో పాటు మతం కూడా మన దేశంలో పెద్ద గందరగోళం సృష్టించింది. అందువల్ల తెల్లవాళ్లతోపాటు మతాన్ని కూడా దుంపనాశనం చేయాలి' అని అంటూ ఆ కాగితాన్ని నేలకేసి కొట్టి దాన్ని కాళ్లతో చిదిమేశాడంట. ఇవన్నీ చదువుతుంటే అంత చిన్న వయసులోనే అతనిలోని అంత బలీయమైన స్వాతంత్ర్య కాంక్ష, పలు విషయాల్లో స్పష్టత అబ్బురంగా తోస్తుంది.

ఇంత చిన్న వయసులోనే స్పష్టమైన రాజకీయ వైఖరిని కల్గివున్న భగత్‌సింగ్ పదిహేనేళ్ల వయసులోనే చురుకైన ఆచరణకు దిగాడు. 1920లో ప్రారంభమైన సహాయనిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1922లో చౌరాచౌరీ ఘటన జరిగిన తర్వాత ఆ దాడిని తప్పుపడుతూ గాంధీ సహాయ నిరాకరణ వుద్యమాన్ని ఆపేశాడు. గాంధీ చర్య సరైంది కాదని భగత్‌సింగ్ భావించాడు. అయినప్పటికీ విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. అందులో భాగంగా అప్పటిదాకా తాను చదువుతున్న బ్రిటీష్ ప్రభుత్వ నిధులతో నడిచే పాఠశాలను బహిష్కరించి నేషనల్ స్కూల్లో చేరాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే అతనికి గాంధీ సిద్ధాంతాల పట్ల విశ్వాసం పోయింది. గాంధీ మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం రాదని గుర్తించాడు. అప్పుడప్పుడే దేశంలో మొలకెత్తుతున్న విప్లవ భావాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆ మార్గంలో నడవదలుచుకున్నాడు. దానితో బడిని వదిలేసి పూర్తికాలం స్వాతంత్ర్య సమరంలోకి దూకాడు. కాన్పూరుకు వెళ్ళి విప్లవకారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. వివిధ ప్రాంతాలు తిరిగాడు. పదిహేడేళ్ళ వయసులో లాహోర్ కేంద్రంగా పని చేస్తుండిన 'నవజవాన్ భారత్' విప్లవ సంస్థకు కార్యదర్శి అయ్యాడు. అప్పటికి ఈ సంస్థకు చెందిన పలువురు నేతలు ఉరిదీయబడ్డం వల్ల భగత్‌సింగ్ ఈ స్థానాన్ని చేపట్టవల్సి వచ్చింది.భగత్‌సింగ్ ఆచరణ, అతని కుటుంబ నేపథ్యం సంస్థకు అతని పట్ల విశ్వాసాన్నిచ్చింది.

కార్యదర్శి అయిన తర్వాత పంజాబ్ అంతటా విప్లవ జ్వాలల్ని వ్యాపింపజేశాడు. అలా బ్రిటీష్ గుండెల్లో ప్రకంపనలు సృష్టించాడు. దాంతో భగత్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని బ్రిటీష్ వాళ్లు కుట్రపన్నారు. తప్పుడు కేసు మోపి అతన్ని అరెస్ట్ చేశారు. కొద్ది కాలం తర్వాత అతడు జామీనుపై విడుదలయ్యాడు.

జైలు గోడలు అతనిలోని విప్లవదీక్షను ఏమాత్రం సడలించలేక పోయాయి. జైలు నుంచి వచ్చిన తర్వాత తన కార్యకలాపాలను మరింత ఉధృతం చేశాడు. దేశవ్యాప్త సంస్థ అయిన 'హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్'లో చురుకైన పాత్రను పోషించాడు. ఈ క్రమంలో అతనికి చంద్రశేఖర్ ఆజాద్, సుఖదేవ్, రాజగురు, భగవతీచరణ్ వంటి విప్లవవీరులు సన్నిహిత సహచరులయ్యారు.

ఈ క్రమంలో 'హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్' 1928లో 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్'గా మారింది. ఈ పేరును మార్చడంలో భగత్‌సింగ్ కీలకమైన పాత్ర వహించారు. దీనికి కారణం ఆనాటికి అతను మార్క్సిజం వైపు ఆకర్షితుడు కావడమే. ఆనాటి నుండి సోషలిజం స్థాపన ఈ సంస్థ లక్ష్యంగా మారింది. అంటే బ్రిటీష్ వాళ్లను తరిమేయడం మాత్రమే వారి లక్ష్యం కాదు. బ్రిటీష్ వాళ్లను తరిమేసిన తర్వాత దేశంలో సోషలిజాన్ని స్థాపించాలన్నది వారి లక్ష్యం.

దేశంలోని రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయడానికి బ్రిటీష్ ప్రభుత్వం సైమన్ కమీషన్‌ను నియమించింది. ఈ కమీషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'సైమన్ గో బ్యాక్' అనే ఆందోళన చెలరేగింది. అందులో భాగంగా 1928 అక్టోబర్‌లో కాంగ్రెస్ పార్టీలో అతివాదిగా పేరున్న లాలా లజపతిరాయ్ ఆధ్వర్యంలో సైమన్‌ను బయటకు రానీయకుండా రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన జరిగింది. ఆ ఆందోళనను అణచివేసే ఉద్దేశంతో స్కాట్ అనే పోలీసు అధికారి ఆదేశాలను అందుకున్న సాండర్స్ అనే పోలీస్ అధికారి, లాలా లజపతిరాయ్‌ను లాఠీతో విచక్షణా రహితంగా కొట్టడంతో అతను చనిపోయాడు. ఈ ఘటన దేశాన్ని మరింత ఉడుకెత్తించింది. యావత్ భారత ప్రజానీకం భగ్గుమని మండింది.

ఈ హత్యకు ప్రతీకారంగా భగత్‌సింగ్, రాజగురు, జయగోపాల్‌లు 1928 డిసెంబర్ 17వ తేదీన సాండర్స్‌ను చంపారు. అతన్ని చంపిన తర్వాత ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో "ఒక మనిషి యొక్క రక్తం చిందించినందుకు మా విచారాన్ని వ్యక్తం చేస్తున్నాం. ఇది విప్లవ వేదికపై ఒక బలి. దేశానికి ముక్తి, విముక్తి తీసుకురావాలంటే, ఒక మనిషి మరొక మనిషిని కొల్లగొట్టడం అసాధ్యం చేయాలంటే, ఈ బలి ఈ వైయక్తిక బలిదానం తప్పదు. విప్లవం వర్థిల్లాలి" అని తమ దృక్పథాన్ని వెల్లడించారు.

ఆ తర్వాత ఈ విప్లవవీరులు అసెంబ్లీ (ఈనాటి పార్లమెంటు వంటిది)లో బాంబులు వేయడం ద్వారా తమ రాజకీయాలను దేశవ్యాప్తంగా వ్యాపింప చేయాలనుకున్నారు. అదే సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం రెండు ప్రజావ్యతిరేక బిల్లులను తయారు చేసింది. వాటికి నామమాత్రంగా ఆమోదముద్రను పొందడం కోసం 1929 ఏప్రిల్ 8వ తేదీన ఆ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టదల్చుకుంది. దేశమంతా వ్యతిరేకిస్తున్న ఈ బిల్లులను ప్రవేశపెట్టే సందర్భాన్ని అసెంబ్లీలో బాంబులు వేయడం కోసం ఎన్నుకున్నారు. ఈ చర్యలో భగత్‌సింగ్ ప్రత్యక్షంగా పాల్గొనాలని నిర్ణయమైంది. పథకం ప్రకారం భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తు ప్రేక్షకుల స్థానాల్లో కూర్చొన్నారు. ఆ రోజున బిల్లులు ప్రవేశపెట్టగానే సభలోని భారతీయ ప్రతినిధులు వాటిని తోసిపుచ్చారు. అయినప్పటికీ ఆ బిల్లులు చట్టాలయిపోయినట్టుగా వైస్రాయి ప్రకటించాడు. వెంటనే భగత్‌సింగ్, దత్తులు బాంబులు విసిరి 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'సామ్రాజ్యవాద్ ముర్దాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత వారు తమ వద్దనున్న కరపత్రాలను అసెంబ్లీ నిండా వెదజల్లారు. ఆ కరపత్రం చివర్లో ఇలా వుంది - "ఈదేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని మేము భావిస్తున్నాం. అందరికీ సమానంగా సంపూర్ణమైన శాంతి, స్వాతంత్ర్యాలు లభించాలని ఆకాంక్షిస్తున్నాం. వాటిని సాధించడానికి ఇంతటి హింసాత్మకమైన చర్యలకు పూనుకోవలసి రావడం మమ్మల్నెంతగానో బాధిస్తోంది. ఒక మనిషిని మరో మనిషి పీడించే స్థితికి చరమగీతం పాడాలంటే అది విప్లవం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఎంతో కొంత రక్తం చిందకుండా దాన్ని సాధించడం సాధ్యం కాదు."బాంబులు వేసిన తర్వాత తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ వాళ్లు తప్పించుకోలేదు. ఎందుకంటే తాము ఎందుకు బాంబులు వేసినది తామే బహిరంగంగా ప్రకటించుకోవాలనుకున్నారు కనుక. అరెస్ట్ అయితే తమను ఉరి తీస్తారేమోనని వాళ్లు ఊహించారు. అయినప్పటికీ తమ రాజకీయాలను వ్యాపింపజేయడం కోసం వారు ప్రాణాలను ఫణంగా పెట్టదల్చుకునే అరెస్ట్ అయ్యారు.

బ్రిటీష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వంగా; బ్రిటీష్ 'న్యాయస్థానాలను' న్యాయస్థానాలుగా భగత్‌సింగ్ తదితరులు ఏనాడూ గుర్తించలేదు. అందుకని బాంబులు వేసిన కేసులో వారు ఎటువంటి ప్రతివాదనలూ దాఖలు చేయలేదు. అయితే కోర్టులో కొన్ని ప్రకటనలు చేయడం ద్వారా వారు విప్లవ రాజకీయాలను విశేషంగా ప్రచారం చేశారు. వారిని కోర్టుకు తీసుకువచ్చినపుడు 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినాదాలు చేసేవారు. ఇంక్విలాబ్ అనే పదానికి అర్థం ఏంటని జడ్జి అడిగితే, దానికి భగత్‌సింగ్ తన సుదీర్ఘ వాఙ్మూలంలో "విప్లవం అంటే బాంబులూ, పిస్తోళ్ల సంస్కృతి కానే కాదు, అన్యాయం మీద ఆధారపడి వున్న వర్తమాన సామాజిక వ్యవస్థ మార్పు చెందాలన్నదే విప్లవం వల్ల మేం ఆశిస్తున్నది" అన్నాడు. అలాగే "స్వాతంత్ర్యానికి అర్థం తెల్లవారి చేతుల్లోని అధికారం నల్లవాళ్ల చేతుల్లోకి మారడం కాదు. అప్పుడది అధికార మార్పిడి అవుతుంది. సిసలైన స్వాతంత్ర్యం-తిండిగింజల్ని పండించే రైతు ఆకలితో అలమటిస్తూ నిద్రపోనప్పుడు, చేనేత

కార్మికుడి ఒంటిమీద నూలు పోగు లేకుండా నగ్నంగా ఉండనప్పుడు, తాపీ మేస్త్రీ కొంపాగోడు లేకుండా ఉండనప్పుడు వచ్చినట్టు'' అని చెప్పాడు. స్వాతంత్ర్యం గురించి భగత్‌సింగ్‌కున్న మార్క్సిస్టు అవగాహన తెలుస్తుందీ ప్రకటన ద్వారా.

ఈ కేసులో భగత్‌సింగ్, దత్తులకు యావజ్జీవ కారాగార శిక్ష వేసి అండమాన్‌కు పంపాలని కోర్టు నిర్ణయించింది. కానీ ఆ తర్వాత, గతంలో జరిగిన కాకోరీ దోపిడీ కేసుతో సుఖదేవ్‌తో పాటు వీరికి సంబంధం వుందని నేరారోపణ చేశారు. భగత్‌సింగ్ ఆ ఆరోపణ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా, తన సహజ ధోరణిలో విప్లవ జ్వాలలను రేకెత్తిస్తూ మాట్లాడాడు. దానితో వారిని సుఖదేవ్‌తో పాటు జైల్లో పెట్టారు. బ్రిటీష్ ప్రభుత్వం నామమాత్రపు విచారణ తంతును చేపట్టి భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులకు ఉరిశిక్షను విధించింది.

జైల్లో వున్న సమయంలో భగత్‌సింగ్ విస్తృతమైన అధ్యయనం చేశాడు. మార్క్స్, ఎంగెల్స్, గోర్కీ తదితరుల రచనలను అధ్యయనం చేశాడు.అంతేకాదు రచనా వ్యాసంగాన్ని కూడా కొనసాగించాడు. వురిశిక్షకు కొద్ది కాలం ముందే అతడు ఆంగ్లంలో రాసిన 'నేనెందుకు నిరీశ్వర వాదిని' అనే వ్యాసాన్ని ' పీపుల్ ' వారపత్రిక ప్రచురించింది. ఇదొక ఉత్తేజకరమైన రచన. తన అనుభవాలు, తను చదివిన పుస్తకాల మీద అభిప్రాయాలను డైరీల్లో పొందుపరిచాడు. ఇవికాక నాలుగు పుస్తకాలు రాశాడనీ, అవి లభించడం లేదని చరిత్రకారులు చెబుతున్నారు.

జైల్లో వుంటూ కూడా పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఖైదీలందరికీ కనీసవసతులు కల్పించాలనే డిమాండ్‌తో భగత్‌సింగ్ తదితరులు 63 రోజులు నిరాహారదీక్ష చేశారు.

'మేరా రంగ్‌దే బసంతీ' అనే పాట భగత్‌సింగ్‌కు ఎంతో ఇష్టమైన పాట. జైల్లో వున్నప్పుడు తను తరచూ ఈ పాట పాడుతుంటే జైలు వార్డర్లు కూడా ముగ్ధులై వినేవారు.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులకు విధించిన ఉరిశిక్షను దేశమంతా గర్హించింది. ఉరిని రద్దు చేయాలని కోరుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి పది లక్షల టెలిగ్రాంలు వెళ్లాయి. ఈ టెలిగ్రాంలు పంపిన వారిలో బ్రిటన్ పార్లమెంట్ సభ్యులు కూడా వున్నారు.

ఇక్కడ గాంధీ దుర్మార్గం గురించి తప్పక చెప్పుకోవాలి. భగత్‌సింగ్ తదితరులను 1931 మార్చి 24న ఉరితీయాలని కోరు నిర్ణయించింది. దానికంటే కొద్ది రోజుల ముందు ఒక ఒప్పందం విషయమై గాంధీకీ, బ్రిటీష్ వైశ్రాయి ఇర్విన్‌కూ నడుమ చర్చలు ప్రారంభమైనాయి. ఆ చర్చల్లో భగత్‌సింగ్ ఉరిశిక్షను జైలు శిక్షగా మార్చమనే డిమాండ్ చేయాలనీ, లేకుంటే ఒప్పందంపై సంతకం చేయవద్దని దేశ ప్రజలేకాక, కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కూడా గాంధీపై ఒత్తిడి చేసారు. సుభాష్ చంద్రబోస్ కూడా ఈ విషయంపై గాంధీపై వత్తిడి తెచ్చాడు. కానీ గాంధీ ప్రజల మనోభావాలను లెక్కచేయలేదు. ఇటువంటి డిమాండ్ ఏమీ లేకుండానే గాంధీ మార్చి 5న ఇర్విన్‌తో ఒప్పందంపై సంతకం పెట్టాడు.

. భగత్ తదితరుల విప్లవ పంథాను గాంధీ తీవ్రంగా వ్యతిరేకించాడు. అందుకే ఉరిశిక్షను వ్యతిరేకించలేదు. అయితే వురిశిక్ష ప్రభావం దేశంలో ఎంత తిరుగుబాటును రేకెత్తిస్తుందోనని భయపడ్డాడు. ఇర్విన్ తన జ్ఞాపకాలను 'ఫుల్‌నెస్ ఆఫ్ డేస్' అనే పుస్తకంగా రాశాడు. అందులో గాంధీతో జరిగిన చర్చలను ప్రస్తావిస్తూ "ఆ మనిషి(భగత్‌సింగ్)ని ఉరితీస్తే,జాతీయ అమరవీరుడు అవుతాడని, వాతావరణం మొత్తం దెబ్బతింటుందని గాంధీ అన్నాడు. నేను ఏదో ఒకటి చేయకపోతే కష్టమని, దాని ప్రభావం ఒప్పందంపై పడుతుందని గాంధీ భయపడ్డాడు'' అని రాశాడు.

అంతేకాదు మార్చి ఆఖరులో కరాచీలో కాంగ్రెస్ మహాసభలు వుండినాయి. ఆ సభల వరకూ ఉరిశిక్షను వాయిదా వేస్తానని ఇర్విన్ అన్నాడు. కానీ ఆ సభలకు ముందే ఉరిశిక్ష అమలు కావాలని గాంధీ కోరుకున్నాడు. ఎందుకంటే ఆ సభల్లో కూడా ఉరికి వ్యతిరేకంగా వత్తిడి రావచ్చని గాంధీ భయపడ్డాడు.

నిజానికి మొదటి నుండి సామ్రాజ్యవాదులకు తొత్తుగానే వ్యవహరించిన గాంధీ నుండి ఇంతకంటే భిన్నంగా ఆశించలేం. దేశవ్యాప్తంగా ఎంత నిరసన వచ్చినప్పటికీ ఈ విప్లవవీరులను వురితియ్యాలనే బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. అయితే వురితీసిన తర్వాత చోటు చేసుకోబోయే పరిణామాల గురించి భయపడింది. వురి తీసే రోజున జైలుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వస్తారనీ, వారి మృత దేహాలను చివరిసారి చూడ్డానికీ, అంతిమ యాత్రలో పాల్గొనడానికి ప్రజలు వెల్లువెత్తుతారని, ఆ సమయంలో ప్రజల్లో వుప్పొంగే ఆగ్రహావేశాలను అదుపు చేయలేమనీ, ప్రభుత్వం భయపడింది. అందుకే ఒక రోజు ముందునే అంటే 1931 మార్చి 23న భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను రహస్యంగా ఉరితీసింది. సట్లెజ్ నదీ తీరాన రహస్యంగా అంత్యక్రియలు కూడా చేయడానికి ప్రయత్నించింది. అయితే అప్పటికి విషయం తెల్సిన ప్రజలు వెల్లువలా సట్లెజ్ నదీ తీరానికి చేరుకున్నారు. వారు తమ ప్రియతమ అమరుల చితిమంటను మాత్రమే చూడగలిగారు.

ఉరితీసేనాటికి భగత్‌సింగ్ 23 ఏళ్ల నవయువకుడు. అతను పూర్తికాలపు కార్యాచరణ ప్రారంభించింది పదహారేళ్ల వయసులో. కేవలం ఏడేళ్ల కాలంలో, అదీ ఇంత చిన్న వయసులో దేశవ్యాప్తంగా విప్లవోత్తేజాన్ని రగిలించి చరిత్రను మలుపుతిప్పి ఎన్నటికీ చెరిగిపోని చరిత్రగా నిలిచిపోయాడు భగత్‌సింగ్. భారతదేశం అమితంగా

*(మిగతాది 49వ పేజీలో...)*

# పెట్టుబడి వికృత రూపమే ప్రేమోన్మాద దాడులు!

'ప్రేమ'- ఈ తరం అమ్మాయిల వెన్నులో వణుకు పుట్టిస్తోన్న పదం ఇది. అమ్మాయిల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్ల పరిగెత్తిస్తున్న పదం కూడా ఇది.

పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాజధాని నడిబొడ్డున అనూరాధపై యాసిడ్ దాడి జరిగితే మనమంతా అవాక్కైపోయాం. గుంటూరులో తరగతి గదిలో ప్రసన్న వరలక్ష్మి దారుణంగా బండకత్తికి బలైతే మనం గుండెలు బాదుకున్నాం.

ఇదే వరుసలో శ్రీలక్ష్మి, భార్గవి, వేముల పద్మ... తదితరులు బలైపోయారు.

ఈమధ్య కాలంలో ఒకడు ఒంగోలు జిల్లా నాగులపాలెంకు చెందిన ఇంటర్ చదువుతున్న దిల్‌షాద్‌ను కొట్టి చంపేశాడు. చిత్తూరు జిల్లా ధర్మాచెరువు దళిత వాడలో సువార్తిని అలియాస్ రూపి అనే ఇంటర్ చదువుతున్న అమ్మాయిని ఒకడు ఉరేసి చంపాడు. బి.ఫార్మసీ చదువుతున్న ఆయేషా మీరా తనుంటున్న హాస్టల్‌లోని బాత్రూంలో అత్యంత జుగుప్సాకరంగా శవమైంది. శ్రీకాకుళం జిల్లా అక్కుపల్లిలో కల్పన అనే డిగ్రీ విద్యార్థినిపై ఒకడు యాసిడ్‌తో దాడి చేశాడు. హైదరాబాద్ నగరంలో స్వాతి అనే అమ్మాయిని ఒకడు కత్తితో పొడిచి చంపబోయాడు. స్వాతి ఎలాగోలా తప్పించుకోగల్గింది. కానీ తీవ్ర గాయాలతో హాస్పిటల్ పాలయింది. స్వాతిపై అతను చేసిన మూడవ దాడి ఇది. హైదరాబాద్‌లో ఒకడు తనను తాను పెట్రోల్ పోసుకొని తగులబెట్టుకొని అవే మంటలతో ఐశ్వర్య అనే అమ్మాయిని కూడా చంపాలని చూశాడు. ఐశ్వర్య ఎలాగోలా ప్రాణాలతో బయటపడింది. అనంతపూర్ జిల్లా కిష్టిపాడు గ్రామంలో మహాలక్ష్మి అనే పదవ తరగతి చదువుతున్న అమ్మాయిని చంపాలనే ఉద్దేశంతో ఒకడామె నోట్లో పురుగుల మందు పోశాడు. అపస్మారక స్థితిలో ఆ అమ్మాయి ఆస్పత్రి పాలయింది. మెదక్ జిల్లా చెల్లెడ గ్రామంలో ఇంటర్ చదువుతున్న బాలికను ఒకడు ఉరేసి చంపబోయాడు.

దిల్‌షాద్‌ను ఎందుకు కొట్టి చంపాడు? సువార్తినిని ఎందుకు వురేసి చంపాడు? కల్పనపై యాసిడ్ ఎందుకు పోశాడు? ఆయేషా మీరా ఎందుకు శవమైంది? స్వాతి ఎందుకు కత్తిపోట్లకు గురైంది? ఐశ్వర్యను చంపాలని ఎందుకు చూశాడు? మహాలక్ష్మి నోట్లో పురుగుల మందు ఎందుకు పోశాడు?

అసలు పదేళ్ల క్రితం అనూరాధపై యాసిడ్ దాడి ఎందుకు జరిగింది? ప్రసన్న వరలక్ష్మి బండకత్తికి ఎందుకు బలైంది?

వీరిలో కొందరిని జీవచ్ఛవాలుగా చేసిందీ, కొందరిని జీవమే లేకుండా చేసిందీ ఒకే ఒక కారణం వల్ల. అది - ఈ అమ్మాయిలు తమ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకోవడం, తమ జీవితాల మీద తమకు నిర్ణయాధికారం ఉందని భావించడం.

పదేళ్ల క్రితం శ్రీనివాసరెడ్డి అనే వాడు అగ్రికల్చరల్ బి.ఎస్సీ విద్యార్థినైన అనూరాధను ప్రేమిస్తున్నానని అన్నాడు. అనూరాధ ఆ 'ప్రేమ'ను నిరాకరించింది. ఫలితం కాలేజీ బ్యూటీ అనూరాధ ముఖంపై శ్రీనివాస్‌రెడ్డి యాసిడ్ గుప్పించాడు. ఈ దాడిలో అనూరాధ ఒక్క ముఖ సౌందర్యాన్ని మాత్రమే కోల్పోలేదు. ఆమె కంటి చూపు, వినికిడి శక్తి బాగా దెబ్బతిన్నాయి. ఆమె ఒక మంచి శాస్త్రీయ నృత్య కళాకారిణి కూడా. ఆమె కళ, చదువు అన్నీ దెబ్బ తిన్నాయి. అలా శ్రీనివాస్ రెడ్డి 'ప్రేమ' అనూరాధకు జీవితాంతమూ వెంటాడే పీడకలగా దాపురించింది.

ఆ తర్వాత ఇంటర్ చదువుతున్న ప్రసన్న వరలక్ష్మి కూడా అదే చేసింది. సుభానీ అనే కారు డ్రైవర్ 'ప్రేమ'ను నిరాకరించింది. ఫలితంగా ఆ 'ప్రేమ' మృత్యువై ప్రసన్నను కబళించింది. ప్రసన్న తల్లిదండ్రులకు ఒక్కగానొక్క బిడ్డ. ఎన్ని ఆశలను అల్లుకున్నారో ఆమె చుట్టూ. ఇప్పుడు బతికుంటే పాతికేళ్ల యువతిగా తల్లిదండ్రుల కంటి వెలుగుగా ఉండి వుండేది. కానీ ఆ 'వెలుగు' చీకటి గర్భంలో కలిసిపోయి అప్పుడే తొమ్మిదేండ్లు కావొస్తుంది.

అనూరాధ, ప్రసన్నల విషాదగాథలు మళ్లీ మళ్లీ పునరావృతం అవుతున్నాయి. శ్రీనివాస్ రెడ్డి, సుభానీలు మళ్లీ మళ్లీ పడగవిప్పి కాటేస్తూనే వున్నారు. ఇక్కడ పాత్రలు మారి పోతున్నాయి. అనూరాధ, ప్రసన్నల స్థానాల్లోకి నేడు దిల్‌షాద్, సువార్తిని, ఐశ్వర్య, కల్పన, మహాలక్ష్మి, స్వాతి... ఇంకా మరెందరో బలవంతంగా ఈడ్చబడుతున్నారు. శ్రీనివాస్‌రెడ్డి, సుభానీల స్థానాలను ఆంజనేయులు, నేతాజీ, ప్రభాకర్ ఇంకా మరెందరో ఆక్రమించడానికి పోటీ పడుతున్నారు. కానీ అదే గాథ, అత్యంత విషాద గాథ, హృదయ విదారకమైన గాథ, మనసుల్ని కలిచివేసే గాథ, మెదడు స్పందనలను బండబారుస్తున్న గాథ.

పదేళ్ల క్రితం శ్రీనివాస్ రెడ్డి అత్యంత క్రూరంగా, మన వళ్లు జలదరించేలా చెప్పిన మాట, "నా ప్రేమను నిరాకరించినందుకు..." అనే మాట, నాటి నుండీ నేటికీ అమ్మాయిల పాలిట మరణ శాసనమే అయింది. ప్రేమోన్మాదుల నోట 'వేదవాక్కే' అయింది.

'ప్రేమ'ను నిరాకరించినందుకు అమ్మాయిలపైనే కాక వారి కుటుంబ సభ్యులపైనా దాడులు చేస్తున్న సంఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ పట్టణంలో సుజని

అనే ఇంజనీర్, ఒక లారీ డ్రైవర్ 'ప్రేమ'ను నిరాకరించినందుకు, ఆ లారీ డ్రైవర్ సుజని కుటుంబ సభ్యులు నల్గురిపై దారుణంగా యాసిడ్ పోశాడు.

'ప్రేమ' వేధింపుకు పరాకాష్ఠగా ఈ ప్రేమోన్మాదులు చేస్తున్న దాడులూ, హత్యలకూ తోడు, ఈ వేధింపును భరించలేక అమ్మాయిలే ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలూ జరుగుతున్నాయి.

క్రిష్ణా జిల్లా పసుమొట్ల పాలెం గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే అమ్మాయి సత్యనారాయణ అనే ఉన్మాది వేధింపును భరించలేక వంటికి నిప్పంటించుకుంది. ఎనభై శాతం గాయాలతో కొన ఊపిరితో ఆస్పత్రి పాలయింది. అంతకు ముందొకసారి ఈ అమ్మాయి ఇదే సత్యనారాయణ వేధింపు భరించలేక పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు సకాలంలో గమనించడంతో ఆనాడు ఆమె చావు నుండి బయట పడింది. మరణం అంచుల వరకూ వెళ్లి తిరిగి వచ్చినప్పటికీ మళ్లీ చచ్చిపోవాలనే నిర్ణయించుకుందంటే ఆమె ఎదుర్కొన్న వేధింపు తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఇక ఈ హత్యలూ, దాడులూ, ఆత్మహత్యలు ఇలా కొనసాగుతుండగా అనంతపూర్ జిల్లా గుంతకల్లులో బి.ఈడి చదువుతున్న రాజేశ్వరి అనే అమ్మాయి పరీక్ష రాస్తుండగా వెంకటరమణ అనేవాడు వచ్చి ఆమెకు బలవంతంగా తాళి కట్టే ప్రయత్నం చేశాడు. ఇక్కడ రాజేశ్వరి, వెంకటరమణ పరస్పరం ఇష్టపడ్డారట. అయితే తన తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో రాజేశ్వరి, వెంకటరమణకు దూరంగా ఉండదల్చుకుంది. ఆమెకు ఆ నిర్ణయం తీసుకునే హక్కుందని గుర్తించని వెంకటరమణ ఆమె అభీష్టానికి విరుద్ధంగా ఆమె జీవితాన్ని శాసించబోయాడు.

నేడు పరిస్థితి ఎలా దాపురించిందంటే ఒక అమ్మాయికి ఎవరైనా 'నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్తే, ఆ అమ్మాయికి కూడా అతడి మీద అటువంటి ఉద్దేశమే వుంటే అది వేరే సంగతి. కానీ ఆ అమ్మాయికి అతడిపై ఏ ఉద్దేశం లేకుంటే, అతడిది ఏకపక్ష 'ప్రేమ' అయితే, ఇక ఆ అమ్మాయి పరిస్థితి అభద్రతలో పడ్డట్టే.

ఈ పరిస్థితి అమ్మాయిల కుటుంబాల్లోనూ తీవ్ర అభద్రతను కల్పిస్తుంది అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అమ్మాయిల మీద కుటుంబ ఆంక్షలు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితి వల్ల ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని జంటనగరాల్లో 40 శాతం అమ్మాయిలకు డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగానే పెళ్లిళ్లు చేస్తున్నట్టు ఒక సర్వే చెప్తోంది. ఇప్పుడిప్పుడే కాస్తో కూస్తో అవకాశాలున్న కుటుంబాల్లోనైనా పెరుగుతున్న అమ్మాయిల చదువులకు ఈ పరిస్థితి తీవ్రమైన ఆటంకంగా మారుతుంది. అమ్మాయిల కదలికల మీద, వేషధారణ మీద కూడా ఆందోళన కలిగించేంతగా ఆంక్షలు పెరిగే అవకాశం వుంది. తరతరాలుగా మహిళలు పోరాడుతూ సాధించుకున్న కొన్ని హక్కులను ఈ సమస్య హరిస్తోంది. మొత్తంగా అమ్మాయిలు తమకున్న నామమాత్రమైన సామాజిక స్వేచ్ఛను కూడా కోల్పోయే పరిస్థితిలో పడ్డారని చెప్పవచ్చు.

ఒకప్పుడు ప్రేమ (ఇక్కడ ప్రేమ అంటే స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే పరస్పర ఇష్టం అనే అర్థం మాత్రమే) అమ్మాయిలకు వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకునే అవకాశాన్ని ఇచ్చింది. బలవంతపు పెళ్లిళ్ల నుండి రక్షించింది. కుల, మత, వరకట్నాలతో ముడిపడి వున్న వివాహ వ్యవస్థను ఎదిరించే శక్తిని ఇచ్చింది. ఏకపక్షపు ప్రేమ కూడా ప్రజాస్వామ్యయుతంగానే వుండింది. అమ్మాయిల ముందు అది ఒక ఎంచుకునే వెసులుబాటును ఉంచింది. ఈ సాంప్రదాయాలను ఎదిరిద్దామా అని అడిగింది. కానీ నేడు అదే ప్రేమ అమ్మాయిల వ్యక్తిత్వాన్ని సహించలేకపోతోంది.

ఎందుకు? ప్రేమ మారిందా?

కాదు! ప్రేమ పట్ల సమాజపు దృక్పథం మారింది.

జీవితంలో కొన్ని విలువలను పాదుకొల్పే అంశంగా, పాత విలువలతో పోరాడే శక్తిగా, జీవితాన్ని సారవంతం చేసే ఒక విలువగా ఇప్పుడెవరూ ప్రేమను చూడ్డం లేదు. ఇక్కడే పెట్టుబడిదారీ లాభాపేక్ష గురించి చెప్పుకోవాలి. పెట్టుబడిదారి విధానంలో లాభాపేక్ష సరుకుల ఉత్పత్తికి ధ్యేయంగా వుంటుంది. సమాజ అవసరాల కోసం కాకుండా కేవలం లాభాలు గడించడానికి సరుకులను ఉత్పత్తి చేస్తుంది. అందుకే సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఇబ్బడి ముబ్బడిగా సరుకులను తయారు చేస్తుంది. ఆ సరుకులను అమ్ముకోవడానికి అది అవసరాలను సృష్టిస్తుంది. ఆ 'అవసరాలను' తీర్చుకునేలా మనుషులను ప్రేరేపిస్తుంది. వినిమయ సంస్కృతిని పెంచుతుంది. అంటే ఆ సరుకును అమ్ముకోవడానికి మనుషుల మనసులనూ మార్చుతుంది. సరుకును పొందడమే మనుషుల జీవిత లక్ష్యం అనే భావజాలాన్ని తయారు చేస్తుంది. మనుషుల గొప్పతనాన్ని సరుకుల్ని పొందే వాళ్ల సామర్థ్యాన్ని బట్టే అంచనా వేస్తుంది. అంతేకాదు పెట్టుబడిదారీ విధానానికి ఇరుసుగా వుండే లాభాపేక్ష మానవ సంబంధాల్లోనూ ప్రవేశిస్తుంది. అంటే పెట్టుబడిదారీ సమాజం మానవ సంబంధాలను కేవలం ఆర్థిక సంబంధాలుగా మారుస్తుంది. మానవ సంబంధాల్లోని విలువలన్నింటిని ధ్వంసం చేస్తుంది. తన సరుకులను విచ్చలవిడిగా అమ్ముకోవాలంటే, దాని దోపిడీ యధేచ్ఛగా సాగాలంటే దానికి సొంత లాభం తప్ప ఏ విలువలూ పట్టని 'మనుషులు' కావాలి. ఏ సున్నితత్వాలూ లేని మనుషులు కావాలి. తోటి మనుషుల బాధలను చూసి ఏమాత్రం స్పందించని మనుషులు కావాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషితనం చచ్చిన 'మనుషులు' కావాలి. మర మనుషుల వంటి 'మనుషులు' కావాలి. మనుషుల మధ్య అనుబంధాలుండకూడదు, సంబంధాలుండకూడదు, ప్రేమలు వుండకూడదు. పెట్టుబడిదారీ విధానం కోరుకుంటున్న 'మనుషులకు'

కేవలం మార్కెట్‌తోనే సంబంధాలుండాలి. ఆ 'మనుషులను' కేవలం మార్కెట్టే నియంత్రించాలి.

పెట్టుబడిదారీ సమాజం గురించి ఇలా చెప్పుకుంటున్నామంటే భూస్వామ్య సమాజంలో మనుషుల మధ్య సంబంధాలు గొప్పగా వున్నాయని కాదు. భూస్వామ్య సమాజంలో ఉత్పత్తి చిన్న స్థాయిలో జరుగుతుండడం, కుటుంబమే ఆర్థిక యూనిట్‌గా వుండడం వల్ల మానవుల మధ్య సంబంధాలు సంకుచితంగా వుండేవి. ఉత్పత్తి సామాజీకీకరణ చెంది, ఆర్థిక యూనిట్‌గా కుటుంబపు పాత్ర కోల్పోయినప్పుడు మాత్రమే మానవుల మధ్య నిజమైన మానవ సంబంధాలు నెలకొంటాయి.

పెట్టుబడిదారీ సమాజంలో సరుకులను పొందడమే ప్రధానం గానీ ఏ మార్గంలో వాళ్లు సరుకుల్ని పొందారన్నదానికి ప్రాముఖ్యత వుండదు. ఏం చేసైనా సరే, ఎన్ని విలువల్ని కాలదన్నైనా సరే సరుకుల్ని పొందడమే దానికి కావాలి. అలా విలువల్ని కాలదన్నలేని వాళ్లనూ, సరుకుల్ని పొందలేని వాళ్లను అది అసమర్థులుగా చూపుతుంది. అంటే మార్కెట్ విస్తరించాలంటే ఆ మేరకు విలువలు ధ్వంసం కావల్సిందే. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణమించాక ఈ విలువల ధ్వంసం మరింత పెరిగింది. సామ్రాజ్యవాద సంస్కృతి వెర్రితలలు వేస్తోంది. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ఇది మరింత విషమించింది. నూతన ఆర్థిక విధానాలను భారత ప్రభుత్వం ఒప్పుకున్నాక అది మొదట సంతకం చేసిన ఫైలు టీవీ ఛానెల్లలో హాలివుడ్ సినిమాల ప్రసారంపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయడం అనేది యాదృచ్ఛికం కాదు. హాలివుడ్ సినిమాల్లో అశ్లీలత ఎక్కువగా వుంటుందనేది తెల్సిందే. ఇక్కడి సంస్కృతిపై దాడి చేసి, విలువల్ని ధ్వంసం చేసి తన మార్కెట్‌ను విస్తరించుకోవాలనుకుంటున్న సామ్రాజ్యవాదపు కుట్రలో భాగమే ఇది.

పెట్టుబడిదారీ విధానం లేదా సామ్రాజ్యవాదం ప్రతీ దాన్ని సరుకుగా మారుస్తుంది. అందులో భాగంగా అది ప్రేమను కూడా సరుకుగా మారుస్తోంది. (సరుకుగా మారిందంటే నిజమైన ప్రేమగా అది చచ్చిపోయినట్టే. అంటే నిజమైన ప్రేమ ఇక ఎంత మాత్రమూ లేదని కాదు. ప్రలోభాలకు లొంగని మనుషులున్నంత కాలం నిజమైన ప్రేమ వుంటుంది.) ఆ సరుకును పొందడం యువతీ యువకుల జీవిత లక్ష్యంగా ప్రచారం చేస్తోంది. ఇక్కడ జీవిత లక్ష్యంగా చేస్తోంది అంటే యువత దీన్ని తమ జీవితానికి సంబంధించిన ఒక సీరియస్ అంశంగా భావించే విధంగా చేస్తోందని అర్థం కాదు. ఇదెంత వైరుధ్యంగా వుంటుందంటే జీవితంలో తప్పనిసరిగా ఉండే అంశంగా ప్రచారం చేస్తూనే దాన్ని కేవలం కాలక్షేపంగా, సరదాగా, ఉబుసుపోకగా తయారు చేసింది. నిజమైన ప్రేమంటే దానికి గిట్టదు. నిజమైన ప్రేమంటే పోరాటశక్తి. ఏ పోరాట శక్తినైనా నిర్వీర్యపర్చాలనే సామ్రాజ్యవాదం చూస్తుంది. దానికి కావల్సింది విధ్వంసక శక్తి. పట్టణాల్లో, నగరాల్లో ఎక్కడ చూసినా అమ్మాయిలూ, అబ్బాయిలూ జంటలు జంటలుగా తిరగడం ఇప్పుడు సర్వ సాధారణ విషయమే అయింది. వాళ్లు ప్రేమ జంటలుగా చెలామణీ అవుతుంటారు. కానీ అత్యధిక శాతానికి ఆ 'ప్రేమ'ను అలా నిలుపుకోవాలని గానీ, 'ప్రేమిస్తున్న' వారినే పెళ్లిళ్లు చేసుకోవాలని గానీ ఎంత మాత్రమూ వుండడం లేదు. అంతేకాదు ప్రేమ కేవలం లైంగిక సంబంధం స్థాయికి దిగజారింది. ఇట్లా అసలు ప్రేమను చంపేసి ప్రేమ అని ఎంత మాత్రమూ చెప్పకూడనిదాన్ని ప్రేమ అని ప్రచారం చెయ్యడమే కాదు, దాన్ని యువత జీవిత లక్ష్యంగా చేయడంలో సామ్రాజ్యవాదపు ఉద్దేశం స్పష్టమే. ఒకటి విలువల ధ్వంసం, రెండు యువతను సమాజం గురించి కొంచెం కూడా ఆలోచించకుండా చెయ్యడం, మూడు ఈ 'ప్రేమలు' మార్కెట్‌ను విపరీతంగా పెంచుతాయి. 'ప్రేమికులు' ఒకరికొకరు బహుమతులు ఇచ్చుకునే సంస్కృతి కూడా ఈ మధ్య బాగా పెరుగుతోంది. ఇక వాలంటైన్స్ డే (ప్రేమికుల రోజు) సందర్భంగా బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం గురించయితే చెప్పనే అవసరం లేదు. ఆ ఒక్క రోజునే బహుమతుల రూపంలో కోట్లాది రూపాయల సరుకు అమ్ముడు పోతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ సుందరి మొదలుకొని గల్లీ సుందరి వరకూ రకరకాల పోటీలు పెడుతూ సౌందర్య సాధనాల పట్ల అమ్మాయిల్లో విపరీతమైన వ్యామోహాన్ని పెంచుతోంది సామ్రాజ్యవాదం. వాటిని కొనే శక్తిలేక, వాటి మీద వ్యామోహం చంపుకోలేక సతమతమవుతున్న కొంతమంది మధ్య తరగతి, దిగువ తరగతి అమ్మాయిలు వాటిని పొందే మార్గంగా ఇటువంటి 'ప్రేమ'లను ఎంచుకుంటున్నారంటే దిగ్భ్రాంతి కల్గుతుంది.

సరే! ప్రేమో, ఆకర్షణో, శారీరక వాంఛనో అది యువతీ యువకులిద్దరికీ ఆమోదయోగ్యమైతే వేరే సంగతి. కానీ అది ఏకపక్షమైతే- అమ్మాయిల నుండే ఏకపక్షంగా వుంటే అబ్బాయిలకు చేకూరే నష్టమేమీ లేదు. కానీ అబ్బాయిల నుండి ఏకపక్షంగా వుంటే అది అమ్మాయిలకు ప్రాణాంతకంగా కూడా దాపురించవచ్చు. ఏకపక్ష ప్రేమలు ప్రాణాంతకంగా ఎందుకు మారాయి? సామ్రాజ్యవాదం ఏం చేసైనా సరుకును పొందడమే లక్ష్యం కానీ, అది పొందే మార్గం గురించి పట్టించుకోవద్దని చెప్తుంది కదా. ఇక్కడ 'ప్రేమ'ను పొందడమే ముఖ్యం గానీ వేధించా, బెదిరించా అన్నది ముఖ్యం కాదు. వేధించో, బెదిరించో ఎవరూ ప్రేమను పొందలేరు. ఇటువంటి వేధింపులకు పాల్పడుతున్న వారు కూడా అమ్మాయిల నుండి ప్రేమను ఆశిస్తున్నారని అనుకోలేం. వాళ్లకూ ఆ అమ్మాయిల మీద ప్రేమ లేదనేది స్పష్టం. అసలు ప్రేమంటేనే వారికి తెలీదనేదీ స్పష్టమే. వాళ్లకు 'నా లవర్' అని చెప్పుకోడానికి ఒక వస్తువు వంటి అమ్మాయి కావాలి. వాళ్ల అవసరాలు తీర్చే'ఆట బొమ్మలు' కావాలి. 'లవర్' అనే వస్తువు లేకుంటే యువకులకు నామోషీ అని కదా సామ్రాజ్యవాదం నూరి పోస్తున్నది. అలా నూరిపొయ్యడంలో భాగంగా ప్రేమను పొందడానికి ఉన్మాదులుగా మారి చంపడాన్నైనా, చావడాన్నైనా హీరోయిజం

చేస్తోంది. ఇటువంటివి నూరిపొయ్యడంలో సినిమాలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి.

తన 'ప్రేమను' నిరాకరించిన అనూరాధతో శ్రీనివాసరెడ్డి ఇక నీకూ నాకూ మధ్య 'ఢర్' అన్నాడట. (ఢర్ అనే సినిమాలో 'ప్రేమను' నిరాకరించిన అమ్మాయిని 'హీరో'నో, విలనో చంపుతాడట.) అంటే ఢర్ సినిమా శ్రీనివాసరెడ్డికి ప్రేరణ అయింది. తెలుగులో కూడా ఇటువంటి సినిమాలకు కొదవేం లేదు. వేధించీ, బెదిరించీ, హింసించీ ప్రేమను 'జయిస్తున్న' తమ ఆరాధ్య హీరోలను కొంతమందైనా ఆదర్శంగా తీసుకోకుండా ఎలా వుండగలరు?

ఎలాగైనా 'ప్రేమను' పొందాలి అనే బోధనలకు మహిళలకు వ్యక్తిత్వం వుంటుందనీ, వారి జీవితాన్ని వారే నిర్ణయించుకోవాలని అంగీకరించని పితృస్వామ్య భావజాలం కూడా తోడైతే ఇక అమ్మాయిల ప్రేమ నిరాకరణ హక్కును ప్రేమోన్మాదులు ఎలా భరించగలరు?

అంతేకాదు పితృస్వామ్యం మహిళను ఒక వ్యక్తిగా గుర్తించదు. ఆమెను ఎవరో ఒక పురుషుడికి చెందిన ఆస్తిగానే పరిగణిస్తుంది. స్త్రీని ఆస్తిగా పరిగణించినంత కాలం ఆ ఆస్తిని సొంతం చేసుకోవాలనే, సొంతం చేసుకోలేని దాన్ని ధ్వంసం చేయాలనే ప్రయత్నాలూ వుంటాయి.

అయినప్పటికీ ఇంత ఘోరంగా ఆసిడ్ పోసి, బండకత్తితో నరికి... ఇంకా రకరకాలుగా ఎలా చంపగలుగుతున్నారు? ఇంత తేలికగా ఇంత బీభత్సకర హింసకు ఎలా పాల్పడగల్గుతున్నారు? అనే ప్రశ్న వేసుకుంటే, మళ్లీ సామ్రాజ్యవాద వికటాట్టహాసమే సమాధానంగా వినబడుతుంది. అది సినిమాల్లో, టీవీల్లో, పత్రికల్లో హింసను మంచినీళ్ల ప్రాయంగా అలవాటు చేస్తోంది. హింస ఎంతగా అలవాటైపోతున్నదంటే హింసను చూసి స్పందించే గుణం ప్రజల్లో చచ్చిపోతోంది. అంటే హింసను హింసగా భావించే పరిస్థితే పోతోంది. ఇటువంటి పరిస్థితిలో ఎవరైనా హింసకు పాల్పడ్డం అనేది సునాయాసంగానే సాధ్యమవుతుంది.

ఈ మధ్య కాలంలో పెరిగిపోతున్న ఈ ప్రేమోన్మాదాల నేపథ్యంలో కొన్ని మహిళా సంఘాలు కాలేజీల్లో ముఖ్యంగా జూనియర్ కాలేజీల్లో ఈ విషయంలో చర్చావేదికలు నిర్వహించాయి. ఈ చర్చల్లో పాల్గొన్న కొంతమంది అబ్బాయిలు, మగ 'ప్రేమికులు' వారి కుటుంబాలనూ, చదువులనూ, భవిష్యత్తును నాశనం చేసుకోవడం లేదా; ప్రేమ కోసం నేరస్తులుగా మారటం లేదా; అది త్యాగం కాదా అని మాట్లాడారు. జూనియర్ కాలేజీ అబ్బాయిలు ప్రేమోన్మాదాన్ని ఇలా హీరోయిజంగా ఆరాధిస్తున్నారంటే భవిష్యత్ సమాజం మరెంత దారుణంగా ఉండబోతుందో అవగతం చేసుకోవచ్చు.

ఈమధ్య కాలంలో ఇవి భయాందోళనలు కల్గించేంతగా పెరిగిపోతున్నాయి. ఇటువంటివి పెరుగుతుంటే ఈ ముసుగులో మరిన్ని ఘోరాలు జరిగే అవకాశమూ వుంది. విజయవాడలో ఆయేషా మీరాను బాత్‌రూంలో అత్యాచారం చేసి చంపిన వాడు ప్రేమను అంగీకరించనందుకు చంపానని ఒక ఉత్తరం రాసి పెట్టాడు. ఆమెను ఎవరూ ప్రేమ పేరుతో వేధించిన దాఖలాలు గతంలో లేవు. అంటే ఈ హత్య ప్రేమోన్మాది చేశాడా? లేదా హంతకుడు తప్పించుకోవడం కోసం ప్రేమోన్మాదపు కథ అల్లాడా అన్నది ఎప్పటికైనా తేలుతుందో, అసలు తేలకుండానే పోతుందో చెప్పలేం.

అమ్మాయిల మీద పెరుగుతున్న ఇటువంటి దాడులకూ, అత్యాచారాలకు అమ్మాయిలనే తప్పుపట్టే వాదన ఒకటి వుంది. అమ్మాయిల వస్త్రధారణ, వేషధారణ రెచ్చగొట్టే విధంగా వుండడమే అమ్మాయిలు గురౌతున్న దాడులకు కారణమని వాదించేవాళ్లు తక్కువేం లేరు. నిజానికి మహిళల కట్టూ, బొట్టూ మహిళలు ఎంచుకున్నది, ఎంచుకుంటున్నది కాదు. పితృస్వామ్య సమాజమే వారి మీద రుద్దుతోంది. భూస్వామ్య సమాజం ఒక రకమైన కట్టూ, బొట్టును రుద్దితే, పెట్టుబడిదారీ సమాజం మరో రకమైన కట్టూ బొట్టును రుద్దుతోంది. కులమూ, మతమూ కూడా స్త్రీల కట్టూబొట్టును నిర్దేశిస్తున్నాయి. మరి అటువంటప్పుడు, కాసేపు మహిళల కట్టూబొట్టే ఇటువంటి దారుణాలకు కారణం అని ఒప్పుకున్నా కూడా, దానికి బాధ్యులు మహిళలు ఎలా అవుతారు? వస్త్రధారణే కారణం అనుకుంటే సాంప్రదాయ దుస్తులు ధరించే మహిళల పరిస్థితి సురక్షితంగా వుండి వుండాలి. కానీ వంటినిండా బురఖాలు కప్పుకునే ముస్లిం మహిళల మీదా, నన్స్ మీదా, పసిపిల్లల మీదా, ముసలవ్వల మీదా జరుగుతున్న అత్యాచారాలను చూస్తే వేష, వస్త్రధారణ వల్లనే అని ఎలా అనుకోగలం? సమస్యకున్న అసలు కారణాన్ని వదిలేసి ఇలాంటి వాదనలు చేయడంలో, ఏ అనర్థానికైనా స్త్రీయే మూలకారణమనే మనువాద భావజాలం వుంది.

ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దాడులను గమనిస్తే, ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఒకేవిధంగా వున్నట్టు తెలుస్తోంది. పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ ఇటువంటి దాడులు జరుగుతున్నాయని గమనిస్తే సామ్రాజ్యవాదం పల్లెలనూ కబళిస్తోన్న తీరు అర్థమవుతుంది. దాడులకు పాల్పడుతున్న వారిలోనూ అన్ని రకాల వారు వుంటున్నారు. దిల్‌షాద్‌ను చంపినవాడు ఒక టీచర్. కల్పన మీద యాసిడ్ గుప్పిన వాడు ఒక లెక్చరర్, ఐశ్వర్యకు నిప్పంటించాలని చూసిన వాడు ఒక కారు డ్రైవర్, సువార్తినిని పురేసినవాడు ఒక విద్యార్థి. ఏ వివక్ష చూపకుండా అన్ని రకాల సామాజిక నేపథ్యాలున్న వారినీ సామ్రాజ్యవాదం ఒకే విధంగా ఆకర్షిస్తున్నదనడానికి నిదర్శనమిది.

ఈ ప్రేమోన్మాదం కొందరు అమ్మాయిలను మృత్యుకుహరంలోకి నెట్టేస్తుంటే, మరికొందరు అమ్మాయిలను జీవితాంతమూ పీడకలలా వెంటాడుతోంది. మరి అబ్బాయిలను? వారినీ హంతకులుగా,

*(మిగతాది 31వ పేజీలో...)*

# కామ్రేడ్ నార్మన్ బెతూన్ జ్ఞాపకార్థం

*(ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయవలసి వున్న నేటి సందర్భంలో, పార్టీ క్యాడర్ ఉద్యమ అవసరాలరీత్యా ఎక్కడయినా పని చేయగలిగే సంసిద్ధతలను మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం వుంది. అంతేకాదు పార్టీ, ప్రజాసైన్యం మరింతగా శక్తివంతం కావాలంటే వైద్యంతో సహా పలు సాంకేతిక విభాగాల్లో పని చేసే సంసిద్ధతనూ మరింతగా పెంచుకోవాల్సిన అవసరమూ వుంది. ఈ సందర్భంలో గొప్ప అంతర్జాతీయతనూ, గొప్ప సేవాతత్వరతనూ చాటి చెప్పిన కా. నార్మన్ బెతూన్ జీవితం గురించి కా. మావో మాటల ద్వారా తెల్సుకోవడం ఉత్తేజకరంగా వుంటుందని భావించి ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం - సంపాదకవర్గం)*

కామ్రేడ్ నార్మన్ బెతూన్ * కెనడా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. జపాన్ వ్యతిరేక యుద్ధంలో చైనాకు సహాయపడడానికి కెనడా, అమెరికా కమ్యూనిస్టు పార్టీలు ఆయన్ని చైనాకు పంపినప్పుడు ఆయన వయసు 50 సంవత్సరాలు దాటింది. వేలాది మైళ్ల దూరాన్ని లెక్కచేయకుండా ఆయన చైనాకు వచ్చాడు. గత వసంతకాలంలో ఆయన యేనాన్‌కు వచ్చాడు. వుటాయ్ కొండల్లో పని చేయడానికి వెళ్లాడు. దురదృష్టవశాత్తు తన విధి నిర్వహణలో ఒక అమరవీరునిగా మరణించాడు. ఒక విదేశీయుడు ఎలాంటి స్వలాభాపేక్ష లేకుండా చైనా ప్రజల విముక్తి లక్ష్యాన్ని తన స్వంత లక్ష్యంగా ఎంచుకునేటట్లు చేసిన ఆ దీక్ష ఎలాంటిది? అది అంతర్జాతీయతా దీక్ష. కమ్యూనిజం అనే దీక్ష. ఈ దీక్ష నుండి ప్రతి చైనా కమ్యూనిస్టు నేర్చుకోవాలి. వలస, అర్ధవలస దేశాల ప్రజల విముక్తి పోరాటాన్ని పెట్టుబడిదారీ దేశాల శ్రామికవర్గం బలపరిచినప్పుడు మాత్రమే ప్రపంచ విప్లవం జయప్రదం అవుతుందని లెనినిజం మనకు బోధిస్తుంది. తన కార్యాచరణలో కామ్రేడ్ బెతూన్ ఈ లెనినిస్టు పంథాను అనుసరించాడు. చైనా కమ్యూనిస్టులమైన మనం కూడా ఈ పంథాను అమలుజరపాలి. జపాన్, బ్రిటన్, అమెరికా, జర్మనీ, ఇటలీ తదితర అన్ని పెట్టుబడిదారీ దేశాల శ్రామిక ప్రజలతో మనం ఐక్యం కావాలి. అప్పుడు మాత్రమే సామ్రాజ్యవాదాన్ని మనం కూలదోయగలుగుతాం. మన దేశాన్నీ, ప్రజలనూ విముక్తి చేయగలుగుతాం. ఇది మన అంతర్జాతీయత. ఈ అంతర్జాతీయతతోనే జాతీయ దురహంకారాన్నీ, సంకుచిత దేశభక్తిని రెంటిని మనం వ్యతిరేకిస్తాం.

తన స్వంతం కోసం చేసుకోకుండా ప్రతి పనీ ఇతరుల ప్రయోజనం కొరకు చేసే కామ్రేడ్ బెతూన్ దీక్ష, తన పనిలో బాధ్యతపట్ల చాలా గొప్ప గుర్తింపు, తన కామ్రేడ్స్, ప్రజల పట్ల చాలా గొప్ప ఆప్యాయతల ద్వారా వ్యక్తమయింది. ప్రతి కమ్యూనిస్టు ఆయన నుండి నేర్చుకోవాలి. చెప్పుకోతగినంత మంది తమ పనిలో బాధ్యతారహితంగా వుంటున్నారు. “తేలికైనదాన్ని ఎంచుకొని బరువైనదాన్ని నెట్టివేయడం” అంటే అధికమైన బరువులను ఇతరులపైకి నెట్టి తమ కోసం తేలికైన వాటిని ఎంచుకోవడం, ఏదైనా ముందుకొచ్చినపుడు వారు తమను గురించి మాత్రమే ఆలోచించుకొని ఇతరుల గురించి ఆ తర్వాత మాత్రమే ఆలోచిస్తారు. వారు శ్రమ చేసినపుడు గర్వంతో పొంగిపోతారు. దాన్ని గురించి ఇతరులకు తెలియదేమోనని అతి గొప్పలు చెప్పుకుంటారు. తన తోటి కామ్రేడ్స్ పట్ల వారు నిండైన ఉత్సాహంతో మెలగకుండా అయిష్టంగానూ, సాన్నిహిత్యం లేకుండానూ, నిర్లక్ష్యంగానూ, అనాసక్తితోను వ్యవహరిస్తారు. అలాంటివారు నిజంగా కమ్యూనిస్టులు కారు. లేదా కనీసంగా చెప్పాలంటే మంచి కమ్యూనిస్టులుగ లెక్కించబడజాలరు. యుద్ధరంగం నుండి తిరిగి వచ్చినవారిలో ఏ ఒక్కరూ బెతూన్ పేరు చెప్పినపుడు తమ ప్రశంసాభావాన్ని వ్యక్తపరచకుండా ఉండలేకపోయారు. ఏ ఒక్కరూ ఆయన దీక్షకు చలించకుండా ఉండలేకపోయారు. డాక్టర్ బెతూన్ చేత వైద్యం చేయించుకొన్నటువంటి, లేదా తన పనిని ఆయన ఏవిధంగా చేసేవాడో తమ స్వంత కళ్ళతో చూసినటువంటి షాన్సీ-చాహాట్-హూపే సరిహద్దు ప్రాంతాలలోని సైనికులూ, పౌరులలోని ఏ ఒక్కరూ చలించకుండా వుండలేకపోయారు. ప్రతి కమ్యూనిస్టు ఈ నిజమైన కమ్యూనిస్టు దీక్షను కామ్రేడ్ బెతూన్ నుండి నేర్చుకోవాలి.

కామ్రేడ్ బెతూన్ ఒక డాక్టరు. వైద్యం చేయడం తన వృత్తిగా ఆచరించాడు. తన నైపుణ్యాన్ని ఎల్లప్పుడూ అభివృద్ధి చేసుకుంటూ వుండేవాడు. తన నైపుణ్యం ద్వారా 8వ మార్గ సైన్యానికి సంబంధించిన మొత్తం వైద్యుల్లో ఆయన చాలా ఉన్నతంగా నిలిచాడు. కొద్దిగా భిన్నమైన అంశాన్ని చూసిన క్షణంలోనే తమ పని మార్చుకోవాలని కోరుకొనేటటువంటి, సాంకేతిక పని నిరుపయోగమైనదన్నట్లుగాను, గుడ్డిగా చేసుకుపోయే వృత్తి అన్నట్లుగాను, తేలికగా చూసేటటువంటి గుంపుకు ఇది ఒక అద్భుతమైన గుణపాఠం.

కామ్రేడ్ బెతూన్‌ను నేను ఒక్కసారే చూసాను. ఆ తర్వాత ఆయన నాకు చాలా ఉత్తరాలు రాసాడు. అయితే పని ఒత్తిడి వున్నందువల్ల నేను ఒక ఉత్తరము మాత్రమే రాసాను. అసలు అది ఆయనకు చేరిందో లేదో నాకు తెలియదు. ఆయన మరణం నాకు చాలా విచారంగా వుంది. ఇప్పుడు మనం అందరం ఆయన్ను స్మరించుకుంటున్నాం. ఆయన దీక్ష ఎంత గాఢంగా ప్రజలను చలింపచేసిందో దీని ద్వారా మనం చూడగలుగుతున్నాం. స్వార్థం నుండి అంత పూర్తిగా విముక్తి చెందిన ఆ దీక్షను ఆయన నుండి మనమంతా నేర్చుకోవాలి. ఈ అంశం నుండి ప్రారంభించినపుడు

ప్రజలకు గొప్ప ప్రయోజనకరమైన వ్యక్తిగా ఎవరైనా తయారు కాగలరు. ఒక మనిషి యొక్క సామర్థ్యం అధికమయినది కావచ్చు లేదా అమూల్యమైనది కావచ్చు. అతను ఈ దీక్ష మాత్రం కలిగి వున్నట్లయితే అతను అప్పటికే వున్నత ఆదర్శాలు గల మనిషిగానూ, నిర్మలమైన మనిషిగానూ, నైతిక స్థాయిగల మనిషిగానూ, తుచ్ఛమైన కోరికలను అధిగమించిన మనిషిగానూ ప్రజలకు ప్రయోజనకరమైన మనిషిగాను ఎదిగినట్లే.

### వివరణ

* ప్రఖ్యాత సర్జన్ నార్మన్ బెతూన్ కెనడా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. 1936లో జర్మన్, ఇటాలియన్ ఫాసిస్టు పందికొక్కులు స్పెయిన్‌ను ముట్టడించినప్పుడు ఆయన యుద్ధరంగానికిపోయి ఫాసిస్టు వ్యతిరేక స్పానిష్ ప్రజల కోసం పని చేసాడు. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలో చైనా ప్రజలకు సహాయపడటానికిగాను 1938 వసంతంలో ఆయన యేనాన్‌కు ఒక వైద్య బృందం నాయకుడిగా వచ్చాడు. వెనువెంటనే ఆయన షాన్సీ-చాహార్-హుపే సరిహద్దు ప్రాంతానికి తరలివెళ్లాడు. ప్రగాఢమైన అంతర్జాతీయతత్వం మహత్తర కమ్యూనిస్టు ఉత్తేజంతో ఈయన సుమారు రెండేళ్ల పాటు విముక్త ప్రాంతాలలోని సైన్యానికీ, ప్రజలకూ సేవ చేసాడు. క్షతగాత్రులైన సైనికులకు శస్త్ర చికిత్స చేస్తూ రక్తానికి విషక్రిములు సోకడం వల్ల 1939 నవంబర్ 12న హుపే రాష్ట్రంలోని టాంగ్సిన్‌లో చనిపోయాడు.

(ఇంగ్లీషు మూలం: "సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మావో-సే-టుంగ్" వాల్యూం 2 పెకింగ్ ఎడిషన్)

★

## అమరుల స్మారక సభలు

ఎ.ఒ.బిలోని మల్కన్‌గిరి డివిజన్‌లో ఈ సంవత్సరం జూలై 28 అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా పితూరి ఏందన దళం (పి.ఎ.డి-సాంస్కృతిక దళం) పప్పులూరు ఏరియాలో మూడు పెద్ద సభలను నిర్వహించింది. ఈ సభల సందర్భంగా రెండు స్థూపాలను రాళ్లతో పది అడుగుల ఎత్తుతో నాలుగైదు గ్రామాల ప్రజలు కలిసి సమిష్టిగా శ్రమ చేసి నిర్మించారు. ఒక్కో సభకు దాదాపు ఏడు వందల మంది ప్రజలు హాజరయ్యారు.

సభారంభానికి ముందు ర్యాలీ జరిగింది. ఎర్రజెండాలతో పి.ఎ.డి దళం ర్యాలి ముందు నృత్యం చేస్తుండగా, ప్రజలందరు ఆ పాటలకు వంత పలికారు. ఇలా ర్యాలి సభాస్థలికి చేరగానే పి.ఎ.డి కామ్రేడ్స్ కొన్ని ఢాకా నృత్యాలను ప్రదర్శించి, అమరువీరులకు జోహార్లు చెపుతూ అమరుల పాటలు, సమస్యలపై పాటలు పాడారు. చివరికి పి.ఎల్.జి.ఎ పాట పాడుతూ ప్రజలకు సైన్యంలో చేరాలని పిలుపునివ్వడం జరిగింది.

ఈ సభలో ఏరియా కమాండర్లు, సంబంధిత జిల్లా కమిటీ సభ్యుడు ప్రసంగించారు. వీరంతా ప్రధానంగా యుద్ధం రోజు రోజుకూ తీవ్రతరం అవుతున్న తీరు గురించీ, ప్రజా సైన్యం పెరగాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఉద్యమం ఒక రాష్ట్రంలో ఒక్కడుగు వెనక్కి వేసినా, ఇంకో ప్రాంతంలో రెండడుగులు ముందుకు వేస్తున్నదని చెప్పారు. ఈ మధ్యకాలంలో అమరులైన కామ్రేడ్స్ బి.కె, కరుణ, గౌతమ్, రత్న, నీలేష్, రఘు, హరిల అమరత్వాన్నీ త్యాగాలను ఎత్తిపడుతూ, వారి పోరాటాలను, ఆదర్శాలను ప్రతి ఏటా ఈ సందర్భంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పి.ఎ.డి దళ సభ్యులు దీపాల నృత్యంతో అమరవీరులకు వినమ్రంగా నివాళ్లు అర్పించారు. అలాగే కోయ, తెలుగు, ఒడియా భాషల్లో అమరుల పాటలు పాడి ప్రజలను ఉత్తేజితులను చేశారు.

జూలై నెలలో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నా ప్రజలు పెద్ద ఎత్తున సభలకు హాజరయ్యారు. ప్రజలు వారి సాంప్రదాయక వాయిద్యాలు డోలక్, హార్మోనియం, గజ్జెలు తదితరాలను పట్టుకొనివచ్చారు. వారి సాంప్రదాయక నృత్యాలను ఈ సభల సందర్భంగా ప్రదర్శించారు.

ఇదే సందర్భంగా కలిమెల ఏరియాలో ఏరియా, గ్రామ పి.ఎ.డి కామ్రేడ్స్ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా మూడు గ్రామాల్లో పెద్ద సభలు జరిగాయి. ఒక్కో సభకు ఐదు వందల నుండి వేయి మంది వరకు ప్రజలు హాజరయ్యారు. ఈ సంవత్సరం అమరులైన కామ్రేడ్స్ బి.కె, కరుణ, గౌతమ్‌లు, అలాగే డివిజన్‌లో అమరులైన కామ్రేడ్స్ రత్న, హరి, రఘు, నీలేష్‌ల స్మృతికి స్థూపాలను నిర్మించారు. సభలకు ముందే పెద్ద ఎత్తున పోసర్లు, బ్యానర్లతో ప్రతి గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలు ఎంతో ఉత్తేజంతో ఈ సభలకు తరలి వచ్చి అమరవీరులకు వినమ్రంగా కన్నీటి విప్లవ నివాళ్లు అర్పించారు.

# ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ దమనకాండకు సరైన జవాబు
# 'దంతెవాడ జైలు బ్రేక్'

2007 డిసెంబర్ 16న విప్లవ ఖైదీల నేతృత్వంలో దంతెవాడ జైలులోని 300 మంది ఖైదీలు జైలు గోడలను బద్దలుకొట్టుకొని స్వేచ్ఛగా బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టారు. అన్ని పట్టణాల్లో వున్నట్లే దంతెవాడ పట్టణంలోకూడా పోలీసు, పారా మిలిటరీ, ఎస్.టి.ఎఫ్ బలగాలు మోహరించి వున్నప్పటికీ ఖైదీలందరూ క్రమశిక్షణ గల సైనికుల్లా వ్యవహరించి, దృఢ సంకల్పంతో ఈ సాహస కార్యాన్ని సాధించారు. దండకారణ్యంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి ప్రజలు స్వతఃసిద్ధంగా ఉద్యమిస్తున్న శాంతి యాత్ర (వేట) పేరున ప్రభుత్వం 'సల్వాజుడూం' అనే బీభత్సకాండను కొనసాగిస్తోంది. పోలీసులూ, ప్రభుత్వ ప్రోత్సాహక సల్వాజుడుం గూండా మూకలు జరిపిన ఈ బీభత్సకాండలో ఇప్పటి వరకు వెయ్యి మందికి పైగా ప్రజలు హత్యగావించబడ్డారు. వందలాది మంది మహిళలు అత్యాచారాలకు, హత్యలకు బలయ్యారు. 700కు పైగా గ్రామాల్ని లూటీ చేసి తగులబెట్టారు. మరోవైపు బస్తర్ ప్రజల కష్టాలన్నింటికీ కారణమైన దోపిడీపై తిరగబడుతూ మా నీరు, మా అడవి, మా భూమి మాకే దక్కాలంటూ ప్రజలు జీవన్మరణ పోరాటం సాగిస్తున్నారు. పోలీసు, పారామిలిటరీ, నాగా, మిజో బలగాలపై దెబ్బకు దెబ్బ జవాబిస్తూ దాడులు చేస్తున్నారు. ఇటువంటి పోరాటాల గడ్డపై ఈ 'జైలు బ్రేక్' ఒక చారిత్రాత్మక సంఘటన. ఈ జైలులోని ఖైదీల్లో అత్యధికులు ఆదివాసీలే. దాదాపు అందరూ వకీలును కూడా ఏర్పాటు చేసుకోలేని పేదవారే. అందువల్ల కేసులు విచారణకు రావటం, బెయిలు లభించడం కష్టమైన విషయాలే. గత రెండున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న సల్వాజుడుం దమనకాండలో తప్పుడు కేసులు బనాయించి వీరందరినీ అరెస్టులు చేసి, జైళ్లలో కుక్కారు. వీరిలో అనేకులు ఆ తర్వాత సల్వాజుడూం మారణకాండలో తమ బంధువులను, కుటుంబ సభ్యులను కోల్పోయారు. వీరి తల్లినో, తండ్రినో, అన్నదమ్ములనో, అక్కచెల్లెళ్ళనో సల్వాజుడూం మూకలు బలితీసుకున్నాయి. వీరంతా జైలు నుండి బయటికి వచ్చే మార్గం లేక ఈ విధంగా బయటపడ్డారు. సల్వాజుడూం భయానికి వీరి కుటుంబ సభ్యులంతా గ్రామాల్ని విడిచి అడవిలో దూర దూరంగా వెళ్లి బతుకు వెళ్లదీస్తున్నారు. ఇక వీరికి న్యాయానికి సంబంధించిన సహాయం అందే అవకాశమే లేదు.

ఒకపక్క దొంగ రాజకీయ నాయకులు, అధికారులు, మాఫియా ముఠాలు, దోపిడీ వర్గానికి చెందిన పేరుమోసిన నేరగాళ్లులాంటి విచారణ లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వీళ్ళపై హత్యలూ, అత్యాచారాలు, లూటీలు, దోపిడీలు, దొమ్మీలు మొదలైన లెక్కలేనన్ని కేసులున్నా వీళ్లను జైళ్ళలో పెట్టరు. ఒకవేళ జైళ్ళలో పెట్టినా రాజభోగాలూ, సకల సౌకర్యాలు జైళ్ళలోనే దొరుకుతుంటాయి. కోర్టు విచారణలు, బెయిలు దొరకటం ఆగమేఘాల మీద జరిగిపోతాయి. జైళ్ళలో వీళ్ళు లీడర్లుగా, పెత్తందార్లుగా చెలామణి అవుతున్నారు. అధికారులు జైలు మాన్యువల్‌ను ఉల్లంఘించి వీరికి సకల సౌకర్యాలు సమకూర్చుతున్నారు. మరోపక్క దళితులూ, ఆదివాసులను చిన్న చిన్న కేసుల్లో సంవత్సరాల తరబడి జైళ్ళలో కుక్కుతున్నారు. ఈ చిన్న చిన్న కేసులకు బెయిలు రావటానికి కూడా సంవత్సరాల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితులున్నాయి. ఒక్క మాటలో అసలైన, పేరుమోసిన నేరగాళ్ళు జైలు బయట సంస్థానాల్లాంటి ఎస్టేట్లు కలిగి, పెద్ద పెద్ద పదవులందుకుంటూ, రోజు రోజుకు అధికార సోపానాల్లో పైపైకి ఎగబాకుతున్నారు. మరోపక్క దరిద్ర నారాయణులు జైళ్ళలో మగ్గిపోతున్నారు. ఈ బడా నేరగాళ్లకు జైళ్ళలో కూడా సకల సౌకర్యాలు సమకూరుతుండగా, పేద ఖైదీలు ఆకలికి మల మల మాడిపోతున్నారు. జైలు మాన్యువల్‌ను ఎక్కడా సరిగా అమలు చేసిన దాఖలాలు లేవు. దాదాపు అన్ని జైళ్ళలోనూ దగాకోర్లు, దాదాగిరి చెలాయించే వాళ్ళదే పెత్తనం. ఈ పేద ఖైదీలు అనారోగ్యంపాలైతే వైద్య సహాయం అందే పరిస్థితి కూడా లేక చనిపోయిన వారెందరో వున్నారు. ఈ విధంగా చనిపోయిన వాళ్ళను పేరుమోసిన నక్సలైటని, కరుడుగట్టిన నక్సలైటనీ ప్రభుత్వం ముద్ర వేస్తున్నది. వాస్తవానికి వీరిలో అనేకులు అమాయకులు. లేదా పార్టీ సాధారణ సానుభూతిపరులు. విప్లవ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా పరిగణించాలని ఖైదీలు అనేకసార్లు చిత్రహింసలను ఎదుర్కొంటూ కూడా జైలులో పోరాటాలు జరిపారు. జైళ్ళు, న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజానీకాన్ని అణచివేసి, దోపిడీ వర్గాన్ని రక్షించేవే. దోపిడీవర్గ అధికారాన్ని నిలబెట్టే ప్రయత్నం చేసేవే.

ఈ నేపథ్యంలో దంతెవాడ జైలులో బందీలైన పి.ఎల్.జి.ఎ, ప్రజా సంఘాల కామ్రేడ్లు సంఘటితంగా ఆలోచించి 'జైల్ బ్రేక్'ను విజయవంతం చేశారు. అదేవిధంగా రోజులతరబడి నిద్రాహారాలు లేక, అనేక కష్టనష్టాలకోర్చి, మంచి సమన్వయంతో వ్యవహరించి పార్టీని కలుసుకోగలిగారు. ఇతర ఖైదీలను కూడా తమతోపాటు బంధ విముక్తులను చేసి, బయటికి తీసుకొచ్చి, సురక్షితంగా వారి వారి ఇళ్ళకు పంపించారు. ఈ సందర్భంగా ఎపి, ఎన్.టి, ఎ.ఒ.బిల వుద్యమం ఈ కామ్రేడ్లందరికీ హృదయపూర్వక విప్లవాభివందనాలు తెలియజేస్తోంది. స్వేచ్ఛను పొందిన ఈ కామ్రేడ్లందరికీ స్వాగతం పలుకుతోంది. జైలు నుంచి స్వేచ్ఛను పొందిన కామ్రేడ్సంతా పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాలలో చేరి దోపిడీ వర్గం కొనసాగిస్తున్న 'సల్వాజుడూం' ప్రతీఘాతుక యుద్ధాన్ని ఓడించేందుకు విప్లవ

*(మిగతాది 50వ పేజీలో...)*

# 'హరితాంధ్ర'ను అపహాస్యం చేస్తున్న కొండరెడ్ల జీవితాలు

'స్వాతంత్ర్యం' వచ్చిందని చెప్పబడుతున్న మనదేశంలో ప్రజల స్థితి ఎలాంటి దుస్థితిలో వుందో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కొండరెడ్ల జీవితాలు నిలువుటద్దం పడుతున్నాయి. ఈ కొండరెడ్ల కూడును, గూడును, గుడ్డను ప్రత్యక్షంగా చూస్తే సామాజిక జ్ఞానం ఏమాత్రం వున్న పౌరులైనా గత 60 సంవత్సరాలుగా భారత పాలకవర్గాలు చెప్పుకుంటున్న మాటల బూటకత్వాన్ని గ్రహించవచ్చు. ప్రతి ఒక్కరికి కూడు, గూడు, గుడ్డ కలిపిస్తున్నామని చెప్పి ముఖ్యంగా ప్రపంచీకరణ మోజులోపడి ప్రపంచబ్యాంకు జీతగాడుగా తొమ్మిది సంవత్సరాలు స్వర్ణాంధ్రప్రదేశ్, హైటెక్ సిటీల పేరుతో రాష్ట్రాన్ని ఏలిన చంద్రబాబు ప్రభుత్వంగానీ, నేడు "హరితాంధ్ర" పేరుతో పాలన సాగిస్తున్న వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంగానీ ఈ కొండరెడ్లను కనీసం మనుషులుగానైనా భావించాయా?

వ్యవసాయాధారిత దేశ ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధికీ, భూమికీ ఉండే సంబంధానికి గల ప్రాముఖ్యత ఏడురాళ్లపల్లి కొండల కొండరెడ్ల జీవితాలను చూస్తే అర్థమవుతుంది. ఖమ్మం జిల్లా కూనవరం, చింతూర్, భద్రాచలం మండలాల సరిహద్దుల్లోవున్న ఏడురాళ్లపల్లి కొండలపై రాతిపాకల, నల్ల మామిడిగొంది, పెద్దవాగు, కర్మకొండ, పాత కర్మకొండ, కొత్త కర్మకొండ, చింతగండి, కోపిరిమిట్ట, తోటమామిడిగొంది, చిరుమనుగండ్లు, కల్లెంగ మిద్ది, పూసు మామిడిగొంది, ఎలుగుల గొంది, వేంచగండి, చిన్నతోగు, కొండపాక, గబ్బిలాల గొంది అనే పేర్లు కలిగిన దాదాపు 20-25 గూడాలు వున్నాయి. వీటిలో కొత్తకర్మకొండ, తోటమామిడి గొంది, కోపిరిమిట్ట, చిన్నతోగు, చింతలపాడు గూడాల్లో 2వ తరగతి వరకు గల హాస్టళ్లు వున్నాయి.

ఈ అన్ని గ్రామాల్లో కూడా ఇండ్లు అంటే గుడిసెలు రెండు నుంచి పన్నెండు వరకు వున్నాయి. పది, పన్నెండు గుడిసెలు వున్న గ్రామాలు పెద్దవి. ఒకే దగ్గర ఎక్కువ ఇండ్లు వేసుకోకపోవడానికి గల కారణం సరిపడేంత విశాలమైన భూమి లేక పోవడం. దీంతో ఆ వున్న గుడిసెలు అయినా ఏటవాలుగా వున్న కొండలకే ఎక్కడన్న పది, పదేహేను గజాల వెడల్పు కలిగిన చదును భూమి వుంటే, దానికి తోడుగా ఆ కొండనే మరింత అయిదారు గజాల వెడల్పు తవ్వి వేసుకున్నవి. అక్కడే ఒక గుడిసె నుంచి మరొక గుడిసెకు ఇరవై గజాల దూరం పోవాలంటే ఒకటి రెండు గజాల ఎత్తు ఎక్కుతూ దిగుతూ పోవాల్సిందే. ఈ గుడిసెలకు గోడలు వుండవు. కొందరు వెదురు తడికలు అల్లి చుట్టూ చాటుకట్టుకుంటున్నారు. కొన్ని ఇండ్లు తడికలు లేకుండా ఖాళీగానే వున్నాయి. తడికల సందుల్లోంచి బయటి నుంచి లోపలికి, లోపలి నుంచి బయటికి కనపడుతుంది. ఒక నిట్టాడితో బాగా ఏటవాలుగా భూమికి గజం ఎత్తు వరకు వాసాలు వుండేతీరుగా గుడిసెలున్నాయి. అడవిలో దొరికే కాసె గడ్డిని కప్పారు. ఆ గుడిసెలోకి పోవాలంటే భారీ కాయస్థులు కూర్చొని పోవాల్సిందే. గుడిసెకు పెట్టిన వాసాలు కూడా వెదురు బొంగులే. తలుపులు, కిటికీలు చూద్దామంటే కానరావు. దేశంలో పట్టణాలు, మైదాన ప్రాంతాలు కరెంట్‌తో జిగేల్ మనిపించే వెలుతురుతో వుంటే ఇక్కడి గుడిసెల్లో కనీసం గుడ్డి దీపం కూడా లేదు. కారణం కిరోసిన్ లేకపోవడమే.

ఆ గుడిసెల్లోనే పక్క పక్కనే పందుల, మేకల గుడిసెలు వుంటాయి. కోళ్లను కూడా పెంచుతారు. పశువులు మాత్రం లేవు. ఈ కోళ్లు, పందులు, మేకల మల, మూత్రాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండి వుంటుంది. వెదురు కోపు వున్నందున విషపు దోమలు కూడా బాగానే వుంటాయి. ఇక వర్షాకాలం అయితే ఈ కోళ్లు, పందులు, మేకల మలమూత్రాలకు తోడుగా చిన్న చిన్న గుంటలల్లో నీళ్లు నిలిచి ఆ గుడిసెలన్నీ దోమల నిలయాలుగా వుంటాయి. విషపు దోమలు, వర్షాకాలంలోని కలుషితమైన పరిసరాలకుతోడు వాగులు, ఒర్రెలు, తోగుల నీళ్లు తాగడం వలన కలరా, మశూచి, విరేచనాలకు విష జ్వరాలు తోడై ప్రతి సంవత్సరం కొద్ది మంది చనిపోతూనే వుంటారు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం వీరిని కనీసం మనుషులుగా కూడా భావించడం లేదు. కొన్ని గుంపులు ఒర్రెల ఒడ్డుకే వుంటే, కొన్ని గుంపులు కొండలపైన ఒర్రెలకు రెండు, మూడు వందల గజాల ఎత్తున వున్నాయి. స్త్రీ, పురుషులు రోజుకు నాలుగైదుసార్లు బిందెలు, పెద్ద పెద్ద వంట గిన్నెలు పట్టుకొని కిందికి దిగి నీళ్లు తెచ్చుకుంటారు. ఇంటి ముందు వాకిలి ఊడ్చి అలుకు చల్లడం వుండదు. ప్రభుత్వం బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి నీటి కలుషితాన్ని అరికట్టడం లేదు. ప్రజల ఆరోగ్యం పట్టించుకోవాలనే ఇసుమంత స్పృహ కూడా ప్రభుత్వాలకు లేదు. కటిక పేదరికం మూలంగా కనీసం కట్టుకోవడానికి కూడా బట్టలు సరిగా లేవు. కొండల మీద వున్న కొన్ని గుంపుల్లోని పురుషులైతే ఇప్పటికీ బుడ్డగోచి, పాత చినిగిన చొక్కాతోనే వున్నారు. మహిళలైతే ఒక లుంగిని రెండు ముక్కలుగా చేసి ఒక ముక్కను నడుముకు మోకాళ్ల వరకు వుండేతీరుగా, ఒక ముక్కను ఛాతీమీద వుండే తీరుగా కట్టుకుంటారు. 8-9 సంవత్సరాల వయస్సు కలిగిన బాలబాలికలకు బట్టలే వుండవు.

## జీవన విధానం

వీరు పోడు వ్యవసాయం, వెదురు బుట్టలు, గంపలు, చేటలు అల్లడం, చింతపండు, తేనె వగైరా అటవీ వనరుల సేకరణ ద్వారా జీవనం సాగిస్తారు. ఇందులో పోడు వ్యవసాయమే వీరికి ప్రధాన జీవనాధారం.

## పోడు వ్యవసాయం

సమిష్టిగా కాకుండా ఏ కుటుంబానికి ఆ కుటుంబం వ్యక్తిగతంగానే పోడు వ్యవసాయం చేస్తారు. ఆ కుటుంబంలోని సభ్యుల పని చేయగలిగే శక్తిని బట్టి నిటారుగా అంటే కొంచెం ఏటవాలుగా (మీద చిన్న రాయిని కదిలిస్తే వచ్చి కిందపడే విధంగా వుండే భూమి) వున్న భూమిని ప్రతి సంవత్సరం జనవరి మాసంలో పోడు నరుకుతారు. ఇది ఎండిన తర్వాత ఏప్రిల్ - మే మాసాలల్లో కాలబెడుతారు. ప్రతి సంవత్సరం ఈ కాలిన బూడిదలోనే జూన్ 15,16 లేదా 25,26 తారీఖులలో విత్తనాలు చల్లుతారు. ఒకే పంట భూమిలో జొన్న, కొండ బొబ్బెర, అనుములు, కొర్రలు, చామలు, బొంత - విత్తనాలను మిశ్రమ పంటగా చల్లుతారు. జూన్, జులైలలో బాగా వర్షాలు వస్తే కొండల మీది నుంచి వచ్చే వర్షపు వరదల్లో విత్తనాలు కొట్టుకుపోతాయి. కాబట్టి అప్పుడు రెండోసారి కూడా విత్తనాలు చల్లుతారు. తొలకరి వర్షాలకు ఈ పోడులో నరికిన చెట్ల మొదలు చిగురిస్తాయి. కాబట్టి జులై-ఆగస్టు మాసాల్లో ఆ చిగురును కోస్తారు. ఇదే మాసాల్లో మొలచిన పైర్ల చిగురును కూడా కోస్తారు. మరొకసారి సెప్టెంబర్ మాసంలో మొక్క వెంట వచ్చే పిలకలను కోసేస్తారు.

ఈ మిశ్రమ పంటలో ముందుగా అక్టోబర్ మాసంలో కొర్ర, బొంత పంటను కోస్తారు. డిసెంబర్‌లో చామ, బొబ్బెర కోస్తారు. జనవరిలో జొన్న, అనుములను కోస్తారు.

ఒకసారి పోడు నరికిన భూమిలో ఒక సంవత్సరం ఒకే పంట వేస్తారు. మరుసటి సంవత్సరం ఆ భూమిలో విత్తనాలు చల్లరు. వేరే భూమిలో కొండపోడు నరుకుతారు. ఇలా ఒకసారి కొండపోడు చేసిన భూమిని నాలుగైదు సంవత్సరాలు వదిలేసి తిరిగి ఆ భూమిలో కొండపోడు చేస్తారు.

కొండపోడులో పండిన జొన్నలు, బొబ్బెర్లు, చామలు, కొర్రలు, బొంతలు, అనుములను అమ్మడం కాకుండా తింటారు. ఎవరికి వారే పంటలను కోసి చేండ్లల్లోనే బడ్డిపైన కుప్పవేస్తారు. అనంతరం సమిష్టిగా ఒకరి తర్వాత మరొకరివి పంట నూర్పిడి చేసి ధాన్యం తయారు చేస్తారు. ఈ జొన్నలకే పొట్టుపోయేలా దంచి, వండుకొని తింటారు.

## నిలువు దోపిడీకి గురవుతున్న కొండరెడ్లు

ఏడురాళ్ళపల్లి, కూటూరు, చింతపల్లి, కూనవరం సంతల్లోని వ్యాపారస్తుల, మారు బేరగాళ్ల (దళారుల) దోపిడీకి ఈ కొండరెడ్లు ప్రధాన వనరుగా కొనసాగుతున్నారు. ఈ పెద్ద పెద్ద కొండలు ఎక్కుతూ, దిగుతూ క్రూర జంతువుల ప్రమాదాలను అధిగమిస్తూ వెదురు, బంక, తేనె, కొండ చీపురు లాంటి అటవీ ఉత్పత్తులను సేకరించుకొస్తారు. కొన్ని గూడాల్లో చింత చెట్లు వున్నందున అక్కడ చింతపండు జమచేస్తారు. ఇలా సేకరించుకొచ్చిన తేనే, కొండ చీపురు, బంకను ఈ సంతల్లో మధ్య దళారులు అతి చౌక ధరకు కొని వీరిని నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. ఈ కొండరెడ్లకు కిలోల తూకం గురించి తెలియదంటే వీరి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కంకెడంత అంటే సుమారు ఒక కిలో గింజ తీసిన చింతపండును మధ్య దళారులు ఒక రూపాయికి కొని దానిని నాలుగు, ఐదు భాగాలుగా ముద్దలు చేసి ఒక్కో దానిని ఇతరులకు ఐదు, ఆరు రూపాయలకు అమ్ముకుంటారు. కొండ చీపురు పెద్ద కట్టను వీరి నుండి 3 రూపాయలకు కొని దానిని మూడు కట్టలు చేసి ఒక్కోదానిని 10, 15 రూపాయలకు అమ్ముతారు. బంకను కూడా ముద్దల చొప్పున కొని, కిలోల చొప్పున వీరి నుండి కొన్న రేటు కంటే నాలుగింతలు ఎక్కువ రేటుకు అమ్ముకుంటారు. కొండలెక్కి కొట్టుకొచ్చిన వెదురుతో చేటలు, చిన్న బుట్టలు, గంపలు, జల్లెడలు అల్లి ఈ వారంతపు సంతలల్లో అమ్ముకుంటారు. కొండరెడ్లు అల్లిన వెదురు వస్తువులను మధ్య దళారులు చాలా చౌక ధరలకు కొనుగోలు చేస్తారు. చేటలు 5-10 రూపాయలకు ఒకటి కొని 20-25 రూపాయల వరకు అమ్ముతారు. 5 కిలోలు పట్టే బుట్టలను 50 పైసలకు కొని ఒక్కోదానిని 5-6 రూపాయలకు అమ్ముకుంటారు.

ఇలా ఈ కొండరెడ్ల చదువులేనితనాన్ని, అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వారి శ్రమను మధ్య దళారులు, వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. మరోవైపు కొండరెడ్లు కొనుగోలు చేసే కారం, ఉప్పు, నూనె వగైరా సరుకులను కూడా విపరీతమైన ధరలకు అమ్మి షావుకార్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సరుకులు కూడా కల్తీవే. మార్కెట్ ధరలకంటే రెండింతలు, మూడింతల ధరలకు సరుకులను ఈ కొండ రెడ్లకు అమ్మి షావుకార్లు దోపిడి చేస్తున్నారు. ఈ సంతలకు అటవీ ఉత్పత్తులను పట్టుకొచ్చి అమ్ముకొని, ఆ డబ్బులతో తిండి సరుకులు కొంటారు. వాళ్లు ఈ సంతల్లో దొరికే లంద, ఇప్పసార, బెల్లపు సారాను ఇష్టపూరితంగా తాగి స్పృహతప్పి సంతల్లో, దారుల్లో పడిపోతారు. స్త్రీ, పురుషులు, పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ కూర్చొని తాగుతారు. తాగి వీళ్లు పడిపోతే వీరి సరుకులను సందెట్లో సడేమియా అన్నట్లు దొంగలెత్తుకు పోతారు. దీంతో వీరు వారం రోజులు చేసిన శ్రమ షావుకార్లు, వ్యాపారస్తులు, మధ్య దళారులు దోపిడీ చేయగా మిగిలినది ఇలా దొంగలెత్తుకుపోవడంతో తెల్లారి తెల్ల మొహం వేసుకొని ఇండ్లకు చేరుకోవడం బాధాకరం. ఇది నిత్యం జరుగుతూనే వుంటున్నది. అయినప్పటికీ పేదల అభ్యున్నతి కోసమే పని చేస్తున్నామని చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, ఆదివాసీల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పుకునే ఐ.టి.డి.ఎ, జి.సి.సి అధికారులుగానీ దీనిని సాధారణాంశంగా చూస్తున్నారే తప్పితే తగు చర్యలు తీసుకోవడం లేదు. పైగా వీరి అభివృద్ధి కోసమని రకరకాల పథకాల పేరుతో విడుదలవుతున్న కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వాధికారుల, ఇక్కడి కాంగ్రెస్, టి.డి.పి, సి.పి.ఎం చోటా మోటా నాయకుల జేబుల్లోకి వెళ్తున్న దాఖలాలు కోకొల్లలు.

ముఖ్యంగా నేడు ప్రపంచ బ్యాంకు నిధులతో అమలవుతున్న రక రకాల పథకాలు పేదలకు కాదు, వున్న వాళ్ల బొక్కసాలు నింపడానికేనన్న వాస్తవం ఈ కొండరెడ్ల దీనస్థితి తెలుపుతోంది. కోట్లాది రూపాయలతో ప్రవేశపెట్టిన 'జలయజ్ఞం' వీరి దరిదాపులో కూడా కనబడడం లేదు. సెలయేర్లు జల జల పారుతున్నా వీరికి సాగుకేమో గానీ తాగేందుకు కూడా శుభ్రమైన నీళ్లు లేవు. వెదురు పొదల నుండి, వాగులు, వంకలు నుండి వచ్చే నీళ్లనే మనుషులు, జంతువులు కలిసి తాగుతారు. వీరి స్నానాలు బట్టలుతకడం కూడా అందులోనే.

రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న పథకాలు అర్హులైన ప్రజలకు ఎంత దూరంగా ఉంటున్నాయో ఈ ప్రజలను చూస్తే అర్థమవుతుంది.

'ఇందిరమ్మ పథకం' ఎంత బూటకమో ఈ కొండలపై ఏ గ్రామాన్ని చూసిన ఇట్టే గ్రహించవచ్చు. ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా ప్రభుత్వ సహాయంతో కట్టినది కానరాదు ఇక్కడ.

'ఆరోగ్యశ్రీ' పథకం కొండరెడ్లకు అందని ద్రాక్షే. ఎందుకంటే వీళ్లు కనీసం సూదులు, మందులు చూసి ఎరుగరు. దమ్మువచ్చినా, దగ్గు వచ్చినా, విషపు దోమలతో జ్వరం వచ్చినా దానంతట అదే తగ్గాల్సిందేతప్ప వైద్యం అనేది కానరాదు. కొండ పనులకు పోయి జంతువుల బారిన పడడమో లేదా బండ కత్తులు, గొడ్డండ్లు వెదురుతో గాయాలైనా వాటంతటవే తగ్గాల్సిందే. లేకుంటే ఆ గాయాలతో జ్వరాలు, జబ్బులతో నెలల తరబడి మూలిగి మూలిగి చావాల్సిందే. ఇక్కడ ఎవర్ని చూసిన గజ్జి, తామెర కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

'ఉచిత విద్యుత్' పథకం అనేది వారి దరిదాపుల్లోనే లేదు. కరెంట్ ఏమోగానీ కనీసం కిర్సనాయిల్ కూడా వారు చూసి ఎరుగరు. ఆదివాసుల పేరిటనే విడుదలవుతున్న తిండి సరుకులు ఎక్కడికి వెళ్తున్నాయో ప్రభుత్వాధికారులకు, సి.పి.ఎం, టి.డి.పి, కాంగ్రెస్ నాయకులకు మాత్రమే తెలుస్తుంది.

'బడి బాట' పథకం బహు మోసపూరితమనేది ఇక్కడ కనపడే వాస్తవం. ఈ కొండలపైన వున్న అయిదు హాస్టల్లలో ఒక్కరోజు కూడా టీచర్లు వుండరు. సామాజిక స్పృహ వున్న ఒకరిద్దరు టీచర్లు శ్రమకోర్చి గుట్టలెక్కి విద్యాబోధన చేసినా ప్రభుత్వం వారికి సరియైన పారితోషికం ఇవ్వడం లేదు. అటవీ సంపదను బహుళజాతి సంస్థలు కొల్లగొట్టుకపోవడానికీ, దానిని అడ్డుకొని స్వపరిపాలనకు సిద్ధపడుతున్న ప్రజలను అణచిపెట్టేందుకు గ్రేహౌండ్స్ లాంటి హంతక బలగాలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్న పాలకులు ఈ పాఠశాలల్లో బోధన చేసే ఉపాధ్యాయులకు మాత్రం తగిన సహాయ సహకారాలు అందివ్వడం లేదు.

వ్యవసాయక దేశమైన ఈ దేశ ప్రజల అభివృద్ధికి భూమికి ఎంత సంబంధం వుందో ఈ కొండరెడ్ల జీవితాలే స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ యోగ్యమైన, సారవంతమైన భూములు, సరైన వ్యవసాయపు విధానాలు వుంటే ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగవుతాయి. సారవంతమైన లక్షలాది ఎకరాల భూములు కలిగి ప్రజలను కడగండ్ల పాలు చేస్తున్న భూస్వాములు, దళారీ నిరంకుశ బూర్జువాలు, సామ్రాజ్యవాదులు వారి అధికారం వున్నంత కాలం ఈ దేశంలో పేదల జీవన ప్రమాణాలు పెరగవు. అందుకని ఈ కొండరెడ్లు సారవంతమైన భూమి కోసం, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం, అధికారం కోసం నేడు దేశంలో కొనసాగుతున్న విముక్తి పోరాటంలో మరింతగా ఐక్యమై పోరాడాలి. అదే వారికి వెలుగు బాట.

★

*(ఈ వ్యాసాన్ని కా. సాగర్ (ఖమ్మం డివిజనల్ కమిటీ కార్యదర్శి) రాసాడు. దీన్ని ప్రచురిస్తున్న నాటికి ఈ కామ్రేడ్ డి.కెలోని కంచాల్ గ్రామం వద్ద జరిగిన పోలీసు దాడిలో అమరుడయ్యాడు.)*

---

***(...25వ పేజీ తరువాయి)***

నేరస్తులుగా తయారు చేస్తోంది. వారి భవిష్యత్తును చీకటిమయం చేస్తోంది. కొందరిని మృత్యు కుహరంలోకి నెట్టేస్తోంది.

సమాజానికి చోదకశక్తులుగా ఉండవల్సిన యువత ఒకవైపు పీడితులుగా, మృతులుగా, అంగవికలురుగా, జీవితాంతం పీడకలను మోసేవారుగా, మరోవైపు పీడకులుగా, నేరస్తులుగా, హంతకులుగా, జీవచ్ఛవాలుగా మారడమనేది సమాజానికి ఎంతగానో నష్టదాయకం. సామ్రాజ్యవాదం కోరుకునేది ఇదే. అందుకే అది సమాజానికి చోదక శక్తులుగా మారవల్సిన వారిని ఇలా నాశనం చేస్తోంది.

సమాజానికి చోదకశక్తులుగా మారే అవకాశమున్న ఈ యువతను కాపాడుకోవడం సమాజపు తక్షణ కర్తవ్యం. అందుకు సమాజం నడుం కట్టాలి. ముఖ్యంగా తమ అస్తిత్వానికి సవాల్‌గా మారిన ఈ సమస్య పరిష్కారం కోసం అమ్మాయిలు సమరశీల పోరాటాలకు నడుం కట్టాలి. ఈ సమస్య వలన తీవ్ర ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు కూడా, ఆందోళన పడుతూ కూర్చుంటే ఈ సమస్య తగ్గదని గుర్తించాలి. ఇటువంటి సమస్యలను మనపైన రుద్దుతున్న సామ్రాజ్యవాద దుర్మార్గాన్ని వీరు అర్థం చేసుకోవాలి. దానికి వ్యతిరేకంగా పోరాడాలి. అది ఆధారపడుతూ, కాపాడుతున్న భూస్వామ్యానికీ, పితృస్వామ్యానికీ వ్యతిరేకంగానూ పోరాడాలి. అప్పుడే ఈ కుహనా ప్రేమను సమాజం నుండి తుడిచెయ్యగలం. యువతను చోదకశక్తులుగా నిలుపుకోగలం. అంతేకాదు నిజమైన ప్రేమనూ కాపాడుకోగలం.

★

# వరికి మద్దతు ధరను ఇవ్వాలి

ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో వరి మద్దతు ధర సమస్య చురుకైన ఆందోళనా రూపం తీసుకుంది. ఇది అసహజమైనదేమీ కాదు, అసాధారణమైనదీ కాదు.

మనది వ్యవసాయ దేశం. 70 శాతం ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడుతున్న దేశం. ఇంత శాతం ప్రజలు ఆధారపడుతున్న వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వాలు ఘోర నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. అందులో భాగంగానే వ్యవసాయ ఉత్పాదితాలకు గిట్టుబాటు ధరను ప్రకటించడంలో కూడా రైతాంగపు ప్రయోజనాలను కాలరాస్తున్నాయి. ఫలితంగా రైతాంగం మిగితా అన్ని వ్యవసాయిక సమస్యలతో పాటు గిట్టుబాటు ధరల కోసం కూడా తరచూ పోరుబాట పడుతోంది.

అందులో భాగంగానే వరిని పండించే రైతులు  వరి గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధరను కల్పించని ప్రభుత్వాలు వరి పట్ల మరింత నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయి. దక్షిణ భారత ప్రజల ప్రధాన ఆహార పంటగా వరికి చాలా ప్రాధాన్యత వుంది. కాబట్టి ఇక్కడ వరే ప్రధాన పంట. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వరి ప్రధాన పంటగా ఉంది. రాష్ట్రంలో మొత్తంగా 81 లక్షల హెక్టార్ల భూమి సాగవుతుంటే 25 లక్షల హెక్టార్లలో అంటే దాదాపు మూడోవంతు వరి సాగవుతోంది. అలాగే 37 లక్షల హెక్టార్ల భూమి రబీలో సాగవుతుంటే దీనిలోని 11 లక్షల హెక్టార్ల భూమిలో వరి సాగవుతోంది.దాదాపు 20 లక్షల కుటుంబాలు వరి పంట మీదనే ఆధారపడుతున్నాయని ఒక అంచనా.

ఇన్ని లక్షల కుటుంబాలు వరిసాగుపై ఆధారపడుతున్నందున వరికి గిట్టుబాటు ధరను కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. కానీ ప్రభుత్వాలకు శాస్త్రీయమైన ధరల నిర్ణాయక విధానమే లేదు. ఏ సరుకు ధర నిర్ణయంలోనైనా ఉత్పత్తి దారులకు ప్రమేయం ఉండాలి. ప్రస్తుతం పెట్టుబడిదారులకు వారి ఉత్పత్తులపై పూర్తి నిర్ణయాధికారం ఉంటోంది. కానీ రైతులకు మాత్రం వారి వుత్పత్తులపై నిర్ణయాధికారం కాదు కదా, కనీసం ప్రమేయం కూడా ఉండడం లేదు. ఇది ధరల నిర్ణాయక విధానంలోని ప్రధానలోపం. ఏ సరుకుకైనా ఆ సరుకు ఉత్పత్తికి అయ్యే ఖర్చును బట్టే అంటే పెట్టుబడి, శ్రమను బట్టి ధర నిర్ణయించాలి. వ్యవసాయ ఉత్పత్తులకు కూడా ధరలను ఇలాగే నిర్ణయించాలి. ఉత్పాదక ఖర్చుకు 50 శాతం అదనంగా చేర్చి వ్యవసాయ ఉత్పత్తులకు ధరను నిర్ణయించాలని స్వామినాథన్ కమీషన్ చెప్పింది. అంటే ఒక బస్తా ధాన్యం పండించడానికి 100 రూపాయలు ఖర్చయితే, దాని ధర 150 రూపాయలు ఉండాలి. కానీ ఈ కమీషన్ సూచనను ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. గత పదేళ్లుగా ప్రభుత్వాలు వరి ధరను ఘోరంగా నిర్ణయిస్తున్నాయి.

ఇలా గిట్టుబాటు ధరలు లభించని కారణంగా పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాక, రైతాంగం అప్పుల విషవలయంలో చిక్కుకోవడం,ఆత్మహత్యలకు పాల్పడ్డం నేడు నడుస్తోన్న చరిత్రే. పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి కౌలు రైతులకు మరింత విషమంగా దాపురిస్తుంది.

ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ధరల నిర్ణాయక విధానం ఎంత అసంబద్ధంగా ఉందంటే, ఈ సంవత్సరం క్వింటాల్ గోధుమకు వెయ్యి రూపాయల ధర నిర్ణయించింది. వరికి మాత్రం మొదటి రకానికి 675 రూపాయలు, సాధారణ రకానికి 645 రూపాయలు నిర్ణయించింది. వరి ధరలకు అదనంగా 50 రూపాయలు  బోనస్ ప్రకటించింది. గోధుమకు వెయ్యి రూపాయలు నిర్ణయించడం స్వాగతించాల్సిన విషయమే. కానీ అదే సమయంలో వరి మీద చూపిస్తున్న వివక్షను ప్రశ్నించాలి. ఎందుకంటే గోధుమ కంటే వరికి ఉత్పాదక ఖర్చు ఎక్కువ. దిగుబడిలో మాత్రం పెద్ద తేడా ఉండదు. అటువంటప్పుడు గోధుమ కంటే వరికి ధర తక్కువగా ఉండడం అన్యాయం. క్రమంగా వరి గోధుమల ధరల్లో అంతరం తీవ్రంగా పెరుగుతోంది.

గత కొన్ని సంవత్సరాలుగా గోధుమను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది కనుక దిగుబడిని పెంచడం కోసం గోధుమకు ఎక్కువ ధరను నిర్ణయించినట్టు ప్రభుత్వం సమర్థించుకుంటోంది. కానీ వరి ధరల పట్ల చూపుతున్న ఈ వివక్ష వరిసాగును నిరుత్సాహపరుస్తుంది. బియ్యం దిగుమతి చేస్కోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఇప్పటికే బియ్యంతో సహా పలు ఆహార ధాన్యాలను అవసరంగా, అనవసరంగా (సామ్రాజ్యవాద షరతులకు లోబడి) దిగుమతి చేసుకుంటోన్న చరిత్ర మన పాలకులకేమీ కొత్త కాదు. అంటే వరి గిట్టుబాటు ధర అనేది కేవలం వరి పండించే రైతుల సమస్య మాత్రమే కాదు. దక్షిణాది రాష్ట్ర ప్రజల ఆహార భద్రత సమస్యగా ఇది పరిణమిస్తుంది.

ధరలను నిర్ణయించడంలో ప్రాంతాల వారీ రాజకీయ లాబీలు, వత్తిడిలు కూడా పనిచేస్తున్నాయి. గోధుమ ధరను వెయ్యికి పెంచడంలో ఉత్తరాది లాబీ వత్తిడి పనిచేసిందనే వాదనలు వస్తున్నాయి. రైతుల ప్రయోజనాలు, దేశ ఆహార భద్రత లక్ష్యంగా ఉండాల్సిన ధరలను, కేవలం రాజకీయ లాభనష్టాల బేరీజులే నిర్ణయించడం ప్రజాస్వామ్య దుస్థితిని తెలియజేస్తోంది.

ధరల నిర్ణాయక విధానంలోని అసంబద్ధత గురించి ఇంకొంచెం

మాట్లాడుకోవాలంటే వ్యవసాయోత్పత్తులకు ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే ధరను నిర్ణయిస్తున్నది. కానీ ఉత్పాదక ఖర్చు అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా ఉండడంలేదు. వర్షపాతం, నీటివసతి, భూసారం వంటి వాతావరణ, భౌగోళిక పరిస్థితులు ఉత్పాదక ఖర్చును ప్రభావితం చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉత్పాదక ఖర్చు కొన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రధానంగా కాలువల కింద వ్యవసాయం సాగుతున్న కోస్తా జిల్లాలతో పోలిస్తే బావుల, బోర్ల మీద ఆధారపడుతున్న తెలంగాణలో ఉత్పాదక ఖర్చు ఎక్కువ. అతి తక్కువ వర్షపాతమున్న రాయలసీమలో మరింత ఎక్కువ. ఉత్పాదక ఖర్చును లెక్కలోకి తీసుకోకుండా, అన్ని ప్రాంతాలకు ఒకే ధరను నిర్ణయించడం వల్ల రైతాంగం అన్యాయానికి గురవుతున్నది.

దేశంలోని 11 రాష్ట్రాల్లో వరి ప్రధాన ఆహార పంటగా ఉన్నందువల్లా, వరిసాగు కొన్ని కోట్ల ప్రజలకు ప్రధాన జీవనోపాధిగా ఉన్నందువల్లా వరిసాగుపై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాల్సి వుంది, ప్రోత్సహించాల్సి వుంది. కానీ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు దాసోహం అంటోన్న ప్రభుత్వాలు వాణిజ్యపంటలను ప్రోత్సహిస్తూ ఆహారపంటలను నిరుత్సాహపరుస్తున్నాయి. అంతేకాదు వరిపంటకు సమృద్ధిగా నీటి వసతి అవసరం. కానీ ప్రభుత్వాలు వ్యవసాయానికి అవసరమైన నీటి ప్రాజెక్టులను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. బావుల మీద, బోర్ల మీద ఆధారపడి వ్యవసాయం చేయాలనుకున్నా అవసరమైనంత విద్యుత్‌ను సరఫరా చేయలేకపోతున్నాయి. ప్రభుత్వపు ఈ అసమర్థతను కప్పిపుచ్చుకోవడం కోసం కూడా అది వరి పంటను నిరుత్సాహపరుస్తోంది. ఈ సంవత్సరం కూడా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి రైతులకు రెండవ పంటగా వరిని వేయవద్దని చెప్పాడు. ఇలా వరిని నిరుత్సాహపర్చడంలో భాగంగా కూడా దానికి గిట్టుబాటు ధరలను కల్పించడంలేదు.

ఇలా ప్రభుత్వ విధానాల వల్ల రోజు రోజుకూ వరి రైతులు నష్టపోతూనే ఉన్నారు. కానీ మధ్య దళారీలు, వ్యాపారులూ, బియ్యం ఎగుమతి చేసే విదేశీ కంపెనీదారులు మాత్రం విపరీతంగా లాభాలు గడిస్తున్నారు. వ్యాపారుల లాభాపేక్షనుంచీ మోసాలనుంచీ రక్షించాలనే ఉద్దేశంతో భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా-ఎఫ్.సి.ఐ.) రైతుల దగ్గర నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేసేది. కానీ ప్రయివేటీకరణ నేపథ్యంలో ప్రభుత్వం ఎఫ్.సి.ఐ.ని నిర్వీర్యం చేసింది. ఫలితంగా రైతులు లాభాపేక్షే ధ్యేయంగా ఉండే ప్రయివేటు వ్యాపారులకూ, సంస్థలకూ తమ ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. రైతుల దగ్గర సాధ్యమైనంత చౌకగా ధాన్యాన్ని కొని ఈ వ్యాపారులు విపరీతంగా లాభాలు గడిస్తున్నారు. అందుకే వరి ధర మార్కెట్లో చౌకగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం మండిపోతున్నాయి. అంటే ఇటు వినియోగదారులూ నష్టపోతున్నారు. అటు రైతులు ఏకకాలంలో ఉత్పత్తిదారులుగానూ, వినియోగదారులుగానూ కూడా ఉంటారు కాబట్టి వారు మరింత నష్టపోతున్నారు.

తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను పొందని రైతులు వ్యవసాయానికి అవసరమైన విత్తనాలూ, పురుగుమందులూ, ఎరువులను మాత్రం అధిక ధరలు చెల్లించి కొనాల్సివస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుంది. వ్యవసాయక దేశంలో ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముకగా ఉంటుంది. కనుక వ్యవసాయ సంక్షోభం దేశ ఆర్థిక వ్యవస్థను క్షీణింప చేస్తుంది. వరి ప్రధాన పంటగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగే ఆర్థిక వ్యవస్థకు ఆలంబనగా ఉంటుంది. వరి మీద ప్రభుత్వాలు చూపుతున్న చిన్నచూపు వల్ల రైతాంగం వరిసాగుకు దూరమైతే కూడా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఆహార సంక్షోభమూ తలెత్తుతుంది.

కనుక దేశంలో వ్యవసాయానికీ, అందులోనూ వరి, గోధుమ వంటి ప్రధాన ఆహార పంటలకు ప్రాధాన్యతా, ప్రోత్సహమూ ఉండాలి.

కానీ ప్రజల, రైతుల ప్రయోజనాల కోసం కాకుండా కేవలం దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసమే ఉనికిలో ఉంటోన్న ప్రభుత్వాలనుండి ఇటువంటి ప్రోత్సాహాన్ని ఆశించలేం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతాంగ ప్రయోజనాలను బలి పెడుతున్నాయి. ఇప్పుడు వరికి వెయ్యి రూపాయలు ధర పెంచాలని గగ్గోలు పెడుతున్న చంద్రబాబు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు.ఫలితంగా అతని పాలనలోనే రైతుల ఆత్మహత్యల పరంపర మొదలైంది. తన పాలనలో రైతులను ఆత్మహత్యల బాట పట్టించి, ఇప్పుడు రైతు బాంధవుడిలా ఫోజు పెట్టడం తిరిగి అధికారంలోకి రావడంకోసమే. కనుక రైతాంగం ఈ బూర్జువా పార్టీల అవకాశవాదాన్ని ఎండగట్టాలి.

గిట్టుబాటు ధరల సమస్యనే కాదు, సరిపడా భూమి లేక, సాగునీరు లేక, విద్యుత్ అందక, సబ్సిడీలు దొరక్క అప్పులూ, అధిక వడ్డీల భారం పెరిగిపోయి, సమస్యలతో సతమతమవుతున్న రైతాంగం నిస్పృహకు గురికాకుండా, ఆత్మహత్యల గురించి ఆలోచించకుండా పోరుబాట పట్టాలి. తమ పోరాటాన్ని కేవలం తాత్కాలిక సమస్యల పరిష్కారానికే పరిమితం చేయకూడదు. సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే ఈ సమస్యలకు కారణమైన భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదాలను ఓడించి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలనే లక్ష్యంతో దేశంలో రైతాంగం ఇతర విప్లవకర వర్గాలతో కలిసి సాయుధ పోరు చేస్తోంది. ఈ పోరులో సమస్యలతో సతమతమౌతున్న సమస్త రైతాంగము విస్తృతంగా భాగస్వాములు కావాలి. అంతేకాదు రైతాంగ సమస్య మొత్తం దేశ సమస్యగా గుర్తించి ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ రైతాంగపోరాటాల్లో భాగం కావాలి, బలమైన మద్దతును ఇవ్వాలి.

★

# అమరవీరులను స్మరించుకుందాం

## అమిడేలు అమరవీరులకు అరుణారుణ జోహార్లు!

ఎ.ఒ.బి జోన్‌లోని విశాఖ జిల్లాలో ప్రస్తుతం నడుస్తోన్న బాక్సైట్ ఉద్యమం సామ్రాజ్యవాదులకూ, దాని కాపలా కుక్కలైన భారత పాలకవర్గాలకు కంట్లో నలుసుగా మారింది. అందుకే ఆ ఉద్యమాన్ని అణచడానికి, దానికి నాయకత్వం వహిస్తోన్న మావోయిస్టు పార్టీపై, మావోయిస్టు పార్టీతో కల్సి చురుగ్గా ఉద్యమిస్తోన్న ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. అందులో భాగంగానే వాకపల్లిలో మహిళలపై గ్రేహౌండ్స్ బలగాలు అత్యాచారానికి పాల్పడ్డాయి. ఈ అత్యాచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వ పాశవికతను ఎత్తిచూపుతూ మద్దతుగా విశాఖ జిల్లాలో పెదబయలు దళం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా సెప్టెంబర్ 26వ తేదీన అమిడేలు గ్రామం వెళ్లినపుడు దళంపై గ్రేహౌండ్స్ బలగాలు చేసిన మూకుమ్మడి దాడిలో కామ్రేడ్స్ విజయ, షకీల, శ్వేత, చంటిబాబులు అమరులయ్యారు. మరో ఇద్దరు కామ్రేడ్స్ వీరోచితంగా ప్రతిఘటిస్తూ తప్పుకున్నారు. నేలతల్లి విముక్తి కోసం తమ నులివెచ్చని నెత్తుటిని ధారపోసిన ఈ నల్గురి కామ్రేడ్స్‌కు వినమ్ర జోహార్లు అర్పిద్దాం.

## కామ్రేడ్ జర్తా వెంకటలక్ష్మి (విజయ)

తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం మండలంలోని దద్దిలికివాడ కా. విజయం (25) స్వగ్రామం. స్థానిక ఆదివాసీ కొండరెడ్డి తెగలో పుట్టిన కామ్రేడ్ విజయకు తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకటలక్ష్మి.



ఆమెకు ఒక చెల్లీ, తమ్ముడు వున్నారు. విజయ మూడవ తరగతి చదువుతుండగా ఆమె తండ్రి చనిపోయాడు. ఆ తర్వాత తల్లి రెండవ వివాహం చేసుకుంది. పితృస్వామ్య సమాజంలో రెండవ వివాహం చేసుకున్న మహిళకు పిల్లల మీద ఏ హక్కూ వుండదు. ఆదివాసీ సమాజమూ దీనికి అతీతం కాదు. తల్లి పెళ్లి చేసుకొని మరో ఇంటికి వెళ్లి పోవడంతో ముసలి నాయనమ్మ దగ్గర వుంటూ తమ్ముడి, చెల్లెలి బాధ్యతను కా. విజయ నెత్తిన వేసుకుంది. కష్టపడి పని చేస్తూ, కూలీ నాలికి వెళ్తూ, వ్యవసాయంలోని మెళకువలన్నీ నేర్చుకుంది.

ఊహ తెలిసినప్పటి నుండీ కష్టాలనూ, బాధలనే అనుభవించిన విజయకు ఓదార్పునిచ్చింది పాట ఒక్కటే. ఊహ తెల్సినప్పటి నుండీ విజయ పాటంటే పడి చచ్చేది. ఆదివాసీ జానపదాలు, సినిమా పాటలు, గ్రామంలో క్రీస్తు మందిరంలో వినిపించే పాటలూ అన్నింటినీ విజయ అలవోకగా పాడేది. త్వరలోనే పాట లేకుండా విజయ వుండలేదని గ్రామమంతా అర్థమయింది. తమ కష్టాలను కడతేర్చడానికి యేసుక్రీస్తు వస్తాడని నమ్మి, యేసు మందిరానికి వెళ్లి భక్తి పారవశ్యంతో విజయ పాడే పాటలకు అక్కడ చేరుకున్న వారంతా పారవశ్యంలో మునిగిపోయేవారు. ఏ పాటైనా ఆమె గొంతులో ఇట్టే ఒదిగిపోయేది. ఆమె క్రమంగా పాటకు అభినయాన్ని జోడించింది. అలా ఆమె ఒక సహజ కళాకారిణిగా రూపాంతరం చెందింది.

అలా పాట ద్వారా తన బాధలకు ఉపశమనాన్ని పొందుతున్న విజయకు ఒకరోజు ఆమె అంతవరకు విని వుండని కొత్త పాట పరిచయం అయింది. వాళ్ల వూరికి వచ్చిన సాయుధ దళం పాడిన పాటలు ఆమెకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి. దళం తిరిగి వెళ్లిపోయింది కానీ వాళ్లు పాడిన పాటలు విజయను వీడిపోలేదు. ఆమె గొంతు నుంచి అవి గల గలా ప్రవహించేవి. పాటలనే కాదు ఆ పాటలు మోసుకొచ్చిన రాజకీయాలనూ ఆమె ప్రేమించింది. ఫలితంగా మహిళా సంఘంలో చేరింది. త్వరలోనే చురుకైన కార్యకర్తగా ఎదిగింది. గ్రామ పెత్తందార్లను ధైర్యంగా ఎదిరించింది. ఈ క్రమంలో 1999లో పూర్తి కాలం కార్యకర్తగా తన జీవితాన్ని మలుచుకుంది.

పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయిన వెంటనే ఈ గానకోకిలను, ఈ సహజ కళాకారిణిని పార్టీ జననాట్య మండలి(జె.ఎన్.ఎం) దళంలో సభ్యురాలిని చేసింది. జె.ఎన్.ఎంలో భాగం కావడం వల్ల విజయలోని సహజ కళకు మెరుగుపెట్టినట్టయింది. అలాగే జె.ఎన్.ఎంకూ ఆమె రాక బంగారంకు వాసన తోడైనట్లయింది. విజయ ఒక బాణీల పుట్ట. ఎన్నో వైవిధ్యభరితమైన బాణీలను జె.ఎన్.ఎం కళాకారులకూ, పాటల రచయితలకు పరిచయం చేసి ఎన్నో వైవిధ్యభరితమైన పాటలు వెలువడడానికి దోహదం చేసింది. ఆమె చెప్పిన బాణీని తీసుకొని అమరుడు కామ్రేడ్ బి.కె, కా. మహేష్ (కొయ్యూరు అమరుడు) గురించి 'సందమామ, సందమామ' అనే పాట రాశాడు. ఈ పాట విజయ గొంతు నుంచి హృద్యంగా జాలువారేది.

2001లో కామ్రేడ్ విజయ తనతోపాటు పని చేసే జె.ఎన్.ఎం కళాకారుడిని జీవిత సహచరుడిగా స్వీకరించింది. వాళ్లిద్దరి జంట మరెన్నో హృద్యమైన పాటలకు ఊపిరి పోసింది. అమరుడు కామ్రేడ్ కౌముది స్మృతిలో ఆమె సహచరుడు రాసిన "పండు వెన్నెల నిచ్చే ఓ చందమామ" పాటకు బాణీని సమకూర్చినది విజయనే. ఆ పాటను విజయ గొంతు నుంచి ఒకసారి వింటే ఇక ఎన్నటికీ మర్చిపోలేరు. తనకు రాని ఆదివాసీ భాషలు నేర్చుకుని మాతృభాషలో పాడినంత సహజంగా వాటిని పాడేది. ఇలా విజయగొంతు గురించి చెప్పుకోవాలంటే ఎంతైనా చెప్పుకోవచ్చు. అంత అరుదైన, అద్భుతమైన

స్వరం ఆమెది. పాటలు పాడ్డంతోనే ఆమె పరిమితం కాలేదు. ఆమె స్వయంగా కొన్ని పాటలు కూడా రాసింది.

పాటను శక్తివంతమైన ఆయుధంగా చేసుకున్న ఆమె తన వంటి కళాకారులను తయారుచేసే కృషిలో చురుకైన భాగస్వామి అయింది. తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ శ్రీకాకుళం జిల్లాలో జె.ఎన్.ఎం దళానికి కమాండర్ బాధ్యతలను చేపట్టింది. తన కృషిలో భాగంగా తూర్పు గోదావరి, విశాఖ, కోరాపుట్, విజయనగరం, శ్రీకాకుళం, రాయగఢ, గజపతి, మల్కన్‌గిరి జిల్లాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజల సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. కొన్నాళ్ళ దేరువాడ దళానికి కమాండర్ బాధ్యతలను నిర్వహించింది. ఆ తర్వాత మల్కన్‌గిరి జిల్లా ఉద్యమంలో భాగమయింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అడ్డుకట్ట వేస్తున్న బాక్సైట్ ఉద్యమంలోనూ భాగస్వామి అయింది. అందులో భాగంగా వాకపల్లి అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించే కృషిలో నిమగ్నమై ఉండగా గ్రేహౌండ్స్ దాడికి గురై అమరురాలైంది. కా. విజయ భౌతికంగా మనకు దూరమైనప్పటికీ ఆమె గొంతు నుంచి జలపాతమై దూకిన పాటలు ప్రవహిస్తూనే వుంటాయి. ఆ ప్రవాహంలో దోపిడీ కోటలు పునాదులతో సహా గల్లంతవుతాయి.

కా. విజయ ఆశయంతో కళకు మరింత పదును పెడుదాం.

## కామ్రేడ్ నాగమణి (షకీల)

విశాఖ జిల్లా జి.కె వీధి మండలం రింతాడ పంచాయితీ ముల్లుమెట్ట గ్రామంలో ఒక నిరుపేద ఆదివాసీ రైతు కుటుంబంలో కా. షకీల (22) పుట్టింది. తల్లిదండ్రులు ఆమెకు పెట్టుకున్న పేరు నాగమణి. నిరుపేదలే అయినా వారు బిడ్డను కష్టపడి చదివించారు. చదువులో చురుగ్గా వుంటూ షకీల 10వ తరగతి వరకూ జి.కె వీధి సాంఘీక సంక్షేమ హాస్టల్లో వుంటూ చదివింది. ఈ క్రమంలోనే రాడికల్ విద్యార్థి సంఘం సభ్యురాలయి, విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేసింది. తన చైతన్యాన్ని మరింత పెంచుకుని 2002లో పూర్తికాలం కార్యకర్తగా మారింది. మొదట మహిళా టీంలో పని చేసింది. తనకు అప్పగించిన పనిని అంకిత భావంతో చేసింది. సారా వ్యతిరేక పోరాటంలో కోరుకొండ ఏరియాలో మహిళలను కదిలించడంలో చురుకైన పాత్ర వహించింది. తను బాధ్యత వహించే మహిళా సంఘాలన్నీ క్రియాశీలకంగా పని చేసేలా కృషి చేసింది. ఈ క్రమంలో ఏరియా ప్రజల ముఖ్యంగా మహిళల విశ్వాసాన్ని చూరగొంటూ పార్టీ సభ్యురాలిగా, ఏరియా కమిటీ సభ్యురాలిగా ఎదిగింది.

కా. షకీల శారీరకంగా చాలా దృఢంగా వుండేది. కష్టపడి పనులు చేసేది. శారీరకంగానే కాక మానసికంగానూ చాలా దృఢంగా వుండేది. ఆ దృఢత్వం ఆమెను శత్రువుతో ధైర్యంగా పోరాడే యోధురాలిగా మలిచింది. ఎన్నో ఎన్‌కౌంటర్లలో ఆమె ధైర్యంగా, చురుగ్గా పోరాడింది. ఆమె మంచి పైలట్ కూడా. భౌగోళికంగా ఏరియాపై మంచి పట్టు సాధించిన ఆమె నిత్య నిర్బంధంలో దారుల్లో వెళ్లకుండా, ఏ దారీ లేని టెర్రయిన్‌లో దళాన్ని సమర్థవంతంగా నడిపించేది. టెక్నికల్ జాగ్రత్తల విషయాల్లోనూ కా. షకీల ఎంతో జాగ్రత్తగా వుండేది.

కా. షకీలకు పాటలంటే చాలా ఆసక్తి. ఆ ఆసక్తికి తగినట్టు చక్కని స్వరం ఆమె సొంతం. విద్యార్థి సంఘం, మహిళా సంఘం నిర్వహించిన పలు క్యాంపెయిన్లలో భావయుక్తంగా పాటలు పాడుతూ అందర్నీ ఆకట్టుకునేది. ఆమెలోని ఈ ప్రతిభ మూలంగా కొన్నాళ్ళ కొత్తగా ఏర్పడిన జె.ఎన్.ఎం చిన్న టీంకు బాధ్యురాలిగా బాధ్యతలు నిర్వహించింది.

కమ్యూనిస్టులకు ఉండాల్సిన సేవా దృక్పథం కా. షకీలలో అమితంగా ఉండేది. అందువల్ల కోరుకొండ దళంలో కొన్నాళ్ళ డాక్టర్‌గా పని చేసింది. డాక్టర్‌గా వుంటూ ఎంతో ఓపికగా ప్రజలకు వైద్యం చేసేది. ఈ క్రమంలో ప్రజల విశ్వాసాన్నీ, అభిమానాన్నీ చూరగొంది.

గ్రేహౌండ్స్ పోలీసుల దాడికి గురైన సమయంలో కా. షకీల మొహం కడుక్కుంటూ వుంది. శత్రు తూటాలు దూసుకువస్తూ వుంటే తన తుపాకీని అందుకోవడానికి ప్రయత్నించి విఫలమయింది. అలా మిగితా ముగ్గురు కామ్రేడ్స్‌తో పాటు అమరురాలయింది.

కా. షకీలలోని చొరవ, క్రియాశీలత, అంకితభావం, గుండెధైర్యాన్ని మనందరం స్వీకరించాలి. అట్లా ఆమె లేని లోటును తీర్చాలి.

## కామ్రేడ్ కుంబే రాజులమ్మ (శ్వేత)

విశాఖ జిల్లా జి.మాడుగుల మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఒక నిరుపేద ఆదివాసీ కుటుంబంలో శ్వేత (18) పుట్టింది. తల్లిదండ్రులు ఆమెకు పెట్టుకున్న పేరు రాములమ్మ. పేదరికం వల్ల ఆమె ఎన్నడూ బడి మొహం చూడలేదు. పదవ ఏటనే వెయ్యి రూపాయల ఓలి (కన్యాశుల్కం వంటిది) తీసుకుని ఆదివాసీ రీతి రివాజు ప్రకారం తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేశారు. ఫలితంగా చిన్న వయసులోనే ఆమెకు అత్తింటి ఆరళ్లు మొదలయ్యాయి. తిట్టినా కొట్టినా గత్యంతరం లేక కొన్నాళ్ళ పడివుంది. ఆ సమయంలో పార్టీ ఆ వూరికి పరిచయమయింది. దానితో అత్తింటి ఆరళ్లను మౌనంగా భరించాల్సిన అవసరం లేదని ఆమెకు అర్థమయింది. దళంతో తన బాధలు చెప్పుకోవాలని ఎంతగానో ఆరాటపడింది. దానికోసం ఇంటి నుండి పారిపోయి దళాన్ని వెతుక్కుంటూ వెళ్లింది. రెండు నెలలు తిరిగి దళాన్ని పట్టుకుని తను పడ్డ కష్టాలన్నీ చెప్పుకుంది. ఆ తర్వాత దళం ఎంత నచ్చచెప్పినా తిరిగి ఇంటికి వెళ్లడానికి ఒప్పుకోలేదు. దానితో దళం ఆమెను స్థానిక మహిళా సంఘంలో పని చేయమని చెప్పి క్యాంపెయిన్ బాధ్యతలను ఇచ్చింది. ఇలా క్రమంగా చైతన్యం పెంచుకుంటూ 2005లో పూర్తికాలం కార్యకర్తగా దళ జీవితంలోకి వచ్చింది.

ఆమె రిక్రూట్ అయిన కొద్దికాలానికే నిర్బంధం తీవ్రతరమైంది. శత్రు దాడులు పెరిగిపోయాయి. తనకు ఎదురుపడిన రెండు దాడుల్లో దళాన్ని అంటిపెట్టుకొని పోరాడింది.

కొద్దికాలంలోనే ఆమె దళంలో అందరికీ తలలో నాలుక అయింది. శ్రద్ధపెట్టి చదవడం, రాయడం నేర్చుకుంది. తనకు అప్పగించిన పనులను ఎంతో ఓపిగ్గా చేసేది.

ఈ క్రమంలో కా. శ్వేత సెప్టెంబర్ 26న పోలీసు దాడిలో చిక్కుకుని మిగితా ముగ్గురు కామ్రేడ్స్‌తో కల్సి అమరురాలయింది.

కామ్రేడ్ శ్వేత పట్టుదలను, పోరాట దీక్షను అలవర్చుకుందాం.

## కామ్రేడ్ చంటిబాబు (జీవన్)

కామ్రేడ్ జీవన్‌కు 16 సంవత్సరాల వయసు ఉంటుంది. పెదబయలు మండలం తూలం గ్రామంలో ఒక ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. కొక్కిరిపల్లి హాస్టల్ విద్యార్థిగా ఏడవ తరగతి చదువుతూ విద్యార్థి సమస్యల్లో చురుగ్గా పాల్గొనేవాడు. గ్రామంలో మిలీషియాలోనూ, అంతకు ముందు బాలల సంఘంలోను చురుగ్గా పనిచేశాడు. అతనిలోని చురుకుదనం, చిన్న తనంలోనే చంటిని అన్నీ పట్టించుకునేలా చేసింది. అది గ్రామం అయినా, స్కూలు అయినా, హాస్టలయినా ప్రతిదీ తన సంబంధంలోకి రావల్సిందే. దళం గ్రామానికి వెళ్లినా, ఆర్.ఎస్.యు. కామ్రేడ్ హాస్టలుకు వెళ్లినా తప్పనిసరి అక్కడ చంటి ఉంటాడు. ఆ చుట్టు పక్కల పోస్టర్లు వేయడం బ్యానర్లు కట్టడం, కరపత్రాలు పంచడం, కబుర్లు చేరవేయడం అన్నీ తన ప్రమేయంతోనే జరిగిపోతాయి.

హాస్టల్‌లో వసతి సరిగా లేకపోవడం, అనేక సమస్యలు ఉన్నా కొట్లాడినా ఫలితం లేకపోవడం, చదువు సరిగా చెప్పక పోవడం, తన కుటుంబ పరిస్థితి, ఆదివాసీ ప్రజల కడగండ్లు, బాక్సైట్ సమస్య గొప్ప మనస్సున్న చంటిబాబును కలవరపరిచాయి. ఏదో ఒకటి చెయ్యాలి చేతులు కట్టుకు కూర్చోకూడదనుకున్నాడు. దళంతో మాట్లాడాడు. దళం చదువుకుంటూ ఆర్.ఎస్.యు.లో పని చేయమన్నది. కానీ చంటి కాదు కూడదన్నాడు. మొండికేసి బలవంతంగా దళాన్ని ఒప్పించాడు. మిలీషియా శిక్షణకు వెళ్లాడు.

అమ్మా నాన్నలకు నచ్చజెప్పి దళంలో చేరాడు. వాకపల్లి సంఘటనను గ్రామ గ్రామానా ప్రచారం చేసినపుడు బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మిస్తున్నప్పుడు పెదబయలు మండలంలోని గ్రామాల్లో చురుకుగా పాల్గొన్నాడు పాటకు కోరసిస్తుంటే, పిల్లలకు రాజకీయాలు చెబుతుంటే అందరి దృష్టి చంటి మీదనే వుండేది.

సెప్టెంబర్ 26న అమిడేలులో పోలీసులు చుట్టు ముడితే కా.చంటి అదే ఊళ్లో వున్న వాళ్ల అక్కఇంట్లోకి వెళ్లి దాక్కున్నాడు. గ్రామంలో ప్రతి ఒక్కరిని భయపెట్టిన పోలీసులు, చంటిని నమ్మించి లొంగిపొమ్మన్నారు. లొంగి పోయిన చంటిని గంటల తరబడి చిత్రహింసలు పెట్టి మిగిలిన వారి ఆచూకీ కోసం హింసించి ఫలితం రాకపోవడంతో కాల్చి చంపారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని గ్రామస్తులు ముక్త కంఠంతో మాట్లాడారు. ప్రపంచం నమ్మింది. కానీ పోలీసుల కథనం షరా మామూలే.

ఆ బాల వీరుడి త్యాగం ఉన్నతమైనది. మనం కామ్రేడ్ చంటి ఆదర్శాన్ని ముందుకు తీసుకుపోదాం.

## కామ్రేడ్ మడకం పొజ్జి (జమున)

ఉత్తర తెలంగాణాలోని ఖమ్మం డివిజన్ శబరి ఏరియాలో తూర్పు గోదావరి జిల్లా టైగర్ క్యాంపు వద్ద డిసెంబర్ 21, 2007న గ్రేహౌండ్స్ బలగాలతో జరిగిన పోరులో శబరి దళ సభ్యులు కామ్రేడ్స్ జమున,సంగీతలు అమరులయ్యారు. కామ్రేడ్ జమున



దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్‌లో భాగంగా వున్న చిన్న కేడ్వాల్ గ్రామవాసి. కడుపేద ఆదివాసీ మడకం ఇంటిలో పుట్టిన కా. జమునకు తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు పొజ్జి. విప్లవ కుటుంబంలో పుట్టిన పొజ్జి చిన్ననాడే పార్టీ సంబంధాల్లోకి వచ్చింది. మొదట బాలల సంఘంలో, ఆ తర్వాత మహిళా సంఘంలో చురుకుగా పని చేస్తూ వచ్చింది. చిన్న తనంలోనే తన తల్లి చనిపోవడం, తన తోడబుట్టిన సోదరులు వివాహాలు చేసుకొని వేరుపడడంతో కుటుంబ పోషణాభారాన్ని కూడా పొజ్జి తన భుజాలపై వేసుకుంది. ఒకవైపు అటవీ ఉత్పత్తులను సేకరించి వారపు సంతలల్లో అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూనే మరొకవైపు విప్లవ కార్యక్రమాలను ఎంతో బాధ్యతాయుతంగా, చురుకుగా నిర్వహించేది. వ్యక్తిగత పనులకంటే సమిష్టి పనులకు ప్రాధాన్యతనిచ్చి చెరువులు పోయడం, వ్యవసాయం చేయడంలో పురుషులతో పోటీపడి చురుకుగా పని చేసేది. ఈ క్రమంలో తన 16వ ప్రాయంలోనే పూర్తికాలం విప్లవకారిణిగా 2004లో గెరిల్లా జీవితాన్ని ప్రారంభించింది.

మొదట దక్షిణ బస్తర్‌లోని కిష్టారం దళంలో కొద్ది నెలలు దళ సభ్యురాలిగా పని చేసింది. అటు పిమ్మట పార్టీ నిర్ణయానుసారం కార్మికవర్గ అంతర్జాతీయతత్వాన్ని అలవర్చుకొని తాను పుట్టిన ఏరియాను, జిల్లాను, రాష్ట్రాన్ని సైతం వదిలిపెట్టి తనకు భాషరాని ప్రాంతమైన ఖమ్మం జిల్లాలో 2004లోనే అడుగుపెట్టింది. 2004లో ఖమ్మం జిల్లాలోని శబరి ప్రాంతంలో అడుగుపెట్టిన కామ్రేడ్ పొజ్జి జమున పేరుతో జిల్లా ప్రజలకు పరిచయం అయి తన చివరి రక్తపుబొట్టు రాలే వరకూ పని చేసింది.

దళంలో సైతం చురుకుగా వుంటూ సమిష్టి పనులను బాధ్యతాయుతంగా చేసేది. తనకు రాని తెలుగు భాషను పట్టుదలతో ఒక సంవత్సరంలోనే చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకుంది. అంతేకాదు త్వరలోనే టీచర్‌గా మారి తోటి దళ సభ్యులకు తెలుగు భాషను బోధించింది. ఇంకోవైపు ఇంజక్షన్లు వేయడం నేర్చుకొని, మందులను తెలుసుకుంటూ దళం డాక్టర్‌గా సైతం బాధ్యతలు నిర్వహించేది.

కా. జమున గ్రామాల్లోకి పోయిందంటే గల గల మాటలతో ప్రజల్లో వెంటనే కలిసిపోయేది. ఒక్కసారి కా. జమునను చూసిన ప్రజలు ఇట్టే గుర్తుపెట్టుకునేవారు. తమ వ్యక్తిగత బాధలను సైతం చెప్పుకునేవారు. తనకు తెలిసిన విప్లవ రాజకీయాలను ప్రజలకు బోధిస్తూ వారు సంఘాల్లో సమీకృతం కావడానికి కృషి సల్పింది.

ప్రజలంటే ప్రాణంగా భావించే కా. జమున, శత్రువంటే తీవ్రమైన వర్గకసిని ప్రదర్శించేది. శత్రువును సంహరించడానికై మిలటరీ మెళకువలు నేర్చుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేది. కాలు నొప్పి వున్నప్పటికీ దానిని లెక్కచేయకుండా 2007లో నిర్వహించిన జిల్లా మిలటరీ క్యాంపులో ఒక్కరోజు కూడా తప్పకుండా పాల్గొంది. నేర్చుకున్న మిలటరీ మెళకువలను ప్రతిరోజూ దళంలో ప్రాక్టీసు చేసేది. ఇలా ఆర్గనైజేషనల్‌గా, మిలటరీపరంగా చురుకుదనం, పట్టుదల కలిగిన జమున 2006లో పార్టీ సభ్యత్వం పొందింది.

పట్టుదల, సాహసాలతో, బాధ్యతాయుతంగా వుంటూ మంచి నాయకురాలిగా ఎదిగే లక్షణాలు కలిగిన కామ్రేడ్ జమున అమరురాలు కావడం ఇప్పుడున్న స్థితిలో జిల్లా ఉద్యమానికి నష్టమే. కా. జమునలోని అంతర్జాతీయతత్వాన్ని, పట్టుదలను, సాహసాన్ని పెంపొందించుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఈ దోపిడీ రాజ్యాన్ని నిర్మూలించి సమతారాజ్యాన్ని స్థాపించడమే ఆ కామ్రేడ్‌కు మనమర్పించే నిజమైన నివాళి.

## కామ్రేడ్ కల్మ బండి (సంగీత)



ఖమ్మం జిల్లా చింతూర్ మండలం అల్లివాగు గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో కా. బండి సుమారు 18 సంవత్సరాల క్రితం జన్మించింది. పేదరికం వల్ల చదువుకోలేకపోయింది. వుద్యమ ప్రాంతంలోని గ్రామం అయినందున చిన్నప్పటి నుండే దళం గ్రామానికి పోయినప్పుడల్లా ఎంతో వుత్సాహంగా పరుగు పరుగున వచ్చి పార్టీని కలిసేది. గ్రామంలో దళం వున్నన్ని రోజులు దళంతోనే వుంటూ అన్ని సమిష్టి పనులల్లో చురుకుగా పాల్గొనేది. కా. బండి పెరిగి పెద్ద వయస్సు వచ్చిన తర్వాత 2004లో గ్రామంలో మహిళా సంఘంలో చేరి చురుకుగా పని చేసింది. ఇలా పనిచేసే క్రమంలో పార్టీ చెప్పే రాజకీయాలను అవగాహన చేసుకుంటూ తన చైతన్యాన్ని పెంపొందించుకొని 2007లో విప్లవోద్యమంలో పూర్తికాలపు కార్యకర్తగా అడుగుపెట్టింది. నాటి నుండి శబరి దళంలోనే కా. సంగీత పేరుతో పని చేస్తూ వచ్చింది. దళంలో నిరంతరం ఉత్సాహంగా వుంటూ సమిష్టి పనుల్లో చురుగ్గా పాల్గొనేది. ఎక్సర్‌సైజ్ చేయడం పట్ల ఆసక్తిని ప్రదర్శించేది. కా. సంగీత విప్లవోద్యమంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి కాకముందే డిసెంబర్ 21, 2007న టైగర్ క్యాంపు వద్ద శత్రువుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా. జమునతోపాటు అమరురాలైంది.

## కామ్రేడ్ సోయం రంగయ్య (శివ)

ముక్కుపచ్చలారని కా. శివను విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారం ఆధారంగా అరెస్టు చేసిన పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేసారు.

ఖమ్మం జిల్లా ములకలపల్లి మండలం పగడాలనగర్ గ్రామంలో 16 సంవత్సరాల క్రితం పేద ఆదివాసీ కుటుంబంలో కా. శివ పుట్టాడు. చిన్న తనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో తన మేనమామ వద్ద పెరుగుతూ వచ్చాడు. పిన్న వయస్సు నుండే కూలీ, నాలీ పనులు చేస్తూ గ్రామస్తులందరితో మర్యాదగా మాట్లాడుతూ వారి ఆదరాభిమానాలు చూరగొన్నాడు. మేకలను కూడా కాసేవాడు. ఈ క్రమంలో దళానికి పరిచయం అయినాడు. పరిచయం అయిన కొద్ది రోజుల్లోనే దళం అప్పగించిన పనులను నిర్వహిస్తూ వచ్చాడు. పార్టీ చెప్పే రాజకీయాలను శ్రద్ధగా వింటూ, తమ గ్రామంలోని మితవాద అవకాశవాద పార్టీ అయిన సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాజకీయాలను అసహ్యించుకుంటూ విప్లవ రాజకీయాలను ప్రచారం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కా. శివను అనేకసార్లు బెదిరించారు. అయినప్పటికీ వాటన్నింటిని ప్రతిఘటిస్తూ 2007 మే నెలలో పూర్తికాలం విప్లవకారునిగా మారాడు. అప్పటి నుండీ అశ్వరావుపేట ఏరియాలోని కుకునూర్ ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పని చేస్తూ వచ్చాడు. ఒకవైపు పోలీసుల నిరంతర కూంబింగ్స్ మరోవైపు న్యూడెమోక్రసీ పార్టీ బెదిరింపుల మధ్య తిరుగుతూ పని చేసాడు. దళం కలిసినప్పుడు ఉత్సాహంగా వుంటూ చదువు నేర్చుకోవడం, మిలటరీ మెళకువలు నేర్చుకోవడంపై శ్రద్ధ పెట్టేవాడు. సమిష్టి పనులు చేయడంలో ముందుండేవాడు.

ఈ క్రమంలో కుకునూర్ మండలం లంక గ్రామంలో నిద్రపోతున్న కామ్రేడ్ శివను విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2007, నవంబర్ 20వ తేదీ రాత్రి అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి 21వ తేదీ వుదయం పోలీసులు ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చారు. నూతనంగా విస్తరిస్తున్న అశ్వరావుపేట ఏరియా విప్లవోద్యమంలో తొలి అమరునిగా చరిత్రకెక్కిన కా. శివకు విప్లవజోహార్లు తెల్పుదాం. ★

# కమ్ముకుంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యుద్ధమేఘాలు, పెరుగుతున్న రాజ్యహింస

అమెరికాలో గృహ, భవన నిర్మాణ వ్యాపార రంగం (మన దేశంలో వాడుకలో ఉన్న రియల్ ఎస్టేట్ రంగం) గాలిబుడగలా బద్దలైన తర్వాత సబ్-ప్రైమ్ తాకట్టు సంక్షోభం సంభవించి అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో పడిపోయింది. ఈ పరిస్థితి నుండి బయటపడడానికి, ఇతర దేశాలను అనేక రకాలుగా బెదిరిస్తూ యుద్ధానికి కాలుదువ్వుతూ వాటిని మరింత దోచుకోవడానికి అమెరికా మరింత దౌర్జన్యంగా దూసుకువస్తోంది. ఇరాక్‌లో, ఆఫ్ఘనిస్థాన్‌లో పీకలదాక యుద్ధంలో కూరుకుపోయి ఉన్నా, ఇరాన్‌పై కూడా యుద్ధ ప్రకటనలతో బెదిరిస్తోంది. మయన్మార్ (పూర్వపు బర్మా దేశం)పై ఆంక్షలు విధించటానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇదే సమయంలో అమెరికాకు కావలికుక్కలా వ్యవహరించే ఇజ్రాయిల్ ప్రస్తుతం హమాస్ అధీనంలో ఉన్న పాలస్తీనాలోని గాజాపట్టీపై ఒకవంక దాడులను కొనసాగిస్తూనే, మరొకవంక సిరియా, లెబనాన్‌లను దురాక్రమణ యుద్ధ ప్రకటనలతో బెదిరిస్తోంది.

ఈ వ్యాసంలో మొదటిగా సంక్షోభపు తీవ్రతను స్థూలంగా పరికించి, కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలను, ప్రపంచ ప్రజానీకానికి కలగబోతున్న ఆపదలను, వాటి పరిష్కారం గురించి ప్రస్తావిద్దాం.

### ఆర్థిక సంక్షోభం

అమెరికాలో సబ్-ప్రైమ్ సంక్షోభం ఫలితంగా ఏర్పడిన ప్రపంచ రుణ సంకటం యొక్క దుష్ప్రభావం 2008వ సంవత్సరంలో ఎక్కువగా కనిపించగలదని, అమెరికా దీనికి ఎక్కువగా గురికాగలదని అంతర్జాతీయ ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ రోడ్రిగోరాటో 2007 సెప్టెంబర్ 24నాడు అన్నాడు. అమెరికాలో తీసుకున్న సబ్-ప్రైమ్ రుణాలు (అప్పులు తీర్చలేనివారికి ఇచ్చిన గృహ రుణాలు) అక్కడి బకాయిదారులు తిరిగి చెల్లించకపోవటం వల్ల ఏర్పడిన సంక్షోభానికి ఏ తక్షణ పరిష్కారమూ లేదన్నాడు. "బ్యాంకులు, కంపెనీలు, ప్రభుత్వాలపై ఈ సంక్షోభ ప్రభావం పూర్తిగా పడటానికి మరికొన్ని నెలలు పడుతుంది" అని కూడ అన్నాడు.

ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న నయా ఉదార పథకం వల్ల భారీ సంపద ఒక్క శాతం మంది చేతుల్లోకి తరలిపోయింది. ఆ ఒక్క శాతం మందిలో కూడా కేవలం పై వరసలో 10వ భాగంగా వున్నవారి చేతుల్లోకే పోయింది. ఇలా అన్ని దేశాల్లోనూ అత్యంత ధనికుల చేతుల్లోకి సంపద ఇంత భారీ స్థాయిలో తరలిపోవడం గతంలో చాల అరుదుగా జరిగేది. అంటే, దీని అంతరార్థం ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాలతో సహా అన్ని దేశాల్లోనూ దారిద్ర్యం అత్యంత అధికంగా పెరిగిపోతుండడమే! ఈ పరిస్థితి ప్రభావం మార్కెట్టు విస్తరణపై, ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్రంగా పడుతుంది.

అమెరికాలో కొనసాగుతున్న వర్తకలోటు, బడ్జెట్ లోటులతోపాటు అమెరికా డాలరు విలువ ఒక యూరోకు 1.4 డాలరుకు పడిపోయింది. గత 15 ఏళ్లలో ఇదే అత్యంత తక్కువ విలువ. గత నాలుగేళ్లలోని వుద్యోగస్థాయి 2007 ఆగస్టులో మొదటిసారి అత్యంత కిందిస్థాయికి దిగజారింది.

యూరపుకు కూడ అనేకానేక ఆర్థిక సమస్యలున్నాయి. మందకొడిగా ఉన్న పెరుగుదల రేట్లు అధిక ద్రవ్యోల్బణంతో మరింత మందగించాయి. 2.5 శాతంగా ఉంటుందనుకున్న ద్రవ్యోల్బణం 3.5 శాతానికి పెరిగింది. నిరుద్యోగ సమస్య నుండి బయటపడే అవకాశమే లేదు. నిరుద్యోగుల సంఖ్య రెండు కోట్లను మించిపోయింది. సబ్-ప్రైమ్ సంక్షోభం వల్ల రెండు బ్యాంకులు దాదాపు దివాళా తీసే స్థితివరకూ వచ్చాయి. డ్యూట్చ్ బ్యాంకు (జర్మనీ సెంట్రల్ బ్యాంకు)కు 2.4 బిలియన్ల (240 కోట్ల) అమెరికా డాలర్ల నష్టం కలిగిందని 2007 సెప్టెంబర్ 25నాటి వార్తాపత్రికలు రాశాయి. బ్రిటిష్ బ్యాంకులు కూడా ఘోరంగా దెబ్బతిన్నాయి. బార్‌క్లేస్ బ్యాంకు తన సబ్-ప్రైమ్ వినియోగదారుల యూనిట్‌ను నష్టానికి అమ్ముకుంది. నార్తరన్ రాక్ బ్యాంకుకు నష్టాల నుండి బయటపడటానికి 22 బిలియన్ల (2200 కోట్ల) అమెరికా డాలర్లు అవసరమయ్యాయి.

ఈ ఆర్థిక సమస్యలతోబాటు, యూరోపియన్ యూనియన్ (ఈ.యూ)లో ఐక్యత కూడ భంగపడే పరిస్థితి నెలకొంది. ఈ.యూ. కొత్తగా తయారుచేసుకున్న అధికార పత్రాన్ని (చార్టర్) ఖరారు చేసుకోవటం కోసం జరిగిన ఎన్నికల్లో ఫ్రాన్స్ దానికి వ్యతిరేకంగా ఓటువేయడంతో ఆ చార్టరు ఖరారు కాలేదు. ఈయూ ను నడిపే రెండు ఇంజన్ల వంటి ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో గత కొన్ని ఏళ్లలో రాజకీయ పొత్తులలో మార్పులు జరిగి, ఆ రెండు దేశాల్లోనూ అత్యంత మితవాద పక్షాల శక్తులు అధికారంలోకి వచ్చాయి. ఆ రెండు దేశాల అధినేతలు అమెరికా పట్ల మెతక వైఖరిని అవలంభిస్తూ అమెరికా యుద్ధకాంక్షకు వంతపాడుతున్నారు. ఈయూ అమెరికాకు ముఖ్యమైన పోటీదారు అయినప్పటికీ, అమెరికా ఆర్థికవ్యవస్థ దిగజారిపోయే పరిస్థితిలో ఈయూను అమెరికా తనతోబాటు నిలబెట్టుకుంటుందనేది వాస్తవం. అదీగాక, 1990ల్లో వలెకాక, ఈనాడు రష్యా, చైనాలు అమెరికాకే కాక యూరోపుకు కూడ పెద్ద పోటీదారులుగా ఎదుగుతున్నాయి.

1970ల నుండి ఆర్థికమాంద్యంకు మూలకారణాలను సవరించలేకపోవటం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థల్లో సంక్షోభాలు సంభవిస్తూనే ఉన్నాయి. (వాస్తవానికి, పెట్టుబడిదారీ చట్రంలో వీటిని సవరించటం అసాధ్యం). ఆర్థిక సర్దుబాటు వల్ల ఈ సంక్షోభాల నుండి తాత్కాలికంగా బయటపడగలుగుతున్నా సరికొత్త సంక్షోభాలు పుట్టుకొస్తున్నాయి. ప్రపంచీకరణ ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలపై పెద్దఎత్తున దాడి జరిగి కొన్ని పెద్ద కేంద్రాల్లో మాత్రమే హఠాత్ అభివృద్ధి (వికాసం) సృష్టించబడింది. (అయితే ఈ సమయంలోనే జపాన్, రష్యాలు, అర్జెంటీనా, టర్కీ వంటి అనేక మూడవ ప్రపంచ దేశాలు ముందెన్నడూ కనీవినీ ఎరుగనంత లోతైన ఆర్థిక పతనంలో కూరుకుపోయాయి). కొన్ని కేంద్రాల్లో మాత్రమే కనబడిన వికాసం కూడా కేవలం ఒక దశాబ్దం మేరకే మనగలిగి, గత శతాబ్ది (20వ శతాబ్దం) చివరలో ఆ గాలిబుడగ పేలిపోయింది.

అయితే, గత సంక్షోభాలకు, ప్రస్తుత సంక్షోభానికి తేడా ఉంది. 1980ల్లో, 1990ల్లో వెనుకబడ్డ దేశాలు సంక్షోభాలకు కేంద్ర బిందువులైతే, ఇప్పుడు అమెరికాయే ప్రస్తుత సంక్షోభానికి కేంద్ర బిందువయ్యింది. పైగా ఈ సంక్షోభం గత రెండు దశాబ్దాలుగా పెరుగుతూ ఉంది. 1990ల్లో అమెరికా ఆర్థికవ్యవస్థను నిలబెట్టి వుంచటం కోసం ఫెడరల్ రిజర్వు (అమెరికా సెంట్రల్ బ్యాంకు) చౌక డబ్బును ఒనగూర్చి అమెరికా చరిత్రలోనే అతి పెద్ద స్టాకు మార్కెటు వికాసం(బూమ్)ను సృష్టించడానికి దోహదపడింది. ఈ కృత్రిమాభివృద్ధి గాలిబుడగ 1990 చివరినాటికి పేలిపోయినపుడు, సమస్య పరిష్కారానికి గృహవసతి (హౌసింగ్) అనే మరో గాలిబుడగను సృష్టించింది. అయితే ఇది కూడ ఇప్పుడు పేలిపోయింది.

విత్త సంక్షోభం (ఫిస్కల్ క్రైసిస్) రానున్న రోజుల్లో తీవ్రతరం కాగలదు.

## తెరచుకుంటున్న మిలటరీ బ్లాకులు

సామ్రాజ్యవాద వ్యవస్థ సంక్షోభం మరింత తీవ్రమవుతున్నకొద్దీ యుద్ధ మేఘాలు మరింత ఆవరించుకోవటాన్ని గమనించవచ్చు. అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభం తీవ్రతరమవుతూ ఇరాన్‌పై యుద్ధ బెదిరింపు కొనసాగుతూండటం మరీ స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఇప్పుడు మొట్టమొదటిసారి ఫ్రాన్సు కూడా ఇరాన్‌ను బెదిరిస్తోంది. ఇంకా, అంతర్జాతీయ చమురు ధరలు అత్యధిక స్థాయికి ఒక పీపా చమురు ధర 84 డాలర్లకు (నవంబర్ 2007) చేరి, 100 డాలర్లకు చేరనుంది. ఫలితంగా, ఇంధన వనరులపై ఆధిపత్యాన్ని ఎలాగైనా సాధించాలనే పోటీ పెరగటం కూడా స్పష్టంగా కనబడుతున్నదే. అమెరికా ప్రభుత్వంలో దిగ్గజం వంటి అధికారి ఎలానే గ్రీన్ స్పాన్ (17 ఏళ్లు అధిపతిగా ఉన్నాడు) చమురు కోసమే ఇరాక్‌పై దురాక్రమణ జరిగిందని బాహాటంగానే అన్నాడు. యూరపు తన ఇంధన అవసరాల్లో 25 శాతం ఇంధనం కోసం కేవలం ఒక్క కంపెనీ - గాజ్‌ప్రోమ్ అనే రష్యా కంపెనీ - మీదనే ఆధారపడి ఉండటం ఒక విచిత్ర పరిస్థితి! ఈమధ్య కాలంలోనే మయన్మార్‌లో మిలటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ఉద్యమాన్ని అవకాశంగా తీసుకొని ఆ దేశంపై అమెరికా ఆంక్షలు విధించింది.

అయితే, ఇరాన్ చేతులు కట్టుకొని కూర్చోలేదు. అమెరికాను (ఫ్రాన్స్‌ను కూడ) బాహాటంగానే వ్యతిరేకిస్తోంది. తాను కొత్తగా ఒనగూర్చుకున్న మిలిటరీ శక్తిని ఈమధ్య ప్రదర్శించింది. తనను దౌత్యపరంగా ఏకాకిని చేయడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాన్ని సమర్థవంతంగా భగ్నం చేయగలిగింది. ఇరాన్‌పై ఎలాంటి దాడినైనా రష్యా వ్యతిరేకించింది. రష్యా, చైనాలు ఉన్న షాంఘై సహకార సంస్థ (షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ - ఎస్.సి.ఒ)లో ఇరాన్‌కు పరిశీలక స్థాయి ఉంది. జపాన్, ఇటలీ, దక్షిణ కొరియాలు కూడా ఇరాన్‌లో చమురు, గ్యాసుల వెలికితీతలో భారీ ప్రయోజనాలు కలిగి ఉన్నాయి. తాజాగా టర్కీ కూడా అమెరికా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఇరాన్, రష్యాలతో తాను పెంచుకుంటున్న ఇంధన సంబంధాలను పరిరక్షించుకుంటున్నది. చివరికి, అమెరికా తొత్తు హమీద్ కర్జయి కూడ అమెరికా ఒత్తిడిని లెక్కచేయక ఇరాన్ అధ్యక్షుడిని ఆఫ్ఘనిస్తాన్‌కు ఆహ్వానించాడు. కేవలం భారత పాలకులు మాత్రమే బానిసల్లాగ అమెరికా అడుగులకు మడుగులొత్తుతూ, గతంలో ఇరాన్‌తో కుదుర్చుకున్న ఖనిజ వాయువు పైపు లైను ఒప్పందం నుండి వైదొలుగుతూ ఇరాన్‌కు దూరంగా ఉంటున్నారు.

ఈవిధంగా జరుగుతున్న అన్నిరకాల దౌత్య కుయుక్తులతోబాటు, ఈమధ్య కాలంలో జరుగుతున్న సైనిక విన్యాసాలు కూడా మిలిటరీ బ్లాకుల పెరుగుదలను సూచిస్తున్నాయి.

ఆగస్టు మధ్యలో 19 దేశాల మిలిటరీ ఉన్నతాధికారుల రహస్య సమావేశం ఒకటి ఆస్ట్రేలియాలో జరిగింది. ఇలాంటి సమావేశం ముందెన్నడూ జరగలేదు. ఈ సమావేశానికి హాజరైన దేశాల్లో అమెరికా, జపాను, భారతదేశాలు కూడ ఉన్నాయి. అమెరికా జనరల్ జార్జ్‌కేస్ ఈ సమావేశానికి హాజరయ్యాడు. ఈ రహస్య సమావేశంలో ఏ కుట్ర జరిగిందో సూచన ప్రాయంగా కూడ బయటికి పొక్కలేదు. భారతదేశం నుండి ఎవరు హాజరయ్యారనేది కూడ రహస్యంగానే ఉంచారు. ఈ సమావేశం తర్వాత 2007 సెప్టెంబర్ 4న అతి పెద్ద సైనిక విన్యాసాలు బంగాళాఖాతంలో జరిగాయి. ఈ విన్యాసాల్లో రహస్య సమావేశానికి హాజరైన దేశాల్లోని ఆరుదేశాలు అమెరికా నాయకత్వంలో పాల్గొన్నాయి. వీటిలో భారతదేశం ముఖ్యమైనది. అదనంగా, బ్రిటిష్ మిలటరీతో భారతదేశం సంయుక్తంగా మరో విన్యాసాన్ని మూడు వారాల పాటు కీలకప్రాంతమైన లదాక్‌లో సెప్టెంబర్ చివరిలో రహస్యంగా నిర్వహించింది. అయితే, పాకిస్తాన్ దీనిపై వ్యతిరేకతను లాంఛనంగా వ్యక్తపరచటంతో ఇది బహిర్గతమయింది. ఈ విన్యాస తతంగమంతా అంతుబట్టని రహస్యంగా ఉంది. ప్రత్యేకంగా కీలకప్రాంతమైన

లదాక్‌లోనే ఈ సైనిక విన్యాసం ఎందుకు జరిగిందనే విషయం అత్యంత గోప్యంగా ఉంది.

మరోపక్క, ఇదే సమయంలో షాంఘై సహకార సంస్థ (ఎస్.సి.ఒ)లో ఉన్న రష్యా, చైనా, నాలుగు మధ్య ఆఫ్రికా దేశాలు కూడ గతంలో ఎన్నడూ జరగని విధంగా తమ మిలటరీ బలాన్ని పెద్ద ఎత్తున ప్రదర్శించుకున్నాయి.

ఆగస్టు 17న ఎస్.సి.ఒ. దేశాల అధ్యక్షులందరూ కూర్చుని మొట్టమొదటిసారిగా తమ సైన్యాల యుద్ధక్రీడల ముగింపు కార్యక్రమాన్ని తిలకించారు. ఈ విన్యాసంలో ఆరు వేల సైన్యం, వెయ్యి యుద్ధ శకటాలు, అనేకమైన విమానాలు తమ యుద్ధ కౌశలాన్ని ప్రదర్శించాయి. సభ్య దేశాలన్నీ దీనిలో పాల్గొనటం ఇదే మొదటిసారి. ఈ విధంగా సభ్య దేశాల అధ్యక్షులందరూ స్వయంగా హాజరవ్వటం, వెంటనే జరిగిన ఎస్.సి.ఒ. శిఖరాగ్ర సమావేశాన్ని సమన్వయం చేయటం వల్ల ఈ సైనిక విన్యాసానికి వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగింది. ఇది ఒక మిలటరీ పొత్తు అనే విషయాన్ని ఎస్.సి.ఒ. అంగీకరించకపోయినప్పటికీ దీనిలోని మిలిటరీ పార్శ్వం అతి వేగంగా విస్తృతమవుతోంది. ఇప్పటికే ఇది సమిష్టి రక్షణ ఒప్పంద సంస్థ (కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్-సి.ఎస్.టి.ఒ)లోని ఏడు మధ్య ఆసియా దేశాలతో మిలిటరీ పొత్తును ఏర్పరచుకుంది. సి.ఎస్.టి.ఒను షాంఘై సహకార సంస్థలో ఉన్న చైనా తప్ప మిగతా దేశాలన్ని కలిపి ఏర్పరచుకున్నాయి. తొలుత చైనా సి.ఎస్.టి.ఒకు దూరంగా వుండాలనుకుంది. కాని ఇప్పుడు అది షాంఘై సహకార సంస్థ, సి.ఎస్.టి.ఒలు భాగస్వాములు కావాలనే వైపుకు మళ్లింది. మొట్టమొదటిసారి చైనా విదేశాల్లో ఒక పెద్ద మిలిటరీ గ్రూపును మోహరించింది. స్వదేశంలో మిలిటరీ విన్యాసాలను కూడ మొదలుపెట్టింది. మొదట ముస్లిం మిలిటెంట్ల ఆందోళనలకు కేంద్రంగా ఉన్న క్సిన్‌జియాంగ్ ఊయిఘుర్ స్వయంప్రతిపత్తి ప్రాంతపు రాజధాని ఊరుమ్‌ఖిలో మిలిటరీ విన్యాసాలను నిర్వహించింది. ఆ తర్వాత వీటిని రష్యాలోని ఉరల్స్‌లో నిర్వహించింది. ఎస్.సి.ఒ/సి.ఎస్.టి.ఒల కూటమి నాటో (నార్తరన్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) కూటమికి ధీటుగా పెరుగుతోంది. మిలటరీ విన్యాసాల తర్వాత జరిగిన ఎస్.సి.ఒ శిఖరాగ్ర సమావేశం మధ్య ఆసియాలో జోక్యం కలిగించుకోవద్దని అమెరికాను స్పష్టంగానే హెచ్చరించింది. రష్యా ఇంధన క్లబ్బు ఏర్పాటును ప్రతిపాదించింది. పరిశీలక (అబ్జర్వర్) దేశంగా హాజరవుతున్న ఇరాన్ ఇంధన క్లబ్బు/సమావేశాల నిర్వహణకు సంసిద్ధతను తెలిపింది. ఎస్.సి.ఒలోని ఏ సభ్యదేశ రక్షణకైనా ముప్పు వాటిల్లితే "అవసరమైనంత ప్రతిస్పందనను రూపొందించుకునే లక్ష్యంతో" సంప్రదింపులు చేసుకునే వీలును ఎస్.సి.ఒ శిఖరాగ్ర సమావేశంలో సంతకాలు చేసిన ఒప్పందం కలిగించింది.

ఇరాన్‌పట్ల దురాక్రమణ పోకడలను అమెరికా ఇంకా కొనసాగిస్తూనే ఉంది. ఆగస్టు మూడవ వారంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐ.ఆర్.జి.సి)ను టెర్రరిస్టు సంస్థగా ప్రకటించబోయింది. ఐ.ఆర్.జి.సి. ఇరాన్ ఆర్మీలో ఒక విశిష్ట విభాగం. ఒక దేశ ఆర్మీని మరోదేశం ఈ విధంగా బెదిరించటం ఇదే ప్రథమం. అదనంగా ఇరాన్‌లో ఉన్న కుర్దులను, బలూచీలను, అరబ్బులను, ఇతర మైనారిటీ జాతులను ఇరాన్‌పై తిరుగుబాటుకు ప్రోత్సహిస్తూ ఇరాన్‌ను అస్థిరత్వానికి గురిచేసేందుకు సి.ఐ.ఏ. కోవర్టు చర్యలను రచిస్తోంది. ఇరాన్‌పై వుపయోగించటానికి భారీగా సౌదీ అరేబియాకు రెండువేల కోట్ల డాలర్ల ఆయుధాల ప్యాకేజీని, ఇజ్రాయిల్‌కు మూడువేల కోట్ల డాలర్ల ప్యాకేజీని సి.ఐ.ఏ. అందజేసింది. ఈమధ్య కాలంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు కూడా మొట్టమొదటసారి ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమేనంటూ బెదిరించాడు. అయితే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల్లో చవిచూసిన ఘోర నష్టాల దృష్ట్యా ఇరాన్‌పై జరగబోయే దాడిలో గ్రౌండు బలగాలను ఉపయోగించకపోవచ్చు. సెప్టెంబర్ 25న అమెరికా పార్లమెంటు భారీ మెజారిటీతో ఇరాన్‌పై ఆంక్షలను ఇంధన రంగానికి కూడ వర్తింపజేయాలని ఓటువేసింది.

ఇరాన్‌పై దాడి జరిపితే పైన పేర్కొన్న పిండదశలో ఉన్న మిలిటరీ బ్లాకులు మరింత పటిష్టమవుతాయి. చమురు ధరలు ఆకాశాన్నంటి, మరిన్ని బ్యాంకులు కుప్పకూలిపోయి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతుంది. ఫలితంగా, అనేక దేశాల్లో కనీవినీ ఎరుగని స్థాయిల్లో ఫాసిస్టు హింస చెలరేగుతుంది. సామ్రాజ్యవాదంపై, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఆధారపడి ఉండి, దానితో ముడిపడివున్న భారతదేశం కూడా ఈ దుష్పరిణామాలకు గురికాక తప్పదు. దక్షిణాసియా ప్రాంతంలో భారతదేశాన్ని అమెరికా తన పావుగా వుపయోగించుకోగలదు.

## భారతదేశంపై ప్రభావం

వ్యాపారానికి వ్యూహాత్మక ప్రాముఖ్యత దృష్ట్యా భారతదేశం ఐదవ అత్యంత కీలకమైన ప్రాంతమని న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ జరిపిన సర్వేలో పేర్కొంది. జపాన్, బ్రెజిల్, రష్యా, ఆస్ట్రేలియాల కంటే పైస్థాయిలో భారతదేశం ఉంది. అమెరికాలో పై స్థాయిలో వున్న 240 మంది సి.ఇ.ఒ.లను సర్వే చేసిన తర్వాత ఈ విషయం తెలిసింది.

భారతదేశం, ఇక్కడి బడా దళారీ సంస్థలు సామ్రాజ్యవాదులతో మున్నెన్నడూ లేనంతగా హత్తుకొని ఉన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్ సామ్రాజ్యవాదుల చేతుల్లోనే ఉంది. ఐ.టి.కంపెనీలు, ప్రైవేటు బడా బ్యాంకుల్లో చాలా వరకు విదేశాలకు చెందినవే. కొన్ని భారతీయ బ్యాంకుల్లో కూడా విదేశీ వాటానే సింహభాగం. దళారీ బడా వ్యాపార సంస్థల్లో విదేశీవాటాలు మరింత పెరుగుతూ భారీగా విదేశీ అప్పులను, విదేశీ మార్కెట్లను కూడా పొందుతూ సామ్రాజ్యవాదంతో విడదీయలేనంతగా పెనవేసుకున్నాయి. ప్రవాస భారతీయులు (ఎన్.ఆర్.ఐ) ఆర్థిక రంగంలో మరింత ఎక్కువ పాత్రను పోషిస్తున్నారు. ఇప్పుడిక తీర్చాల్సిన విదేశీ అప్పులు కూడా ఎన్నడూ లేనంతగా

ఆకాశాన్నంటుతున్నాయి. 2006-07లో భారతదేశం తీర్చాల్సిన బయటి అప్పులు భారీగా 23 శాతంకి పెరిగి, 155 బిలియన్ డాలర్లు అంటే ఆరు లక్షల కోట్ల రూపాయల కంటే ఎక్కువ అయింది. ఇది స్థూల దేశీయ ఉత్పత్తిలో 16.4 శాతం. ఈ ఒక్క సంవత్సరంలో పెరుగుదల 28.5 బిలియన్ డాలర్లు, అంటే ఒక లక్ష కోట్ల రూపాయల కంటే ఎక్కువ. దీనిలో ప్రైవేటు వాణిజ్యపు అప్పులే సగం ఉన్నాయని 2007 సెప్టెంబర్ 18న హిందుస్తాన్ టైమ్స్ పత్రిక రాసింది.

ఇంతటి స్థాయిలో సామ్రాజ్యవాదంపై ఆధారపడి ఉండటం అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితిలో ఏ చిన్నపాటి ప్రకంపనలు కలిగినా అవి భారతదేశాన్ని తీవ్రమైన దుష్ప్రభావానికి గురిచేయక తప్పదు. దిగుమతి చేసుకునే చమురుపై అతిగా ఆధారపడటం వల్ల మరింత అధ్వాన్న పరిస్థితి ఏర్పడుతుంది. అంతర్జాతీయ చమురు ధరల్లో పెరుగుదల, బహిరంగ మార్కెట్టు విధానం, ఇంధన ధరల పెరుగుదలలు పేదవర్గాలపైనే కాక మధ్యతరగతి వర్గాలపైన కూడా తీవ్రమైన దుష్ప్రభావాన్ని వేస్తాయి.

ఈ సంవత్సరం మే నెల నుండే భారత ఆర్థిక రంగం మందగిస్తోందనే రిపోర్టులు వస్తున్నాయి. ఇక్కడ కూడ అధిక వడ్డీరేట్లు 750 కోట్ల రూపాయలు వసూలుకాని గృహ పథక అప్పులు పెరిగాయి.

ఈ పరిణామాలన్నింటితోబాటు, భారతదేశం ఆర్థికపరంగా, రాజకీయపరంగా (విదేశీ విధానాల ద్వారా), మిలిటరీపరంగా కూడా అమెరికాపట్టులో మరింతగా ఇరుక్కుపోతోంది. నేటి ప్రపంచీకరణ కాలంలో ఇప్పటికే సామ్రాజ్యవాదంపై ఆధారపడి ఉన్న దేశ ఆర్థికరంగంలో అత్యంత భారీగా అమెరికా జోక్యం స్పష్టంగా కనబడుతోంది. ప్రతీ అంశం సామ్రాజ్యవాదంతో ప్రత్యేకించి, అమెరికా సామ్రాజ్యవాదంతో భారీగా ముడిపడి ఉంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ ఉచ్చు మరింత గట్టిగా బిగుసుకుపోతూ దేశాన్నీ, దేశ ప్రజలనూ ముందెన్నడూ ఎరుగనిరీతిలో విలవిలలాడిస్తోంది.

మిలిటరీ రంగంలో భారతదేశం అమెరికా మిలటరీ విధాన (మిలిటరిజం) సుడిగుండంలో చిక్కుకుపోయింది. అణు ఒప్పందం కేవలం అణుశక్తికి సంబంధించిన విషయమే కాదు. అది భారతదేశానికి మిలటరీ,అణు సామగ్రిని భారీగా అమ్మడం కోసం, భారత విదేశాంగ విధానాన్ని అమెరికా చెప్పుచేతల్లో పెట్టుకోవటానికి, (ఉదాహరణకు, ఇరాన్ వ్యవహారంలో) మిలటరీపరంగా భారతదేశాన్ని అమెరికా మిలిటరీ కూటమిలోకి మరింత లోతుగా లాగటానికి. భారత ప్రభుత్వం ఒకసారి అణు ఒప్పందాన్ని అంగీకరిస్తే భారతదేశ విదేశాంగ విధానం అమెరికా విదేశాంగ విధానానికి అనుగుణంగా ఉండాల్సిందేనని అమెరికా అధికారులు స్పష్టంగానే వ్యక్తపరిచారు. ఇటీవల అమెరికా యుద్ధనౌకలను భారత నౌకాశ్రయాల్లోకి వచ్చి ఉండటానికి భారతప్రభుత్వం అనుమతించింది. గతంలో ఇలా ఎన్నడూ అనుమతించలేదు. ఇరాన్‌ను బెదిరించటానికి అమెరికా అణు నౌక నిమిట్జ్ చిన్న నౌకల ఫ్లోటిల్లా (యుద్ధ నౌకల ఫార్మేషన్లలో ఇది ఒకటి)తో బాటు పర్షియన్ గల్ఫ్ పరిసరాల్లో తిరిగి వచ్చి ఆగస్టు 2007లో చెన్నై నౌకాశ్రయంలో లంగరు వేసింది. ఈ సంవత్సరంలో భారతదేశం అమెరికా, జపాన్‌లతో సంయుక్త నౌకా విన్యాసాలను పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో నిర్వహించి, ఆ తర్వాత వెంటనే బంగాళాఖాతంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో సంయుక్తంగా ఉన్నతస్థాయి నౌకా విన్యాసాలను కూడ నిర్వహించింది. 1994వ సంవత్సరం నుండి భారతదేశం, అమెరికాలు పాల్గొన్న సంయుక్త నౌకా విన్యాసాల్లో బంగాళాఖాతంలో జరిగిన విన్యాసం పదమూడవది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దురాక్రమణ జరిగిన తర్వాత నుండి భారతసైన్యం నిర్వహించిన సైనిక విన్యాసాల్లో సగం కంటే ఎక్కువ అమెరికాతో సంయుక్తంగా నిర్వహించినవే. అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థ (మిస్సైల్ డిఫెన్స్)ను సమర్థించే పిడికెడు దేశాల్లో జపాన్, తైవాన్‌లతో బాటు భారతదేశం కూడా ఉంది. లదాక్‌లో బ్రిటిష్ మిలటరీతో రహస్యంగా నిర్వహించిన సంయుక్త విన్యాసాల గురించి ఇటీవల వచ్చిన రిపోర్టుల గురించి పైననే ప్రస్తావించుకున్నాం. ఇటీవల భారత, అమెరికాలు మిజోరామ్‌లో సంయుక్తంగా నిర్వహించిన ఐదవ ఇన్సర్జన్సీ వ్యతిరేక (కౌంటర్-ఇన్‌సర్జన్సీ) విన్యాసాలు ప్రత్యేకంగా వామపక్ష గెరిల్లాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవే. ఎస్.సి.ఒలో ఇరాన్, పాకిస్తాన్‌లతో పాటు భారతదేశానికి కూడ పరిశీలక స్థాయి (అబ్జర్వర్ స్టాటస్) ఉంది. శిఖరాగ్ర సమావేశానికి అన్ని దేశాల అధిపతులు హాజరైతే భారతదేశం మాత్రం పెద్దగా ప్రాముఖ్యతలేని ఒక మంత్రి మురళీదేవరాను పంపింది. ఇతడు పేరుమోసిన అమెరికా తోలుబొమ్మ. ఇదంతా తొత్తు భారత పాలకవర్గాలు మిలిటరీపరంగా దేశాన్ని ఏ వైపుకు తీసుకుపోతున్నాయో సూచిస్తుంది.

ప్రపంచ ఆర్థికస్థితి అత్యంత పెళుసుగా తయారవుతుండటంతో ఏ అంతర్జాతీయ సంక్షోభమైనా భారత ఆర్థిక రంగాన్ని మరింత అస్థిరత్వానికి గురిచేయగలదు. సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక రంగాలపై సంక్షోభం కలిగించే దుష్ప్రభావాల నుండి బయటపడటానికి భారతదేశం వంటి దేశాలను దోచుకోవడం ఎక్కువ కాగలదు. ఇందువల్ల భారత పాలకులు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలపైనే ఈ భారాన్నంతటినీ మోపుతారు. దీని ఫలితంగా అనివార్యంగా ప్రజల్లో పెరిగే అసంతృప్తి, ఆందోళనలను అణచివేయడానికి ఫాసిస్టు రాజ్య హింసను చాల పెద్ద ఎత్తున అమలుచేయడమే పాలకవర్గాల ఎజండా అవుతుంది.

రాబోయే ఆర్థిక పెనుదాడులను, ఫాసిస్టు ఊచకోతలను ఎదుర్కోవటానికి ప్రజలందరూ సంసిద్ధం కావాలి. ఈ రాజ్యహింసను తిప్పికొట్టే విధంగా ప్రజలు తమ సంఘటిత శక్తిని పెద్దయెత్తున పెంచుకోవాలి.

★

# మోడీ విజయం-విస్తరిస్తోన్న కాషాయ ప్రమాదం

గుజరాత్‌లో వరుసగా మూడవసారి ముఖ్యమంత్రిగా మోడీ గెలిచాడు. దాదాపు దేశమంతటా కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ వ్యతిరేకత ఒక సాధారణ అంశమై ప్రతిసారీ ఎన్నికల్లో అధికారం పార్టీలు మారడం సహజమైపోయిన పరిస్థితుల్లో ఒక వ్యక్తి వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం విశేషమే కావచ్చు. కానీ దేశమంతా అసహ్యించుకున్న మోడీ ముఖ్యమంత్రి కావడాన్ని ఒక విశేషమైన విషయంగా కంటే ఒక ఆందోళనాకరమైన విషయంగా పరిగణించాలి.

ఎందుకంటే, మోడీ ఎటువంటి వాడు? ముస్లిం ప్రజల నెత్తుటితో హోలీ ఆడుకున్న వాడు! వాళ్ల చితి మంటలతో చలి కాచుకున్న వాడు! అత్యాచార బాధిత మహిళల ఆర్తనాదాలకు వీనుల విందుగా పరవశించినవాడు! కడుపులో వున్న పిండాన్ని కూడా వదలని క్రూర వేటగాడు.

నిజానికి మోడీ గురించి ఈ పరిచయ వాక్యాలు అవసరమే లేదు. మానవత్వం వున్న మనుషులకు 'గుజరాత్' ఎప్పటికీ మానని గాయమే. ఆ గాయం సల్పినప్పుడల్లా మోడీ గుర్తొస్తాడు. మోడీ గుర్తొచ్చినప్పుడల్లా ఆ గాయం సల్పుతూనే వుంటుంది.

గుజరాత్‌లోని గోద్రాలో కరసేవకులు వెళ్తోన్న రైలును ముస్లింలు తగులబెట్టారనే సాకుతో గుజరాత్‌లో, ముస్లింలపై మారణకాండను జరిపించాడు. వేలసంఖ్యలో హత్యలూ, అత్యాచారాలూ, సజీవ దహనాలు, గృహ దహనాలకు కారకుడయ్యాడు. నాటి మారణకాండపై తెహల్కా రహస్య పరిశోధన చేసింది. నాడు అల్లర్లకు పాల్పడిన నేతలతోనే నిజాలు వెల్లడయ్యేలా మాట్లాడించి రహస్యంగా వీడియో తీసి బయటి ప్రపంచానికి వెల్లడించింది. ఆ అల్లరలను మోడీతో, సహా సంఘ్‌పరివార్ నేతలు ఎలా ప్రేరేపించారో అల్లర్లకు స్వయంగా పాల్పడిన వారు చెప్పారు. " మీరేం చేస్తారో తెలియదు. మీరేం చేసినా నేను కాపాడుతాను. కానీ మూడురోజుల్లో జరగాల్సిందంతా జరిగిపోవాలి" అని మోడీ స్వయంగా చెప్పినట్టు తెహల్కా ఆపరేషన్‌లో వెల్లడయింది. అంతే కాదు ఆ మారణకాండను జరపడం కోసం ఒక్కో జట్టుకు 200 మంది ముస్లింలను చంపమని టార్గెట్ ఇచ్చినట్టుగా కూడా వెల్లడయింది.

గుజరాత్ మారణకాండను దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకించారు. మోడీనీ వ్యతిరేకించారు. మీడియా అగ్లీ ఇండియన్ (అసహ్యకర మైన భారతీయుడు) అని మోడీని చీదరించుకుంది.

దేశమంతా వ్యతిరేకించిన, అగ్లీ ఇండియన్‌గా చీదరించిన వాడిని మెజారిటీ గుజరాతీయులు మరోసారి అధికార పీఠం మీద కూర్చోపెట్టారు. ప్రజల ఈ వైఖరి చాలా ప్రమాదకరమైనది.

మోడీ గెలుపు లౌకికవాదంపై అనేక సవాళ్లను విసురుతోంది.

మోడీ ఎంత కరడుగట్టిన కాషాయవాదంటే, తన 'గుజరాత్ ' నేరంపై అతడు కనీసం కంటితుడుపు పశ్చాత్తాపాన్నయినా ప్రకటించలేదు. పైగా గుజరాత్‌ను ఒక ప్రయోగశాలగా అభివర్ణించాడు. గుజరాత్ నమూనా దేశమంతటికీ వర్తింపజేయాలన్నాడు. ఈ ఎన్నికల్లో కూడా తన కాషాయరంగును కప్పిపుచ్చుకునే ప్రయత్నం ఏమీ చేయలేదు. పైగా దాన్ని మరింత బయట పెట్టుకోవడం ద్వారానే గెలుపును సాధించాలనే వ్యూహం పన్నాడు. లేకుంటే సొహ్రాబుద్దీన్ 'ఎన్‌కౌంటర్'ను ఎలా సమర్థించగలడు? సొహ్రాబుద్దీన్ హత్యోదంతం దేశవ్యాప్తంగా సంచలనాన్ని రేపింది. గుజరాత్ పోలీసులు కిరాయి హంతకుల్లా వ్యవహరించారన్నది దాదాపుగా స్పష్టమైంది. సొహ్రాబుద్దీన్ హత్యకు సాక్షులను లేకుండా చేయాలనే వుద్దేశంతో అతని భార్యనూ, స్నేహితున్నీ కూడా అమానుషంగా కాల్చి చంపారు. తమ హత్యలకు సాధికారతను కల్పించుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఎందరో సాధారణ వ్యక్తులను చంపి నక్సలైట్లని కట్టు కథలు అల్లుతున్నట్టుగానే, గుజరాత్ పోలీసులు చిల్లర నేరస్తుడైన సొహ్రాబుద్దీన్‌కు టెర్రరిస్ట్ రంగు పులిమారన్నది స్పష్టాతి స్పష్టం. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు మోడీ సర్కార్‌ను తప్పుపట్టారు.

సాధారణంగానైతే ఇది ఏ ప్రభుత్వానికైనా సంకట పరిస్థితిగానే పరిణమిస్తుంది. ఏ ప్రభుత్వమైనా దీన్ని కప్పిపుచ్చాలనే చూస్తుంది. కానీ మోడీ అలా కప్పిపుచ్చుకోలేదు. చంపామని ఒప్పుకున్నాడు. పైగా చంపడాన్ని సమర్థించుకున్నాడు కూడా. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకిస్తున్న దాన్ని ఒక ముఖ్యమంత్రి బాహాటంగా సమర్థించాడంటే, తన రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తానని బహిరంగంగానే చెప్పినట్టు. మోడీ ఇలా చెప్పడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. అతనెంత నిరంకుశుడో, అహంకారో, అహంభావో సాధారణ ప్రజలకంటే, మీడియాకంటే బహుశా తన సొంత పార్టీకే ఎక్కువ తెల్సు. కానీ ఇలా చెప్పి కూడా గెలవడం అన్నది ఆందోళనాకరం.

ఈ మధ్య సర్వసాధారణమైపోయిన ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ సరళిని అనుసరించకుండా ఒక పచ్చి మత తత్వవాదిని, నరహంతకుడినని స్వయంగా ఒప్పుకున్నవాడినీ ప్రజలు గెలిపించారంటే మోడీ మెజారిటీ గుజరాతీయుల్లో ఎంత మతతత్వ విషాన్ని ఎక్కించాడో అర్థం అవుతుంది. నిజానికి మోడీ ఈ ఎన్నికల్లో పలు అననుకూలతలను ఎదుర్కొన్నాడు. మొదట తన సొంత పార్టీలో

తీవ్రమైన అసమ్మతిని ఎదుర్కున్నాడు. కేశూభాయ్ పటేల్ వంటి సీనియర్ నేతలు ఈ అసమ్మతివాదుల్లో ఉన్నారు. మోడీ సర్కార్లో ఎం.ఎల్.ఎలుగా వున్న పది మంది అసమ్మతివాదులు కాంగ్రెస్‌లో చేరి, కాంగ్రెస్ తరపునుంచి పోటీ చేశారు. ఈ అసమ్మతి ఇంకెంత స్థాయిలో ఉందంటే పలుచోట్ల అసమ్మతి నేతలు కాంగ్రెస్‌ను గెలిపించమని ప్రచారం కూడా చేశారు. అయినప్పటికీ ఈ అసమ్మతి మోడీ 'ప్రాభవాన్ని' ఏమీ తగ్గించలేకపోయింది. గుజరాత్ మారణకాండలో మోడి పాత్రను బహిర్గతం చేస్తూ ఎన్నికల ముందే తెహల్కా తన పరిశోధనను వెలువరించింది. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రభావం వేస్తుందనీ, మోడి విజయావకాశాలను దెబ్బ తీస్తుందని పరిశీలకులు భావించారు. సొహ్రాబుద్దీన్ హత్యపై వివాదస్పద వ్యాఖ్యలు చేసినందుకు ఎన్నికల కమీషన్ మోడీని తప్పుపట్టింది. వీటన్నింటికీ తోడు అధిష్టానం ఆశీస్సులు కూడా మోడీకి పెద్దగా లేవు. అయితే ఇవేవీ మోడీ విజయావకాశాలను దెబ్బతీయలేకపోయాయి.

మోడీ విజయానికి మతంతోపాటు అభివృద్ధి కూడా పని చేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గుజరాత్‌లో అభివృద్ధి రేటు చైనా కంటే ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కానీ పాలకులు చెప్పుకునే అభివృద్ధి రేట్లు మెజారిటీ ప్రజల బతుకుల్లో ఎటువంటి మెరుగుదలను సాధించకపోగా మరింతగా దిగజార్చుతుండడం మనం చూస్తున్నదే. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలకూ, వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉన్న మోడీ పేద వర్గాలకు చేసింది పెద్దగా ఏమీ లేదు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోలేదు. అయినప్పటికీ మోడీ పాలన వల్ల ప్రయోజనం పొందిన వర్గాల మద్దతు మోడీ విజయానికి దోహదం చేసిందని భావించాలి. గుజరాత్ ఆత్మగౌరవం అనే నినాదం కూడా విజయానికి తోడ్పడింది. కానీ విజయంలో ప్రధాన పాత్ర మాత్రం హిందూత్వదే. బి.జె.పి. రకరకాల పద్ధతుల్లో ప్రజల్లో మత తత్వాన్నీ. మతోన్మాదాన్నీ పెంచుతోంది, రెచ్చగొడుతోంది.కాషాయ ప్రయోగశాలగా మారిన గుజరాత్‌లో ఈ పరిస్థితి మరింత విషమంగా వుంది. గుజరాత్‌లో హిందూత్వ ప్రభావం ఎంతగా ఉందంటే, ఈ ఎన్నికల్లో లౌకికవాద పార్టీనని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, గుజరాత్ మారణకాండను గట్టిగా విమర్శించడంగానీ, లౌకికవాద ప్రచారాన్ని గానీ చేయలేదు. అలా చేస్తే ధరావత్ కూడా దక్కదని స్థానిక కాంగ్రెస్ పార్టీ భయపడింది. సోనియాగాంధీ ఒక హిందూ దేవుడి గుడి నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం కూడా హిందూత్వవాదులను సంతృప్తి పరచడానికే.

నిజానికి గుజరాత్‌లో బి.జె.పి వరుస విజయాలు సాధించడంలో కాంగ్రెస్ వైఫల్యం ఉంది. మోడీని హిందూమతోన్మాదిగా, మృత్యు బేహారిగా అభివర్ణించిన కాంగ్రెస్ పార్టీ లౌకికవాద పాత్ర ఎన్నడూ పోషించలేదు. బాబ్రీ మసీదును కూల్చినప్పుడు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీనే అన్నది ఎవ్వరం మర్చిపోలేం. దాన్ని కాపాడ్డానికి అది ఎటువంటి పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. అంతేకాదు గుజరాత్‌లో మారణకాండ జరిగినప్పుడు కాంగ్రెస్ బాధితులకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. తీస్తా సెతల్వాద్ తదితర స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల వల్ల బెస్ట్‌బేకరి, బిల్కీస్‌బాను వంటి కేసులు కోర్టు గడపలెక్కాయి. ఎన్నికల ముందు మతోన్మాదులంటూ దుయ్యపట్టడం తప్ప గుజరాత్ సమాజంలో లౌకికతను పెంచడంలో కాంగ్రెస్ కృషి ఏమీలేదు. అది అటువంటి కృషి చేస్తుందని ఆశించలేం. ఎందుకంటే కాంగ్రెస్ లౌకికత ముసుగు వేసుకున్న హిందూ మతతత్వ పార్టీనే.

దేశంలో మతతత్వ ప్రమాదం పెరగకుండా వుండడానికిగాను బి.జె.పి.ని ఓడించడానికి మాత్రమే కాంగ్రెస్‌తో చేతులు కలుపుతున్నామని పదే పదే చెప్పుకునే వామపక్షాలు దేశంలో ఎక్కడా చెప్పుకోదగిన మతతత్వ వ్యతిరేక పోరాటాలుగానీ బి.జె.పి. వ్యతిరేక పోరాటాలుగానీ చేపట్టలేదు. గుజరాత్ మారణకాండకు వ్యతిరేకంగా సహితం అది పెద్దగా పోరాటాలను చేపట్టింది లేదు. బి.జె.పి. గెలుపుకు కాంగ్రెస్ వైఫల్యమే కారణమని ఒకవైపు చెప్తూనే మరోవైపు అది యు.పి.ఎ.లో కొనసాగుతోంది. ఇలా బి.జె.పి. గెలుపుకు వామపక్షాల వైఫల్యం కూడా కారణమే.

ఈ గెలుపు బి.జె.పిలో మోడీని పెద్ద హీరోను చేసింది. గత ఏడాది పార్లమెంటరీ బోర్డ్ నుండి మోడీని పక్కన పెట్టిన అధిష్టానం ఈ ఫలితాల తర్వాత, అంతకంటే ముఖ్యమైన పార్టీ వ్యూహారచనా బృందంలోకి తీసుకుంది. మోడీకి తప్ప ఈ బృందంలో ఏ ముఖ్యమంత్రికీ స్థానం లేదు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోడీని ప్రచారానికి వినియోగించుకోవాలని బి.జె.పి అనుకుంటోంది. అద్వానీ తర్వాతి స్థానం మోడీదేనని భావిస్తున్నారు.

పచ్చి మతోన్మాద పార్టీ అయిన బి.జె.పి ఇన్నాళ్లూ ఉదారవాదిగా పేరున్న వాజ్‌పేయ్‌ను ముందుపెట్టుకుంది. ఇప్పుడు తాజాగా అతివాదిగా పేరుపడ్డ అద్వానినే ముందుకొచ్చాడు. ఇంక భవిష్యత్‌లో అది అతివాదుల్లోకెల్లా అతివాది అయిన నరేంద్రమోడీపై ఆధారపడదల్చుకుంది. అంటే బి.జె.పి మరెంత ఫాసిస్టు స్వభావాన్ని సంతరించుకుంటుందో ఊహించవచ్చు. గుజరాత్ నమూనాను తనకు పట్టున్న అన్ని రాష్ట్రాల్లో అమలు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇది దేశంలో అమలవుతున్న నామమాత్రపు లౌకికవాదాన్ని కూడా దెబ్బతీస్తుంది.

అయితే గుజరాత్ గెలుపును నమూనాగా తీసుకొని మిగితా రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావాలనే దాని పథకం అంత సులువుగా నెరవేరేదేం కాదు. భిన్న సామాజిక నేపథ్యాలున్న పలు రాష్ట్రాల్లో బి.జె.పి ఎజెండా అంత సులువుగా ముందుకుపోదు. అయినప్పటికీ

*(మిగతాది 51వ పేజీలో...)*

# ఖమ్మం జిల్లా విప్లవోద్యమంపై కేంద్రీకరించి సాగుతున్న బహుముఖ దాడి

రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోనే మావోయిస్టుల కార్యక్రమాలు సాగుతున్నాయని ప్రకటించి శత్రువు కేంద్రీకరించి బహుముఖ దాడిని తీవ్రతరం చేసాడు. విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి పోలీసులు, రెవెన్యూ, ఫారెస్టు, ఐ.టి.డి.ఎ, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాల శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేసుకుంటున్నాడు. ఇందుకోసం వివిధ సంస్కరణల పథకాలను అమలు చేస్తున్నాడు. ఒకవైపు విప్లవోద్యమంపై విషప్రచారాన్ని సాగిస్తూనే మరొకవైపు సాయుధ దాడిని కేంద్రీకరించి తీవ్రతరం చేసాడు.

## ప్రజలను విప్లవోద్యమానికి దూరం చేసే 'అభివృద్ధి-సంక్షేమ' కార్యక్రమాలు

విప్లవోద్యమానికి ప్రజలను దూరం చేయడానికి జిల్లాలో పోలీసు, రెవెన్యూ, ఫారెస్టు, ఐ.టి.డి.ఎ, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాల శాఖల సమన్వయంతో 'అభివృద్ధి-సంక్షేమ' కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నారు. నిరంతరం ఈ శాఖల జిల్లా ముఖ్యాధికారులు గ్రామాలను, మండల కేంద్రాలను పర్యటిస్తూ ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

నేడు ఖమ్మం జిల్లా కమిటీ నేతృత్వం వహిస్తున్న ప్రాంతం వుత్తరాన ఛత్తీస్‌గఢ్ (డి.కె), ఒరిస్సా రాష్ట్రాలు, తూర్పున తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, దక్షిణాన పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దులతో కూడి వున్నది. ఈ ప్రాంతం నుండి జీవనది అయిన గోదావరి అలాగే దాని ఉపనదులు అయిన శబరి, సీలేరులు సంవత్సరం పొడుగూతా ప్రవహిస్తూనే వుంటాయి. ఆ నదుల వెంట వుండే పల్లపు సారవంతమైన వేలాది ఎకరాల భూములు కోస్తాంధ్ర భూస్వాముల చేతుల్లో వున్నాయి. ఒక్కో భూస్వామి ఖబ్జాలో వందలాది ఎకరాల భూములు బినామీ పేర్లతో వున్నాయి. ఈ భూస్వాములు చాలా మంది ఆదివాసీ మహిళలను రెండవ భార్యగా చేసుకొని 1/70 చట్టం నుంచి బయట పడుతున్నారు. ఈ సారవంతమైన భూముల్లో వలస భూస్వాములతోపాటు ఆదివాసేతర ప్రజలు కూడా అధికంగానే వున్నారు.

మిగిలిన అటవీ, కొండ ప్రాంతాల్లో ఆదివాసులు జీవనం సాగిస్తున్నారు. నేడు జిల్లా ఉద్యమం సాగుతున్న చింతూర్, కూనవరం, వరరాంచంద్రాపురం, భద్రాచలం, కుకునూర్, వేలేరుపాడు, అశ్వరావుపేట, ముల్కలపల్లి, దమ్మపేట, వాజేడు, వెంకటాపురం,చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని అటవీ, కొండ ప్రాంతాల్లో మెజారిటీగా దొర్ల, కోయ, కొండరెడ్లు, నాయకపు తెగలకు చెందిన ఆదివాసులు జీవిస్తున్నారు. వీరు ఇప్పటికీ పోడు వ్యవసాయమే చేస్తున్నారు. తల్లిలాంటి అడవమ్మే వీరికి ప్రధాన జీవనాధారం కాగా, ఇది షావుకార్లు, మధ్య దళారులు, భూస్వాములకు దోపిడీ వనరుగా వుంది.

భూస్వాముల, షావుకార్ల, దళారుల దోపిడీ, పీడనలకు గురవుతున్న ఈ ప్రజలు సహజంగానే విప్లవోద్యమంలో భాగస్వాములవుతున్నారు. ఈ ఉద్యమ ప్రాంతానికి సరిహద్దున వడి వడిగా అడుగులేస్తూ ముందుకు సాగుతున్న దండకారణ్య విప్లవోద్యమ ప్రభావం ఈ ప్రజలపై పడడం సహజమనే విషయం వేరుగా చెప్పాల్సిన పనేమీ లేదు.

అందుకే వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ఈ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి దోపిడీ పాలకులు కేంద్రీకరించి ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా బహుముఖ దాడిని అమలు చేస్తున్నారు. ప్రధానంగా ఐ.టి.డి.ఎ ద్వారా వ్యక్తిగత, సమిష్టి రుణాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఏడురాళ్లపల్లి కొండలపై అలాగే గోదావరికి ఇరువైపులనున్న కొండరెడ్లకు సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నారు. ఈ సంక్షేమ పథకాల్లో వ్యక్తిగత సైకిళ్లు, ఆయిల్ ఇంజన్లు, ఆటోలు, కుట్టు మిషన్లు, మేకలు, పందులు ఇస్తున్నారు. చిన్న చిన్న కిరాణం దుకాణాలు పెట్టిస్తున్నారు. వెదురుతో పూలు, కుర్చీలు, టీపాయ్‌లు తయారు చేయడం నేర్పిస్తున్నారు. సమిష్టిగా ట్రాక్టర్లు, బోట్లు, చేపల వలలు ఇస్తున్నారు. ప్రతి సంవత్సరం గోదావరి ముంపు ప్రజలకు ఒక జత బట్టలు, బియ్యం, ఉప్పుకారం, పప్పులు పంపిణీ చేస్తున్నారు. జీడి మామిడి తోటలకు, వరి, జొన్న, కంది, నువ్వుల లాంటి పంటలకు రుణాలు, వ్యవసాయ పనిముట్లు, రసాయనిక, క్రిమిసంహారక ఎరువులను సబ్సిడీలో పంపిణీ చేస్తున్నారు. గ్రామాలకు రోడ్లు, వ్యక్తిగత కుంటలు, సమిష్టి చెరువులు పోస్తున్నారు. 'పనికి ఆహార పథకం', 'గ్రామీణ ఉపాధి హామీ పథకం' లాంటి వాటిల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా స్థానిక ఆదివాసీ యువకులను నియమిస్తున్నారు. కొంత మంది నిరుద్యోగ యువకులను ప్యారా టీచర్లుగా, విద్యా వాలంటీర్లుగా నియమించారు.

శత్రువు ఆశించిన మోతాదులో కాకున్నా ఈ 'సంక్షేమ' పథకాలు పొందుతున్న వారిలో కొందరికి ప్రభుత్వంపై సదావగాహన కలుగుతున్నది. ఈ పథకాల్లో పైరవీకారులుగా తిరుగుతున్న నిరుద్యోగ యువకులు ప్రభుత్వంపై భ్రమలు కలిగేలా ప్రచారం చేయడం వల్ల ఒక సెక్షన్ ప్రధానంగా పెటీ బూర్జువా సెక్షన్ విప్లవోద్యమానికి దూరం జరుగుతున్నది.

## బలోపేతం అవుతున్న ఇన్‌ఫార్మర్ వ్యవస్థ- పెచ్చరిల్లిపోతున్న భౌతిక దాడులు

సంఘటితం అవుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి జిల్లా పోలీసు అధికారులు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. ప్రజల పేదరికాన్ని, ఉపాధిలేమి, నిరుద్యోగాలను ఇందుకు వనరుగా వుపయోగించుకుంటున్నారు. నిరుద్యోగ ఆదివాసీ యువకుల వివరాలను గ్రామాల వారిగా సేకరించి, వారిని పిలిపించి హోంగార్డ్, గిరిజన బెటాలియన్లలో భర్తీ చేసుకుంటున్నారు. ఇందులో కొందరు ట్రెయినింగ్ అయిన తర్వాత పోలీసు ఉద్యోగాల నుంచి పారిపోయి వచ్చినట్లుగా, కొండలు, గుట్టలు ఎక్కడం చేతగాని వారిలాగా వచ్చి గ్రామాల్లో వుంటూ ఇన్‌ఫార్మర్లను తయారు చేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు, వైద్యుల పేరిట గ్రామాల్లో వుంటున్నారు. కొంత మందికి పోలీసులే డబ్బులు ఇచ్చి దుకాణాలు పెట్టిస్తున్నారు. గ్రామాల్లో యూత్ క్లబ్‌లు పెట్టడం, ఆట వస్తువులు, టివీలు ఇవ్వడం, టోర్నమెంట్లు నిర్వహించడం లాంటి పోలీసు సంస్కరణలు అమలు చేస్తున్నారు. ఈ యూత్ క్లబ్‌లలో వుండే కొందరు యువకులు రహస్యంగా పూర్తికాలపు ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్నారు. అలాగే జులాయిగా తిరిగే యువకులను చేరదీసి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. వివిధ ప్రభుత్వ 'అభివృద్ధి-సంక్షేమ' పథకాల్లో లబ్ది పొందుతున్న వారిలో కొందర్ని రహస్యంగా పిలిచి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. ఇలా వివిధ పద్ధతుల్లో ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్నవారికి సెల్‌ఫోన్లు, మోటర్ సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఒకే గ్రామం నుండి నాలుగు అయిదు ఛానల్స్‌లో ఒకరికి తెలియకుండా మరొకరిని ఇన్‌ఫార్మర్లుగా నియమించుకుంటున్నారు.

అలాగే దళం సమాచారం తెలుసుకోవడానికి పిచ్చివాళ్ల పేరిట స్త్రీ ,పురుషులు లోతట్టు గ్రామాలల్లో తిరిగి పోతున్నారు. గోదావరి ఇరువైపుల వున్న శబరి, అశ్వరావుపేట ప్రాంతాల్లోకి పర్యాటకుల పేరిట అర్థం కాకుండా ఎస్.ఐ.బి పోలీసులు వస్తున్నారు. ఫారెస్టు గార్డ్‌ల పేరిట కూడా వచ్చి అడవిని, నీళ్ల తావులను పరిశీలించి పోతున్నారు.

మరొకవైపు గ్రామాలను నిర్బంధ క్యాంపులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలోని ప్రతి వ్యక్తీ పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖలు పెట్టే డ్వాక్రా, పొదుపు సంఘాలు,యూత్ క్లబ్‌లు, మహిళా మండళ్ల వంటి వాటిలో ఏదో ఒకదానిలో వుండేతీరుగా చూస్తున్నారు. పార్టీకి సహకరించి లేదా గ్రామ సంఘాల్లో పని చేసి అరెస్టు అయిన వారిని నయాన, భయాన లొంగదీసుకుంటున్నారు. దళాన్ని పట్టిస్తే లక్షల రూపాయలు ఇస్తామని, ఉద్యోగాలు ఇస్తామని ఆశలు చూపుతున్నారు. అరెస్టు అయిన మాజీలను గ్రామానికి ఒకరు చొప్పున ప్రతి రోజు పోలీసు స్టేషన్‌కు రావాలని షరతు పెట్టి పిలిపించుకుంటున్నారు. ఇలా ప్రతి రోజు దళానికి సంబంధించిన సమాచారం తమకు అందేలా యంత్రాంగాన్ని పటిష్టం చేసుకుంటున్నారు.

ఇలా దళాన్ని దెబ్బగొట్టగల నిర్దిష్టమైన, పటిష్టమైన సమాచారంతో పకడ్బందీగా సత్తుపల్లి, మారేడుమిల్లి, భద్రాచలంలో గల స్పెషల్ బలగాలతో దాడులకు పాల్పడుతున్నారు. ఇలా ఇప్పటికే శత్రువు కొనసాగించిన దాడిలో టైగర్ క్యాంపు వద్ద డిసెంబర్ 21, 2007న ఇద్దరు మహిళా కామ్రేడ్స్ అమరులు అయినారు. ఇన్‌ఫార్మర్ల ద్వారా అరెస్టు చేసి లంక ఎన్‌కౌంటర్‌లో దళ సభ్యుడు కా. శివను అరెస్టు చేసి హత్య చేసారు.

దళ సమాచారం తెలిసిన కొన్ని గంటల సమయంలోనే ఒక ప్రాంతాన్ని మొత్తం 15-20 బ్యాచ్‌లు చుట్టుముట్టి విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కూంబింగ్‌లో గ్రేహౌండ్స్, స్పెషల్, సి.ఆర్.పి బలగాలు పాల్గొంటూ పెద్ద పెద్ద కొండలను అలవోకగా ఎక్కుతూ విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈవిధంగా డిసెంబర్ నెలలో దళాలన్నీ రెండు నుండి ఏడు సార్లు తృటిలో ఎన్‌కౌంటర్ ప్రమాదాలను తప్పించుకున్నాయి.

కూంబింగ్‌కు వచ్చిన బలగాలు, ఒక్కో బ్యాచ్‌లో 25 నుండి 30 వరకు ఒక ప్లటూన్ సంఖ్యలో వుంటున్నారు. కంపెనీ ఫార్మేషన్‌లో వచ్చి ప్లటూన్ ఫార్మేషన్‌లో విడిపోతూ కలుస్తూ కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే ఈ బ్యాచుల వెంట మహిళా కానిస్టేబుళ్లు కూడా వస్తూ దళమని చెపుతూ ప్రజలను నమ్మించ చూస్తున్నారు. ప్రజలకు మందులిస్తూ చిన్న పిల్లలకు బిస్కట్లు, చాక్లెట్లు ఇస్తూ మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అడవిలో ప్రజలు కలిస్తే సాయంత్రం వరకు ఆపుకొని తిండి పెడుతున్నారు. దళం గురించి ఆరా తీస్తున్నారు. వారం రోజులపాటు మారేడుమిల్లి, టేకులేరు అడవిలో రెండు క్యాంపులు వేసి నీళ్ల తావులు, బాటల వెంట ఆంబుష్‌లు పెడుతున్నారు. ఒకరిద్దరు మహిళా కానిస్టేబుళ్లతో సహా 5-7 గురి టీం అడవి అంచుకొచ్చి, అక్కడి నుండి ఒకరు సాధారణ దుస్తులు ధరించి గ్రామంలోకి వెళ్తూ దళం అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

అలాగే ప్రభుత్వ రేషన్ షాపుల్లో ఎక్కువ బియ్యం ప్రజలకు ఇవ్వవద్దని దుకాణాదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారు. సంతల్లో ప్రజలు ఎక్కువ కూరగాయలు తెచ్చుకున్నా భౌతిక దాడులు చేసి హింసిస్తున్నారు. ఆటో డ్రైవర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారు.

మావోయిస్టు పార్టీకి సహకరిస్తున్నారనే పేరిట ప్రజలను అరెస్టు చేసి హింసించి అక్రమ కేసులు మోపి జైళ్లల్లో బంధిస్తున్నారు. ఇప్పటికీ శబరి, అశ్వరావుపేట ఏరియాల్లో సుమారు 10 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. పదుల సంఖ్యలో అరెస్టు చేసి, హింసించి పార్టీ సమాచారం చెప్పాలనే షరతుపెట్టి వదిలిపెట్టారు. గోదావరిపై బోట్లు నడిపే వారిని, చేపలు పట్టే వారిని అరెస్టు చేసి వేధింపులకు గురి చేసారు.

అభివృద్ధి నిరోధకులనీ, గిరిజనులను గిరిజనులతోనే చంపిస్తున్నారని జిల్లా పోలీసు అధికారులు మావోయిస్టు పార్టీపై

**పోరాటాలు**

## శ్రీకాకుళం డివిజన్‌లో గిట్టుబాటు ధరల పోరాటం

శ్రీకాకుళం డివిజన్‌లోని రెండు ఎ.సి పరిధిలలో రెండు చోట్ల గిట్టుబాటు ధరల పెంపుదలకై పోరాటాలు జరిగాయి.

ఇక్కడ ఆదివాసీలకు ప్రధాన ఆదాయాన్నిచ్చేది చింతపండు. ప్రతి కుటుంబం చింతపండు సీజన్‌లో రెండు, మూడు నెలల కాలం చింతపండు సేకరణ చేస్తారు. అలాగే స్వంత చింతచెట్ల ద్వారా వచ్చే పంటను తీసి అమ్ముకోవడం ప్రధానంగా వుంటుంది. శ్రీకాకుళం డివిజన్‌లోని శ్రీకాకుళం-విజయనగరం, ఒరిస్సాలోని రాయగఢ జిల్లా ఆదివాసీలకు చింతపండు దులపడం -అమ్ముకోవడం ఇదే ప్రధాన పని. ప్రతి సంవత్సరం ఆదివాసీలకు చింతపండు చేతికి రాకముందు మార్కెట్ ధర 50, 60 రూపాయలు వుంటే, పంట చేతికందగానే 4,5 రూపాయలకు పడిపోవడం సాధారణ విషయంగా మారింది. ఈ సంవత్సరంలో కూడా అదే పద్ధతిలో ధరలు పడిపోయి ఒరిస్సాలో 6 రూపాయలకు కిలో చొప్పున షావుకార్లు కొనుగోళ్లు చేశారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ 10 రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేయాలని నాగావళి ఏరియా పరిధిలో షావుకార్లను డిమాండ్ చేస్తూ పోరాటం జరిగింది.

ఈ ఏరియా పరిధిలోని ఒరిస్సా ప్రాంతంలో రెండు బ్లాక్‌ల పరిధిలోని ఆరు, ఏడు గ్రామాలలో దళం చింతపండు రేటు పెంపుదలకు ప్రచార కార్యక్రమాలు చేపట్టి, ఈ గ్రామాల నుండి హాజరైన 60 మంది ప్రజల సమక్షంలో 20 మంది షావుకార్లను పిలిపించి గిట్టుబాటు ధరలకై డిమాండ్ చేసింది. కొనుగోలు మొదలయిన తొలి రోజుల్లో కిలో చింతపండు ధర 4 నుండి 6 రూపాయల మధ్యన వుండేది. ప్రజల డిమాండ్ మేరకు 10 రూపాయలకు కొనుగోలు చేయాలని నిర్ణయం జరిగింది.

ఈ విజయం ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

కొండబారిడి ఏరియాలో - చింతపండు, కందుల రేటు పెంపుదలకు, పదిహేను గ్రామాలలో దళాలు ప్రచార కార్యక్రమం నిర్వహించాయి. ఫలితంగా కందుల రేటు పెంపుదలకు ఈ పదిహేను గ్రామాలకు చెందిన 200 మంది ప్రజలు ఇరవై మంది షావుకార్లను పిలిచి కిలో 14 రూపాయలు వున్న కందుల రేటును 16 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేసారు.

చింతపండు ప్రధానంగా గిరిజన సహకార సంస్థ (జి.సి.సి)నే కొనుగోలు చేస్తుంది. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా కొనుగోలు మొదలైన తొలి రోజుల్లో కిలో చింతపండు 4 రూపాయలకు కొన్నారు. కొండబారిడి, నాగావళి ఏరియాల నుండి 400 మంది ప్రజలు జి.సి.సి కేంద్రానికి వెళ్లి ధర్నా నిర్వహించి, చింతపండు రేటును 10 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. దీనితో వెంటనే అధికారులు దిగివచ్చి 8 రూపాయలకు కొనుగోలు చేస్తామని ప్రకటించారు.

ఇదే ఏరియాలోని గుమ్మలక్ష్మీపురం మండలంలో చింతపండు ధరను 6 నుండి 12 రూపాయలకు పెంచి జి.సి.సి కొనుగోలు చేయాలనీ పార్వతీపురం ఐ.టి.డి.ఎ ఆఫీస్ వద్ద ప్రజలు ధర్నా చేశారు. ఈ ధర్నాకు నీలకంఠాపురం ఏరియా నుండి కూడా ఆదివాసీ ప్రజలు వచ్చారు. అందరూ కలిసి డిఎం బయటకు రావాలని పెద్దగా నినాదాలు చేశారు. ప్రజలందరూ ఆఫీస్‌ను చుట్టు ముట్టడంతో తప్పని స్థితిలో డిఎం ఆదివాసీల ముందుకు వచ్చి ధరను 10 రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చాడు. ఈ ధర్నాకు బయల్దేరే ముందు ప్రజలు రెండు, మూడు రోజులైనా అక్కడే వుండి ధరను

---

విషప్రచారం సాగిస్తున్నారు. ఇంకోవైపు విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేస్తున్న విప్లవకారులను లొంగదీసుకోవడానికి కుటుంబాలతో కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తున్నారు. బియ్యం, బట్టలు, మందులు పంపిణీ చేస్తున్నారు. మీ పిల్లలు వచ్చినపుడు తీసుకొచ్చి సరెండర్లు చేయించమని విప్లవకారుల తల్లిదండ్రులకు చెప్పుతున్నారు. విప్లవకారుల తల్లిదండ్రులను 'అమ్మా, నాన్న' అని పిలుస్తూ వారి కుటుంబాలను గౌరవించినట్లు ఫోజు పెడుతున్నారు.

### కొనసాగుతున్న ప్రజా సహకారం

ఒకవైపు జిల్లాలో ఇంతటి నిర్బంధం పెరిగిపోతున్నప్పటికీ మరొకవైపు ప్రజలు శత్రు కళ్లుగప్పి విప్లవోద్యమంలో సంఘటితం కావడం పెరుగుతున్నది. పార్టీ ప్రజాసంఘాలు, మిలీషియాల్లో నిర్మాణయుతం కావడం జరుగుతున్నది. శత్రు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను దెబ్బతీసేలా మిలీషియా చర్యలు చేయడం ప్రారంభమైంది. ఇప్పటికే ఇన్‌ఫార్మర్లను శిక్షించడం, పోలీసులిచ్చిన సెల్ ఫోన్లు, టివిలు గుంజుకు రావడం జరుగుతోంది. పార్టీని, దళాలను కంటికి రెప్పలా కాపాడుకునే విధంగా ప్రజలు వివిధ రకాలుగా సహకరిస్తున్నారు. శత్రువు దళాలపై దాడులు చేసినప్పుడు గాయపడిన దళ సభ్యులను విడిపోయిన దళ సభ్యులను ఆదరిస్తూ, తిరిగి దళానికి చేరుస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటికీ జిల్లాలో బలోపేతం అయి వున్న ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ధ్వంసం చేస్తూ, శత్రు సాయుధ బలగాలను దెబ్బతీయగలిగితే విప్లవోద్యమం మరింతగా సంఘటితం కావడమే కాకుండా అభివృద్ధి చెంది తీరుతుంది.

★

సాధించుకోవాలని నిశ్చయించుకొని వెళ్లారు. కానీ మొదటి రోజే తమ సమస్య పరిష్కారం కావడంతో ఉత్సాహంతో తిరిగి వచ్చారు.

రాయగఢ జిల్లాలో ఆదివాసీల ఉత్పత్తులను షావుకార్లు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ, తూనికల్లో కూడా తీవ్రంగా దోపిడీ చేస్తుంటారు. ఆదివాసీల పంటలను ఒరిస్సాలో ప్రభుత్వం కొనుగోలు చేయకుండా షావుకార్లకు లీజ్‌లకు ఇచ్చి ఆదివాసీలపై మరింత దోపిడీకి తలుపులు బార్లా తెరిచింది. దీంతో షావుకార్ల దోపిడీకి అడ్డు లేకుండా పోయింది. పార్టీ పని చేస్తున్న ఏరియాల్లో షావుకార్ల దోపిడీనీ, తూనికల్లో మోసాలను అరికడుతూ గిట్టుబాటు ధరను సాధించుకోవాలనే స్పృహ పెరుగుతున్నది. అలా మొదలయిన చైతన్యంతో దేరువాడ ఎల్.ఒ.ఎస్ పరిధిలోని కుండగులాడి, ఉలువ శేష్‌కల్, కెరడ పంచాయితీల పరిధిలోని దాదాపు 20 గ్రామాలలో ప్రచారం చేసి, షావుకార్లను పిలిచి ధరల గురించి నిలదీయడం జరిగింది. షావుకార్లకు ప్రజలకు దాదాపు 2 గంటలు చర్చలు జరిగినా షావుకార్లు 7 రూపాయల కంటే ఎక్కువ ధర చెల్లించలేమని మాట్లాడారు. చివరకు పార్టీ 9 రూపాయలకు కొనుగోలు చేయమని డిమాండ్ చేసింది. కానీ షావుకార్లు మొండిగా కొనుగోలు ఆపివేసినారు. 9, 10 రూపాయలకు కొనలేమని కుట్ర పూరితంగా షావుకార్లందరూ సిండికేట్‌గా వ్యవహరించారు. షావుకార్ల మొండి వైఖరిని నిరసిస్తూ పోస్టర్లు వేసి ప్రచారం చేయడం జరిగింది. చివరకు 8 రూపాయలకు ధర నిర్ణయం జరిగింది. ఇటువంటి విజయం మొదటి అనుభవం కావడంవల్ల ప్రజల్లో మంచి విశ్వాసాన్ని ఇచ్చింది.

## ఈస్ట్ డివిజన్ పోరాటాలు

### అపరాల గిట్టుబాటు ధరకై

మన్యం ప్రాంతంలో రాజ్‌మా చిక్కుల్లు, కందులు, మినుములు తదితర అపరాలు(చిరుధాన్యాలు) విస్తృతంగా పండిస్తారు. అధిక వర్షాలుపడి పంట దిగుబడి తగ్గి రైతులకు నష్టం కలిగింది. జి.సి.సి కిలోకు 25 రూపాయలకే కొనుగోలు చేస్తుంది. 2007 డిసెంబర్‌లో ప్రజలు కిలోకి 50 రూపాయలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ, సంఘాలు ఈ డిమాండ్‌కు మద్దతుగా పోస్టర్లు, పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేశాయి. దీంతో షావుకార్లు మూడు రూపాయలు పెంచి కిలోకి 28 రూపాయలకు కొనుగోలు చేశారు.

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

### వాకపల్లి సంఘటనకు వ్యతిరేకంగా

వాకపల్లి సంఘటనను నిరసిస్తూ ఈస్ట్ డివిజన్ ప్రాంతంలోని బొంగరం, ఇంజెరి, నుర్మతి, లింగేటి పంచాయితీల నుండి ప్రజలు కదిలి మద్దిగరువు నుండి పులుసు మామిడి వరకు ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ చేశారు. మద్దిగరువులో సభను నిర్వహించగా రెండు వేల మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈస్ట్ డివిజన్‌లో సెప్టెంబర్ 26న బంద్ నిర్వహించగా పట్టణాలు, వ్యాపార, విద్యా సంస్థలూ, అన్ని వర్గాల ప్రజలు బందును పాటించి విజయవంతం చేశారు. ప్రతి పంచాయితీ పరిధిలో వాకపల్లి సంఘీభావ కమిటీలు ఏర్పడి కార్యక్రమాల్లో ప్రజల్ని కదిలిస్తున్నాయి.

ఈ సంఘటన తర్వాత వాకపల్లి గ్రామానికి సంస్కరణలు అమలుచేయాలని వచ్చిన అధికారుల్ని ప్రజలు నిలదీసి సంస్కరణలను తిరస్కరించారు. వాకపల్లి దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేశారు.

2007 సెప్టెంబర్‌లో గాలికొండ ఏరియాలోని వాకపల్లి బాధితుల సంఘీభావ కమిటీ నేతృత్వంలో ఏరియా వ్యాప్తంగా ప్రజలు విస్తృతంగా ప్రచారం చేశారు. పెద్దవలసలో వేయి మంది, కొయ్యూరులో రెండు వేల మంది, గూడెంలో 500 మందితో ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించారు. వాకపల్లి దోషుల్ని శిక్షించాలని స్థానిక ఎం.ఆర్.ఒలకు వినతిపత్రం సమర్పించారు.

### అమిడేలు అమరుల శవాల స్వాధీనంకై

అమిడేలులో పోలీసులు జరిపిన ఏకపక్ష కాల్పుల్లో కామ్రేడ్స్ విజయ, శ్వేత, షకీల, జీవన్‌లు అమరులయ్యారు. కా. షకీల, కా. శ్వేతల శవాలను వారి కుటుంబ సభ్యులు వచ్చి తీసుకుపోగా, కా. జీవన్ మృతదేహాన్ని తమ గ్రామ ప్రజలు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కా. విజయ శవం కోసం మూడు రోజులైనా తమ కుటుంబం వాళ్లు రాకపోవడంతో ఈ ప్రాంతంలోని కొన్ని గ్రామాల ప్రజలు స్టేషన్‌కు వెళ్లి శవాన్ని తమకు ఇవ్వాలని పోలీసులతో తీవ్ర ఘర్షణకు దిగి తీసుకుపోవడానికి సిద్ధమవుతున్న క్రమంలోనే విజయ బంధువులు వచ్చి శవాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. కా. విజయ స్మృతులు చెరిగిపోలేనివనీ, అమిడేలు అమరవీరులను గుర్తుచేసుకుంటూ సంస్మరణ సభను జరుపుకున్నారు. కా. విజయ పాడిన పాటలు పాడుకున్నారు.

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యనూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

అమిడేలు అమరుల శవాలను మోసిన యువకులను పోలీసులు అరెస్టు చేసి, అక్రమ కేసులు పెట్టినందుకు ప్రజలు ఆగ్రహించారు. అమరణనిరాహారదీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించి, ఆ యువకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అమిడేలు ఎన్‌కౌంటర్‌కు కారకుడయిన హోంగార్డును ఆ ప్రాంత మిలీషియా ఆ తర్వాత చంపి వేసింది.

*(...21వ పేజీ తరువాయి)*

గర్వించదగిన ఈ విప్లవ యువ తేజాలను ఆర్పివేసి దేశ భవిష్యత్తును చీకటిమయం చేయాలని బ్రిటీష్ ప్రభుత్వం కలలుకన్నది. కానీ ఈ విప్లవకారులు రగిలించిన జ్వాలను అది ఆర్పలేకపోయింది. ఆ తర్వాత నిరంతరం వేధించిన ప్రజాపోరాటాల జ్వాలలకు తట్టుకోలేక బ్రిటీష్ వాళ్లు దేశాన్ని వదిలిపోయారు.

బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయారు కానీ దేశానికి భగత్‌సింగ్ కోరుకున్న స్వాతంత్ర్యం రాలేదు. కేవలం అధికారమార్పిడి మాత్రమే జరిగింది. ఈ అధికారమార్పిడి వల్ల ప్రయోజనం పొందినదీ, పొందుతున్నదీ కేవలం దోపిడీవర్గాలే.

పేద ప్రజల బతుకులు రోజు రోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్షపాలన లేనప్పటికీ, నేడు పలు సామ్రాజ్యవాద దేశాల పట్టు మన దేశంపై పెరిగిపోతోంది. మరీ ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ నయావలస తరహాలో కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో భగత్‌సింగ్ కలలుగన్న స్వాతంత్ర్య సాధన కోసం పోరాడాల్సిన కర్తవ్యం మిగిలే వుంది.

ఈ కర్తవ్యాన్ని ఎప్పుడో తుంగలో తొక్కిన రివిజనిస్ట్ పార్టీలు నేడు భగత్‌సింగ్‌కు మేం వారసులం అంటున్నాయి. ఇది భగత్‌సింగ్ చరిత్రకు ద్రోహాన్ని తలపెట్టడమే. అంతేకాదు మతాన్ని భగత్‌సింగ్ చిన్నప్పటి నుండీ చివరి దాకా అసహ్యించుకున్నాడు. కానీ నేడు మతోన్మాద సంస్థయిన ఎ.బి.వి.పి భగత్‌సింగ్ తమ్ములం అని చెప్పుకోవడం సిగ్గుచేటు. ఇటువంటివారు భగత్‌సింగ్ జయంతులూ, వర్ధంతులూ జరుపుతూ, బూటకపు నివాళులు అర్పిస్తున్నారు. ప్రజల మనసుల్లో ముద్రించుకుపోయిన భగత్‌సింగ్ ప్రభావాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే కుట్రలే ఇవన్నీ.

కానీ భగత్‌సింగ్ కలలుకన్న సోషలిజం స్థాపనకొరకు మావోయిస్టు పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. భగత్‌సింగ్ ఆదర్శాన్నీ, సాహసాన్నీ, ఉత్తేజాన్నీ స్వీకరించిన ఎందరో మావోయిస్టు పార్టీ కార్యకర్తలు భగత్‌సింగ్ బాటలో దేశవిముక్తి కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పిస్తున్నారు. భగత్‌సింగ్ వారసత్వాన్ని సగర్వంగా కొనసాగిస్తున్నారు. ఇదే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి. ★

## సర్వే అధికారుల్ని నిర్బంధించిన ప్రజలు

మన్యం ప్రాంతమయిన దారకొండ పంచాయితీలోని ప్రజలు సర్వే కోసం వచ్చిన అధికారుల్ని 3 గంటలపాటు దిగ్బంధించి, మరోసారి మన్యంలోకి సర్వే కోసం వస్తే చంపివేస్తామని వారిని హెచ్చరించి వదిలివేశారు. ఇందులో వేయి మంది ప్రజలు పాల్గొన్నారు.

## మిలీషియా ప్రతిఘటన

డిసెంబర్5, 2007న ఆర్థిక దిగ్బంధనంలో భాగంగా కన్నవరం గ్రామం నుండి వెళ్తున్న నిరాయుధ మిలీషియాపై పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో మిలీషియా కామ్రేడ్స్ బంగారయ్య, నాగేష్, గోపాల్‌లు అమరులయ్యారు. వీరి శవాలను తీసుకెళ్తున్న పోలీసు బ్యాచ్‌కు రూట్ క్లియర్ చేయడం కోసం వచ్చిన పోలీసు బ్యాచీపై మిలీషియా నాలుగు మైన్లను పేల్చగా ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు కుక్కచావు చచ్చారు.

నవంబర్20, 2007న ఈదులబందలో ప్లటూన్‌పై పోలీసులు దాడి చేశారు. ఈ దాడి చేసి వెళ్తున్న పోలీసులపై దాడి చేయాలనే వుద్దేశంతో మిలీషియా మైను పెట్టి ఆంబుష్ ఏర్పాటు చేసింది. మైను పెట్టిన ప్రాంతానికి వచ్చిన పోలీసులు, మిలీషియాను గమనించి వెనక్కు వెళ్తున్న క్రమంలో, మిలీషియా మైన్ పేల్చింది. దాంతో పోలీసులు వెనుదిరిగి దారివెంట కాల్పులు జరుపుకుంటూ వెళ్లిపోయారు.

## పి.ఎల్.జి.ఏ ప్రతిఘటన

గుర్తేడు ఏరియా ఆరిజోల ప్రాంతంలో ఫిబ్రవరి 17, 2007న ఐదుగురితో కూడిన పి.ఎల్.జి.ఏ దళం అపార్చునిటీ ఆంబుష్ చేసింది. అడవి లోపలికి వచ్చి తిరిగి బయటకు వెళ్తున్న గ్రేహౌండ్స్ పోలీసులపై పి.ఎల్.జి.ఏ నాలుగు మైన్లను పేల్చడంతో ముగ్గురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడితో భయపడ్డ పోలీసులు రిట్రీట్ అవుతూ గాయపడిన వారిని తీసుకెళ్తూ దారివెంట కాల్పులు చేస్తూ వెళ్లిపోయారు.

ఈ ఆంబుష్ తర్వాత శత్రువు కూంబింగ్ తీవ్రతరం చేయడంతో పి.ఎల్.జి.ఏ మరోచోట ఆంబుష్ చేసింది. ఇందులో ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు.

అలాగే గుడ్లవాడ ప్రాంతంలో పి.ఎల్.జి.ఏ మకాం వేసిందన్న నిర్దిష్ట సమాచారం పోలీసులకు తెలిసి దాడికి వస్తున్న క్రమంలో సెంట్రీ చూసి మైన్ పేల్చి, కాల్పులు జరపగా ఒక గ్రేహౌండు కానిస్టేబుల్ చచ్చాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

## నిర్బంధాన్ని ధిక్కరిస్తూ వెలసిన స్థూపం

2006 మార్చి నెలలో పి.ఎల్.జి.ఏ బలగాలు చేసిన ఆర్.ఉదయగిరి రెయిడ్‌లో వీరోచితంగా పోరాడుతూ కా. సతీష్, కా. కిరణ్‌లు

అమరులయ్యారు. కా. సతీష్ స్మృత్యర్థం జి.మాడుగుల నుంచి మద్దిగరువు వెళ్లే తారు రోడ్డుపై స్థూపాన్ని నిర్మించాలని ప్రజల బలమైన ఆకాంక్ష. అయితే ఆ స్థూప నిర్మాణానికి కావాల్సిన సామాగ్రిని సమకూరుస్తున్న క్రమంలో పోలీసుల బెదిరింపులతో ఆగిపోయింది. మళ్లీ 2007 జూలై అమరవీరుల సంస్మరణవారాన్ని జరుపుకునేందుకు ప్రజలు స్థూప నిర్మాణం మొదలుపెట్టగా పోలీసుల నుండి హెచ్చరికలు వచ్చినాగానీ లెక్కచేయకుండా ఒక కిలోమీటర్ దూరంలో సెంట్రీలు పెట్టుకొని రాత్రికి రాత్రే ఐదు అడుగుల సిమెంట్ స్థూపాన్ని పూర్తిచేసి దానిపై ఎర్రజెండాను ఎగురవేశారు. కా. సతీష్ తల్లిదండ్రులతో పత్రికలు ఇంటర్వ్యూ చేస్తే 'నా కొడుకు రూపాన్ని స్థూపంలో చూసుకుంటాం' అని సగర్వంగా మాట్లాడారు. ఈ మండలంలోని మూడు గ్రామాల ప్రజలు సురిమెట్టలో సంస్మరణ సభను జరుపుకొని, నిర్బంధాన్ని ఎదుర్కోవడానికి అందరం సిద్ధంగా వుండాలని ప్రతిజ్ఞ చేశారు.

ఆ తర్వాత 2007, ఆగస్టు 14వ తేదీన జి.మాడుగుల ప్రాంతానికి కూంబింగ్‌కు వచ్చిన పోలీసులు ఈ స్థూపంపై వున్న ఎర్రజెండాను విరిచేసి, బూట్లతో తన్ని తుపాకీ మడమలతో స్థూపాన్ని కొట్టి, కూల్చడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలిసిన కా. సతీష్ తల్లిదండ్రులు, చుట్టుపక్కల గ్రామాలవాళ్లు స్థూపం దగ్గరకు చేరుకున్నారు. 'నా కొడుకు స్థూపం కట్టుకోవడం తల్లిదండ్రులుగా మా హక్కు', 'స్థూపాన్ని అవమానపరిచిన పోలీసులపై కేసు పెడ్తాం, కోర్టుకయినా వెళ్తాం.' 'నా కొడుకు జ్ఞాపకాలనైనా మిగల్చరా? దేశంలో ఎన్నో స్థూపాలు వెలిసాయి, అన్నీ కూలగొడతారా? కన్న కొడుకు స్మృతుల్ని చిదిమేస్తే చూస్తూ వూరుకోం' అని కా. సతీష్ తల్లిదండ్రులు మీడియా ద్వారా తెలియజెప్పారు.

ఈ ముసలి తల్లిదండ్రుల పోరాటం విప్లవకారుల కుటుంబాలకు అనుసరణీయం కావాలి. వీరి పోరాటానికి అందరూ మద్దతునివ్వాలి.

## ఆర్. ఉదయగిరి అమరుల స్మారక బస్‌షెల్టర్

కా. సతీష్ స్థూపం పక్కనే ప్రయాణీకుల సౌకర్యం కోసం వుదయగిరి అమరుల పేరిట బస్‌షెల్టర్ నిర్మించాలని అక్కడి ప్రజానీకం నిర్ణయించుకున్నారు. అందుకోసం షెల్టర్‌కు కావాల్సిన ఇసుక, రాళ్లు, సిమెంటును సమకూర్చుకొని, దాదాపు 10 రోజులపాటు శ్రమపడి నిర్మించారు. పైకప్పు కోసం రేకులు సకాలంలో రాకపోవడంతో, మళ్లీ పోలీసుల బెదిరింపులు మొదలయి నిర్మాణం ఆగిపోయింది. ఎప్పటికైనా ఈ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలు నిశ్చయంగా వున్నారు. కామ్రేడ్స్ సతీష్, కిరణ్‌ల పేరుతో శిలాఫలకాన్ని తయారు చేయించి అక్కడ నిలిపారు. ఏ నిర్బంధాలూ, నిషేధాలు అమరవీరులపై గల ప్రేమనూ, వారి ఆశయాలపట్ల వున్న విశ్వాసాన్ని అడ్డుకోలేవని ఈ ప్రజలు చాటారు.

★

---

*(...28వ పేజీ తరువాయి)*

యుద్ధంలో వారి వారి పాత్రను పోషించాల్సిందిగా ఆకాంక్షిస్తోంది. జైలు కామ్రేడ్ల ఈ సాహస కార్యంతో దండకారణ్య పోరాట ప్రజల ఆశయం మరింత బలోపేతం అవుతుంది. వారి పోరాట సామర్థ్యం మరింత ద్విగుణీకృతం అవుతుంది. ఈ విజయం దోపిడివర్గపు సల్వాజుడూం ముఖం మీద బలమైన దెబ్బ చరిచింది. దండకారణ్యంతో సహా దేశంలో వివిధ పోరాట క్షేత్రాలను విముక్తి ప్రాంతాలుగా మార్చాలని సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీకి సంబంధించిన చారిత్రాత్మక ఐక్యతా (9వ) కాంగ్రెస్ కర్తవ్యాన్ని నిర్ణయించింది. ఈ కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో జైలు కామ్రేడ్లు నిర్వహించిన 'జైలు బ్రేక్' ఒక గొప్ప ముందడుగు.

ఈ చారిత్రాత్మక జైలు బ్రేక్ నేపథ్యంలో తమ అసమర్ధతను కప్పి పుచ్చుకునేందుకు దోపిడి వర్గం కిందిస్థాయి అధికారులపైన తన ప్రతాపాన్ని చూపిస్తోంది. జైలు ఉద్యోగులను ఉద్యోగాల నుండి తొలగించే ఆదేశాలు జారీ చేస్తున్నది. ఇందులో భాగంగానే ఒక కింది స్థాయి జైలు అధికారిని 'దేశద్రోహ' నేరం కింద అరెస్టు చేసింది. ఉన్నతాధికారులను, మంత్రులను వదిలేసి ప్రభుత్వం సాధారణ ఉద్యోగులపైన తన ప్రతాపం చూపిస్తోంది. జైలు ఉద్యోగులూ కిందిస్థాయి అధికారులపట్ల ప్రభుత్వం యొక్క ఈ దమననీతిని సి.పి.ఐ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తోంది.

ఈ జైలు బ్రేక్ నేపథ్యంలో దేశంలోని అనేక జైళ్ళలో బందీలుగా వున్న విప్లవ ఖైదీలతో పాటు ఇతర ఖైదీలపై కూడా ప్రభుత్వం దమనకాండను పెంచేందుకు పథకాలు రచిస్తున్నది. ఇందులో భాగంగా క్రూరులైన అధికారులను నియమించి, జైళ్ళను నిర్బంధ శిబిరాలుగా మార్చేందుకు పన్నాగాలు పన్నుతోంది. ఎటువంటి న్యాయ సహాయం అందకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఇంటరాగేషన్ పేరుతో మానసికంగా హింసించేందుకు ప్రయత్నిస్తున్నది. జైలులో బందీలైన ఖైదీలపై జరుప తలపెట్టిన ఈ దమనకాండ ఆదేశాలను ప్రజలూ, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా వ్యతిరేకించాలి. అదే విధంగా జైలులోని విప్లవకారులను రాజకీయ ఖైదీలుగా పరిగణించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూ, జైలు ఖైదీల పోరాటాలకు సంఘీభావంగా ముందుకు కదలాలి.

★

*(...52 వ పేజీ తరువాయి)*

జైలు గదుల్లో రోజంతా బయటికి తీయకుండా నిర్బంధించారు. 1977 మార్చిలో అత్యవసర పరిస్థితి ఎత్తివేసే వరకు ఈ క్రూరమైన నిర్బంధ కాలం కొనసాగింది. 1977 మధ్యలో విడుదలైన తర్వాత, పూచికత్తు షరతుమీద ప్రభుత్వోద్యోగంలో కొనసాగడానికి నిరాకరించి, ఇతర కామ్రేడ్స్‌తో కలిసి సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీని స్థాపించి, క్రియాశీల విప్లవ జీవితంలోకి దూకాడు.

జైల్లో ఈ అన్వేషణ కొనసాగుతుండగా, 1977 చివరి అర్ధ భాగంలో బయటికి వచ్చే నాటికి నిర్దిష్టమైన పంథా, అవగాహనా రూపొందాయి. బయటికి వచ్చిన తర్వాత తమ పంథాకు దగ్గరగా వున్న సంస్థలతో కలిసేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ కామ్రేడ్స్ అనుకున్న సంస్థను స్థాపించటం ఆచరణ రూపం తీసుకోక, అప్పటికున్న ఆచరణపైననే కార్యక్రమం చేపట్టవలసిన అవసరం ముందుకొచ్చింది. 1978 నవంబర్‌లో సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీ స్థాపన జరిగి, నాయకత్వ సభ్యుల్లో ఒకరిగా కా. అజయ్ ఎన్నికయ్యాడు. అనంతరం కొన్ని చిన్న చిన్న గ్రూపులను కలుపుకోవటం కూడా జరిగింది. మరొక విలీనం తర్వాత 1982లో సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీ స్థాపన జరిగింది. కామ్రేడ్ అజయ్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీలోకి వచ్చాడు. 1987 కాన్ఫరెన్స్‌లో పి.యు పార్టీ సి.ఒ.సిలోకి ఎన్నికయ్యాడు. ఆయన అనేక స్థాయిల్లో పని చేశాడు. పార్టీ పత్రికల ప్రచురణ బాధ్యతను నిర్వహించాడు. ఇతర పార్టీలతో కలిసి అఖిల భారత సాంస్కృతిక సంస్థను స్థాపించడానికి పి.యు తరపున బాధ్యుడిగా పని చేశాడు.

మొదట్లో, 1978-79లలో విద్యార్థి సమాఖ్యకు బాధ్యుడిగా వున్నాడు. నాడియా జిల్లాలో జరిగిన వీరోచిత రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించాడు. హౌరా, హుగ్లీలలో కూడా పని చేశాడు. హుగ్లీలో పని చేస్తూ హల్దియా పారిశ్రామిక ప్రాంతంలో సంబంధాలను పెంపొందించుకుని, అక్కడ కొంత పనిని అభివృద్ధి చేశాడు. ఖరగ్‌పూర్‌కు వెళ్లి పని చేశాడు. 1978-79లలో కొంతకాలం ఒరిస్సాలోని బండా ముండలో రైల్వే కార్మికుల్లో పని చేయడానికి తిరిగాడు.

సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీ, సి.పి.ఐ (ఎం-ఎల్) పీపుల్స్‌వార్‌లు విలీనమైనప్పుడు కామ్రేడ్ అజయ్ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగాడు. ఆ తర్వాత 2001లో జరిగిన పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్‌లో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2004లో ఎం.సి.సి.ఐ, పీపుల్స్‌వార్ విలీనమై మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించినపుడు నూతన పార్టీలో కామ్రేడ్ అజయ్ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగాడు. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్ (9వ) కాంగ్రెస్‌లో సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యాడు.

ఈ కాలమంతా కామ్రేడ్ అజయ్ బెంగాల్ ఉద్యమ అభివృద్ధిలో తగిన పాత్ర పోషించాడు. 2000 నుంచి స్కోప్ (సబ్ కమిటీ ఆన్ పొలిటికల్ ఎడ్యుకేషన్) బాధ్యుడిగా పని చేశాడు. అలాగే కేంద్ర రాజకీయ పత్రికకు సంపాదకుడిగా పని చేశాడు.

కామ్రేడ్ అజయ్ అనేక పోరాటాల్లో, రాజకీయ చర్చల్లో పాల్గొన్నప్పటికీ ఎల్లప్పుడూ కార్మికవర్గ పార్శ్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించేవాడు. ఎల్లప్పుడూ నిరాడంబరంగా వుండేవాడు. ప్రియతమ కామ్రేడ్ అజయ్‌దా తన నిత్యావసర ఖర్చుల విషయంలో కూడా జాగ్రత్త వహించేవాడు. బెంగాలీ సాహిత్యం పట్ల అమితాసక్తిని చూపించే అజయ్‌దా ఎల్లప్పుడూ మంచి పుస్తకాల కోసం శోధించేవాడు. చివరి శ్వాస వరకు అంకిత భావంతో పని చేసిన కమ్యూనిస్టు. తన సహచర కామ్రేడ్లలో, పార్టీలో, సానుభూతిపరుల్లో తను కలిసిపోయి, కళ్లద్దాల చిరునవ్వు ముఖంతో, విప్లవానికే అంకితమైన అమర కమ్యూనిస్టు, మన ప్రియతమ నేత కామ్రేడ్ అజయ్‌దా ఇక మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు ఎల్లప్పుడూ మనల్ని ముందుకు నడిపిస్తాయి.

★

---

*(...43వ పేజీ తరువాయి)*

తన ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి బి.జె.పి శతవిధాల ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు. ఆ 'ప్రయత్నం' అనేది ఎంత రక్తపాతాన్ని అయినా సృష్టించవచ్చు.

ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవాలంటే హిందూ మతోన్మాదంతో పోరాడాలి. లౌకికవాదాన్ని బలోపేతం చేయాలి. అయితే ప్రస్తుత సమాజంలో మతోన్మాదానికి అడ్డుకట్ట వేయడమూ లౌకికవాదాన్ని స్థాపించడమూ సాధ్యం కాదు. ఎందుకంటే సొంత ఆస్తి పునాదిని కాపాడ్డం కోసం మతం ఒక శక్తివంతమైన ఉపరితలంగా పని చేస్తుంది. సొంత ఆస్తిని కాపాడటానికి ఉనికిలోకి వచ్చిన రాజ్యం మతంతో అంటకాగుతుంది. దానిని పెంచి పోషిస్తుంది. కాబట్టి మతోన్మాదంతో పోరాడాలంటే సొంత ఆస్తి పునాదితో పోరాడాలి. దాన్ని పదిలంగ కాపాడుతున్న రాజ్యంతో పోరాడాలి. అంటే మతోన్మాద వ్యతిరేక పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా, రాజ్యాధికార స్వాధీన పోరాటంతోనే ముందుకు సాగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకూ, ప్రజాస్వామిక వాదులకు అర్థం చేయిస్తూ, విప్లవోద్యమం వారిని సమీకృతులను చేయాలి. ★

# కామ్రేడ్ అజయ్ (పరిమళ్‌సేన్)కు అరుణారుణ జోహార్లు

సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడూ, పార్టీలోని నక్సల్బరీ తరానికి చెందిన విశేషానుభవం గల నేతల్లో ఒకరైన కామ్రేడ్ అజయ్ (పరిమళ్‌సేన్) సెరిబ్రల్ మలేరియా వల్ల 2007, ఆగస్టు 15న తుదిశ్వాస విడిచారు. 64 సంవత్సరాల వయస్సు పైబడిన కామ్రేడ్ పరిమళ్‌సేన్ 1970లలో అలిన్‌గాను, ఆ తర్వాత అమరుడయ్యే వరకు అజయ్ గానూ చిరపరిచితుడు.

కా. పరిమళ్‌సేన్ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాల పట్ల ఆకర్షితుడయ్యాడు. నక్సల్బరీ వెల్లువ తర్వాత సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ నాయకత్వంలోని నక్సల్బరీ విప్లవోద్యమంలో నేరుగా పాల్గొన్నాడు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన పరిమళ్‌సేన్‌కు తోబుట్టువులు కూడా వున్నారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.కాం పట్టా పుచ్చుకున్నాడు. చదువు పూర్తి చేసిన తర్వాత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో ఉద్యోగిగా చేరి కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఆసరాగా నిలిచాడు. మావో నాయకత్వంలోని సి.పి.సి నిర్వహించిన గ్రేట్ డిబేట్‌తో ఉత్తేజితుడై డాంగే నాయకత్వంలోని సి.పి.ఐతో విభేదించి సి.పి.ఐ (ఎం) పార్టీలో చేరాడు. ఆనాటి యువతరపు కమ్యూనిస్టులను తీవ్రంగా ప్రభావితం చేసిన మహత్తర సాంస్కృతిక విప్లవోద్యమం పరిమళ్‌ను కూడా తాకింది. అదే సమయంలో నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో సి.పి.ఐ (ఎం) నయా రివిజనిస్టు స్వరూపం నగ్నంగా బయటపడింది. వందలాది నిజమైన కమ్యూనిస్టులవలె కామ్రేడ్ అజయ్ కూడా విప్లవ ప్రవంతిలో చేరాడు. ఆనాడు డల్హౌసీ స్క్వేర్‌గా పేరు పడిన నేటి బి.బి.డి బాగ్ సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ యొక్క నక్సల్బరీ రాజకీయాలను వ్యాపింపజేయడానికి ప్రారంభంలో అతని కేంద్రంగా వుండేది. ఇక్కడ అనేక ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలుండేవి. రాజ్య నిర్బంధం భయంకర రూపందాల్చి, అనేక మంది కేంద్ర నాయకత్వం అరెస్టులు, హత్యలూ జరుగుతున్న సమయంలో కూడా పార్టీకి చెందిన డల్హౌసి యూనిట్ గ్రూప్ కార్మికులను సమన్వయం చేయటంలో ప్రముఖ పాత్ర వహించింది.



సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీలో చేరిన తర్వాత కలకత్తాలోని డల్హౌసి పార్టీ కమిటీలో పని చేశాడు. ఉద్యమం వెనుకపట్టు పట్టి, అనేక మంది కామ్రేడ్స్ దిగజారిపోతున్న సమయంలో 1972-73వ సంవత్సరాలలో మన ప్రియతమ నేత కామ్రేడ్ పరిమళ్‌సేన్ (అజయ్) చాలా ప్రముఖ పాత్ర పోషించాడు. 1971-72లో విప్లవ బలగాలు తిరోగమించిన ఏరియాలన్నింటా ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ గూండాలు నేరపూరిత ప్రతిరోధ్ బాహినీలు (ప్రతిఘటన బలగాలు)గా తయారై తెల్ల బీభత్సం పైచేయి సాధించిన సమయమది. కలకత్తా నగరం అంతటా భయోత్పాత వాతావరణం అలుముకుంది. దృఢ నిశ్చయుడైన అజయ్‌దా మరికొందరు నిబద్ధత గల విప్లవకారులతో కలిసి కొడిగడుతున్న విప్లవ కార్యక్రమాల జ్వాలను తను పని చేసే ప్రాంతంలో సజీవంగా నిలబెట్టాడు. అనంతరం సి.పి.సి పదవ కాంగ్రెస్ జరిగిన తర్వాత లిన్ పియావో సమస్య మీద సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ రెండుగా చీలిపోయింది. కామ్రేడ్స్ అజయ్, మహదేవ్ ముఖర్జీ నాయకత్వంలోని సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీలో ఉండి, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు.

కామ్రేడ్ అజయ్ మరికొందరు కామ్రేడ్స్‌తో కలిసి 1974లో మహదేవ్ ముఖర్జీ గ్రూపుతో విడిపోయిన కొద్ది రోజులకే అరెస్టయ్యాడు. సెకండ్ సి.సి ఎత్తుగడల భ్రమలో నుండి బయటపడి మరికొందరు కామ్రేడ్స్‌తో కలిసి తనకు తానుగా ఉండి పోయాడు. కలకత్తాలోని ప్రెసిడెన్సీ జైలులో వున్నప్పుడు గత తప్పుల గురించి పునరాలోచనలో పడ్డాడు. పోలీసులు తీవ్రమైన చిత్రహింసలు పెట్టారు. చేయి విరగగొట్టి, 1975లో బర్ద్వాన్ జైలు నుంచి కొంత కాలం ప్రెసిడెన్సీ జైలుకు మార్చారు. ఇక్కడ 1976 ఫిబ్రవరి 25న కామ్రేడ్ అజయ్, మరికొందరు చారుమజుందార్ అనుకూల వాదులతో కలిసి జైలు నుండి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అది విఫలంకాగా, వీరందర్నీ ఇతరుల నుండి విడదీసి ప్రత్యేకమైన

*(మిగతాది 51వ పేజీలో...)*